ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రి



4 అణాలు
19-1-'55

NDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



"మధురానగరిలో చల్ల నమ్మబోదు."

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 48
సంచిక 21
19-1-55

Founder : K. NAGESWARA RAO

జయ పుష్య బహుళ ఏకాదశి బుధవారం



వరాముష్య

బారిష్టరు గారి బాత్ఖానీ

ముక్కపాటి నరసింహశాస్త్రి

ఈ కాలం కుర్రాళ్ళకు చాలామందికి తెలియకపోవచ్చు కాని, మా చిన్నతనంలో కాపీబుక్కులుండేవి. ప్రతి రోజూ కొన్ని కాపీలు వ్రాస్తుండేవాళ్ళం విధిగా. వాటికి కొన్నాళ్ళు మేష్టర్లు వరవడులు వ్రాసి ఇచ్చేవారు. తరువాత తరువాత అచ్చుకాపీలు వచ్చినాయి. మన సుఖజీవనానికి, ప్రతినిత్యం, ప్రతి వాళ్లూ, అత్యవసరంగా, అనుసరించవలసిన సూత్రాలు వరవడిగా ఉండేవి: అసత్యము ఆడరాదు. బంధువులను ప్రేమించవలెను. అహింసరో పరమధర్మము - వెందతైనవి. ఇలాటివి మనకే కాదు. ఇంగ్లీషువాళ్లకూ ఉండేవి. వాళ్లజోలి మనకెందుకంటారా! శుభం - మనకు కాపీబుక్కు ధర్మాలే కాక, మతసంబంధమైనవి, తత్వసంబంధమైనవి, లౌకికములు, అలౌకికములు అనేకం అనుశ్రుతంగా కూడా వస్తున్నాయి.

కాని, ఏ కాపీబుక్కులోనూ ఎన్నడూ ఎక్కనివీ, ఏ ధర్మానికి కాని, మతానికి కాని, సాంప్రదాయానికి కాని, సంస్కృతికి కాని, సంబంధించని సూత్రాలు ఒకటి రెండు మనకు ఎలాగో వచ్చిపడ్డాయి. అవి ఎప్పుడొచ్చాయో, ఎలా వచ్చాయో తెలుసుకుందామని ఎంత ప్రయత్నించినా, వాటి అంతు దొరకలేదు. ఎప్పుడొచ్చినా, ఎలా వచ్చినా, మన జీవితాలమీద, ఈ ధర్మసూత్ర ప్రభావం అమితంగా ఉన్నదనిమట్టుకు గ్రహించాను. అదేమిటంటారా! 'పోనిద్దురూ! మనకెందుకు!' అనడం. ఆంధ్రదేశంలో, ప్రతివాడినోటా, ప్రతినిత్యమూ, ఏదో సందర్భంలో ఈ సూక్తి వినపడుతూనే ఉంటుంది. దాని పుట్టుపూర్వోత్తరాలు ఇప్పుడు మనకెందుకు కాని, దానివల్లమట్టుకు మనకు ప్రతినిత్యం, రూపాయిలు, అణాలు, పైసలలో లెక్కతేల్చడానికి వీలుచిక్కదుకాని, కోలెడంత కష్టంమట్టుకు కలుగుతోందని నిస్సందేహంగా చెప్పవచ్చును. మీరు కొస్త జాగ్రత్తగా గమనిస్తే దీని యాథార్థ్యం మీకూ తెలుస్తుంది. మనం చాలామందిమి, అప్రయత్నంగానే చట్టబద్ధులం - చట్టసమ్మతం కాని పనికాని, ధర్మవిరుద్ధమైన పనికాని చటుక్కున చెయ్యలేం. అలాటి వాళ్లలో నేనూ ఒకడిని. ఎటొచ్చీ మీ కంటె నాకు పట్టింపు కొంచెం ఎక్కువనుకోండి. మాటవరుసకు చెపుతున్నాను - గొప్పకోసం అనుకోకండేం. మద్రాసులో అమధ్యను నీళ్ళకరువు వచ్చింది చూడండి. అరోజుల్లో ఎవరేనా కుళాయి తిప్పి, నీళ్లు వాడుకుని వాళ్ళు కుళాయి కట్టెయ్యకపోతే నాకు తోచేదికాదు. ఏమిటంత తెలివితక్కువగా ఉంటారేమా అనుకుని, నేను వెళ్లి ఆ కుళాయి కట్టేసివచ్చేవాడిని. నడిచే దారిలో ముళ్లో, మేకో, అరటిపండు తొక్కో ఉంటే వాటి నక్కడనుంచి తీసి అవతల పారేసేవరకూ నాకు తోచేదికాదు. పక్కనున్న వాడెప్పుడూ మీకెందుకు పోనిద్దురూ అనేవాడు. నాకు కష్టంగా ఉండేది.

నేను తరుచు రైలులో ప్రయాణంచేస్తూ ఉంటాను. టిక్కట్టు లేనివాళ్ళూ, ముష్టివాళ్లూ, కుష్ఠురోగులూ, ప్రతి స్టేషనులోనూ ఎక్కుతూ ఉండడం పరిపాటేకాదూ. ప్రతిసారీ నేను వాళ్లను లోపలికి రావద్దని అడ్డుపెట్టేవాడిని. అతక్షణం ఎవడో పక్కనుంచి 'మనకెందుకు పంతులుగారూ! పోనిద్దురూ ఎక్కనివ్వండి' అనేవాడు. అలాగే! ఎక్కనిస్తాను. మీ వూరు తీసుకువెళ్లి, ఒక్కపూట మీరు వాళ్లకు తిండీ, తిప్పలూ ఏమీ పెట్టనక్కరలేదు కాని, మీ అరుగుమీద పడుకోనిస్తారా' అన్నాను ఒకటి రెండు సార్లు. దానితో వాళ్లకు కోపం వచ్చి నాతో పెద్దవాదం వేసుకున్నారు. వాళ్లు అన్నదానికల్లా నేనేదో సమాధానం చెప్తూనే ఉన్నాను. పెట్టెలో ఉన్నవాళ్ళంతా 'పోనిద్దురూ! మీకెందుకు ఊరుకోండురూ' అని నాకు చెప్పడమే కాని, అవతలవాళ్లను మందలించిన వాడొక్కడూ, ఎప్పుడూ, నాకు కనపడలేదు.

మా వూళ్లో ఒకాయన ఉండేవాడు. చాలా తెలివైనవాడూ, బాగా చదువుకున్నవాడూను. ఏ అష్టం వచ్చినా తను తప్పించుకుపోయేవాడు. ఎవరు ఎన్నివిధాల ఆయనను రెచ్చగొట్టి వాదంలోకి దింపాలన్నా దొరికేవాడు కాడు. తడిచేతిలోనుంచి సబ్బు జారిపోయినట్లు జారిపోయేవాడు.

ఒకసారి ఒకాయన, ఈ పెద్దమనిషి వింటుండగా 'అరే, బలే కాకి. తెల్లకాకి ఉన్నదని వినడమే కాని ఎక్కడా చూడలేదా. మన కళ్లఎదుటే ప్రత్యక్షమయిందన్నాడు. ఏది,

విషయానుక్రమణిక

ముఖచిత్రం: నాగిరెడ్డిగారి "అర్థాంగి" లో సావిత్రి.

వీధి అంటూ నాలుగు పక్కలా చూశాం. మామూలుకాకే కనపడ్డది. 'ఏదోయి - తెల్ల కాకి అంటివి' అన్నా డీయన. అదేనండి. మీ ఎదురుగా - కొంగలా ఎంత తెల్లగా ఉందో చూడండి - అన్నాడు. 'ఒహో! అదా. కాకా. తెల్లగా ఉందంటావా. అహాఁ - అలాగా' అని ఊరుకున్నాడు. మరొకడైతే. గాడిదా నన్ను వేళాకోళం చేస్తావా అని కొట్టవచ్చే వాళ్ళు. 'ఏమిటండీ, మనవా డేదో మాటవరసకు అంటే మీరుకూడా అది తెలుపా అని నీళ్లు నములుతారేమిటన్నాను. 'పోనిద్దూ నాయనా! అతనితో మనకు వాదం ఎందుకూ. అలాగా అంటే తేలిపోయె' అన్నాడు చిరునవ్వు నవ్వుతూ!

ఒకసారి మా బంధువులఇంటికి, ఒక పల్లెటూరు వెళ్లాను. అక్కడ ఒకనాటి సాయంకాలం, నేనూ, మా చుట్టాలు ఒకరిద్దరు, నలుగురైదుగురు గ్రామస్థులూ కలిసి, చెరువుగట్టు మీద కూర్చున్నాం, కబుర్లు చెప్పుకుంటూ. మాకు అర ఫర్లాంగు దూరంలో చేలో ఏడెనమండుగురు జనం ఒకచోట కేకలేసుకుంటున్నారు. వాళ్లి కేకలు అస్పష్టంగా మాకు వినపడుతూనే ఉన్నాయి. సూర్యాస్తమయం కావడంచేతను వాళ్లు కొట్టుకొంటున్నారేమో మాకు బాగా కనపడలేదు కాని కొట్టుకుంటున్నట్టు మట్టుకు మాకు అనుమానమే.

'కొట్టుకుంటున్నట్లున్నారు. రండి. విడిపిద్దాం' అంటూ నేనూ మరో యువకుడూ లేచాం. తక్కినవాళ్లు మమ్మల్ని రెక్కట్టుకు కూర్చోపెట్టారు. వాళ్లందరి దృష్టి మట్టుకు ఎదట తగాదామీదనే ఉన్నది. ఒక్క క్షణంలో అక్కడ కేకలు తగ్గి జనం తిరుగుముఖం పట్టినట్టు మాకు అనుమానమేసింది. మాలో ఒకాయన తొందరగా లేచి 'రండి పోదాం' అని, మా సమాధానం కోసం ఆగకుండానే బయలుదేరాడు. నేమూ లేచాం. మరో అరగంటకు ఆచేలో దొమ్మీ జరిగిందని ఊరంతా గుప్పుమంది. మాలోవాళ్లకు ఆసంగతి ముందే తెలిసిందన్నమాట. నేను హడలిపోయి మాబృందంఒక్కొక్కళ్ళ దగ్గరకూ వెళ్లి, 'ఇది చాలా అన్యాయం! ఇప్పుడేనా మనం వెళ్లి పోలీసుకు రిపోర్టు ఇద్దాం' అంటే అందరిదగ్గరనుంచీ సమిష్టిగానూ వ్యష్టిగానూ ఒక్కటే సమాధానం వచ్చింది...'పోనిద్దురూ మనకెందుకు. దానిలో చాలా చిక్కులున్నాయి. దొమ్మీ రూపెలా ఉన్నా, మధ్యను మనం గమ్మవుతాం' అని.

ఈ దిక్కుమాలిన మనస్తత్వం మన కెం- వచ్చిందంట. దాని దుంపతెగిరి. ఎలాగో వచ్చిందండి. ఇందులోనుంచి బయటపడడమెలాగ. లేకపోతే మన నిత్యవ్యవహారాలెలా సాగుతాయి. ఎన్ని అవకతవకలు వస్తాయి. ఎన్ని చిక్కులలో పడిపోతాం అని నేను ఎప్పుడూ ఆలోచిస్తూఉంటాను. 'ఎవ్వరికీ లేనిబాధ మీ కెందుకండీ. భూభారం అంతా మీ రొక్కరే మోస్తున్నారా ఏమిటి' అంటుంది మా ఆవిడ. నిజమేకాని, ఎందుచేతనో నేను అలా సరిపెట్టుకు ఊరుకోలేను.

ఆ మధ్యను, కొంతకాలం క్రితం, ప్రతి గ్రామంలోనూ దోపిడీలూ, కుప్పలు తగలపెట్టడం జరిగింది. జ్ఞాపకం ఉన్నదా. ప్రతి గ్రామంలోనూ జనం హడలిపోయారు. ఈ

బారిష్టరు గారి బాతాఖానీ

మొక్కపాటి నరసింహశాస్త్రి

ఈ కాలం మనవాళ్ళకు చాలామందికి తెలియకపోవచ్చు కాని, మా చిన్నతనంలో కాపీబుక్కులుండేవి. ప్రతి రోజూ కొన్ని కాపీలు వ్రాస్తుండేవాళ్ళం విధిగా. వాటికి కొన్నాళ్ళు మేష్టర్లు వరవడులు వ్రాసి ఇచ్చేవారు. తరువాత తరువాత అచ్చుకాపీలు వచ్చినాయి. మన సుఖజీవనానికి, ప్రతినిత్యం, ప్రతివాళ్లూ, అత్యవసరంగా, అనుసరించవలసిన సూత్రాలు వరవడిగా ఉండేవి: అసత్యము ఆడరాదు. బంధువులను ప్రేమించవలెను. అహింసయే పరమధర్మము — మొదలైనవి.

విషయానుక్రమణిక

ముఖచిత్రం: వాహినీవారి "అర్ధాంగి" లో సావిత్రి.

ఇలాటివి మనకే కాదు. ఇంగ్లీషువాళ్ళకూ ఉండేవి. వాళ్ళ జోలి మనకెందుకంటారా! సరే — మనకు కాపీబుక్కు ధర్మాలే కాక, మతసంబంధమైనవి, తత్వసంబంధమైనవి, లౌకికములు, అలౌకికములు అనేకం అనుశ్రుతంగా కూడా వస్తున్నాయి.

కాని, ఏ కాపీబుక్కులోనూ ఎన్నడూ ఎక్కనివి, ఏ ధర్మానికి కాని, మతానికి కాని, సాంప్రదాయానికి కాని, సంస్కృతికి కాని, సంబంధించని సూత్రాలు ఒకటి రెండు మనకు ఎలాగో వచ్చిపడ్డాయి. అవి ఎప్పుడొచ్చాయో, ఎలా వచ్చాయో తెలుసుకుందామని ఎంత ప్రయత్నించినా, వాటి అంతు దొరకలేదు. ఎప్పుడొచ్చినా, ఎలా వచ్చినా, మన జీవితాలమీద, ఈ ధర్మసూత్ర ప్రభావం అమితంగా ఉన్నదని మట్టుకు గ్రహించాను. అదేమిటంటారా! 'పోనిద్దురూ! మనకెందుకు!' అనడం. ఆంధ్రదేశంలో, ప్రతివాడినోటా, ప్రతి నిత్యమూ, ఏదో సందర్భంలో ఈ సూక్తి వినపడుతూనే ఉంటుంది. దాని పుట్టుపూర్వోత్తరాలు ఇప్పుడు మనకెందుకు కాని, దానివల్ల మట్టుకు మనకు ప్రతినిత్యం, రూపాయిలు, అణాలు, పైసలలో లెక్క తేల్చడానికి వీలుచిక్కదు కాని, కొండంత కష్టం మట్టుకు కలుగుతోందని నిస్సందేహంగా చెప్పవచ్చును. మీరు కొంత జాగ్రత్తగా గమనిస్తే దీని యాథార్థ్యం మీకూ తెలుస్తుంది. మనం చాలామందిమి, అప్రయత్నంగానే చట్టబద్ధులం — చట్టసమ్మతం కాని పనికాని, ధర్మ విరుద్ధమైన పనికాని చటుక్కున చెయ్యలేం. అలాటి వాళ్లలో నేనూ ఒకడిని. ఎటొచ్చీ మీ కంటె నాకు పట్టింపు కొంచెం ఎక్కువనుకోండి. మాటవరుసకు చెప్తున్నాను — గొప్పకోసం అనుకోకండేం. మద్రాసులో ఆమధ్యను నీళ్ళకరువు వచ్చింది చూడండి. ఆరోజుల్లో ఎవరైనా కుళాయి తిప్పి, నీళ్లు వాడుకుని వాళ్ళు కుళాయి కట్టెయ్యకపోతే నాకు తోచేదికాదు. ఏమిటంత తెలివితక్కువగా ఉంటారేమా అనుకుని, నేను వెళ్లి ఆ కుళాయి కట్టేసివచ్చేవాడిని. నడిచే దారిలో ముల్లో, మేకో, అరటిపండు తొక్కో ఉంటే వాటి నక్కడనుంచి తీసి అవతల పారేసేవరకూ నాకు తోచేదికాదు. పక్కనున్న వాడెప్పుడూ మీకెందుకు పోనిద్దురూ అనేవాడు. నాకు కష్టంగా ఉండేది.

నేను తరుచు రైలులో ప్రయాణం చేస్తూ ఉంటాను. టిక్కట్టు లేనివాళ్ళూ, ముష్టివాళ్లూ, కుష్టురోగులూ, ప్రతి స్టేషనులోనూ ఎక్కుతూ ఉండడం పరిపాటే కాదూ. ప్రతిసారీ నేను వాళ్లను లోపలికి రావద్దని అడ్డుపెట్టేవాడిని. ఆతక్షణం ఎవడో పక్కనుంచి 'మనకెందుకు పంతులుగారూ! పోనిద్దురూ ఎక్కనివ్వండి' అనేవాడు. అలాగే! ఎక్కనిస్తాను. మీ ఊరు తీసుకువెళ్లి, ఒక్కపూట మీరు-వాళ్లకు తిండీ, తిప్పలూ ఏమీ పెట్టనక్కరలేదు కాని, మీ అరుగుమీద పడుకోనిస్తారా' అన్నాను ఒకటి రెండు సార్లు. దానితో వాళ్లకు కోపం వచ్చి నాతో పెద్దవాదం వేసుకున్నారు. వాళ్లు అన్నదానికల్లా నేనేదో సమాధానం చెప్తూనే ఉన్నాను. పెట్టెలో ఉన్న వాళ్ళంతా 'పోనిద్దురూ! మీకెందుకు ఊరుకోండురూ' అని నాకు చెప్పడమే కాని, అవతలవాళ్లను మందలించిన వాడొక్కడూ, ఎప్పుడూ, నాకు కనపడలేదు.

మా వూళ్లో ఒకాయన ఉండేవాడు. చాలా తెలివైనవాడూ, బాగా చదువుకున్నవాడూను. ఏ అడ్డం వచ్చినా తను తప్పించుకుపోయేవాడు. ఎవరు ఎన్ని విధాల ఆయన్ను రెచ్చకొట్టి వాదంలోకి దింపాలన్నా దొరికేవాడు కాడు. తడిచేతిలోనుంచి సబ్బు జారిపోయినట్లు జారిపోయేవాడు.

ఒకసారి ఒకాయన, ఈ పెద్దమనిషి వింటుండగా 'అరే, బలే కాకి. తెల్లకాకి ఉన్నదని వినడమే కాని ఎక్కడా చూడలేదా. మన కళ్లఎదుటే ప్రత్యక్షమయిందన్నాడు. ఏది,

ఏదీ అంటూ నాలుగు పక్కలా చూశాం. మామూలు కాకే కనపడ్డది. 'ఏదోయి - తెల్ల కాకి అంటివి' అన్నాడీయన. అదేనండీ. మీ ఎదురుగా - కొంగలా ఎంత తెల్లగా ఉందో చూడండి - అన్నాడు. 'ఒహో! అదా. కాకా. తెల్లగా ఉందంటావా. అహఁ - అలాగా' అని ఊరుకున్నాడు. మరొకడైతే. గాడిదా నన్ను వేళాకోళం చేస్తావా అని కొట్టవచ్చే వాళ్ళు. 'ఏమిటండీ, మనవాడేదో మాటవరసకు అంటే మీరుకూడా అది తెలుపా అని నీళ్లు నములుతారేమిటన్నాను. 'పోనిద్దూ నాయనా! అతనితో మనకు వాదం ఎందుకూ. అలాగా అంటే తేలిపోయె' అన్నాడు చిరునవ్వు నవ్వుతూ!

ఒకసారి మా బంధువులఇంటికి, ఒక పల్లెటూరు వెళ్లాను. అక్కడ ఒకనాటి సాయంకాలం, నేనూ, మా చుట్టాలు ఒకరిద్దరు, నలుగురైదుగురు గ్రామస్థులూ కలిసి, చెరువుగట్టు మీద కూర్చున్నాం, కబుర్లు చెప్పుకుంటూ. మాకు అర ఫర్లాంగు దూరంలో చేలో ఏ డెనమండుగురు జనం ఒకచోట కేకలేసుకుంటున్నారు. వాళ్ల కేకలు అస్పష్టంగా మాకు వినపడుతూనే ఉన్నాయి. సూర్యాస్తమయం కావడం చేతను వాళ్లు కొట్టుకొంటున్నారేమో మాకు బాగా కనపడలేదు కాని కొట్టుకుంటున్నట్టు మట్టుకు మాకు అనుమానమే.

'కొట్టుకుంటున్నట్టున్నారు. రండి. విడిపిద్దాం' అంటూ నేనూ మరో యువకుడూ లేచాం. తక్కినవాళ్లు మమ్మల్ని రెక్కట్టుకు కూర్చోపెట్టారు. వాళ్లందరి దృష్టి మట్టుకు ఎదట తగాదామీదనే ఉన్నది. ఒక్క క్షణంలో అక్కడ కేకలు తగ్గి జనం తిరుగుముఖం పట్టినట్టు మాకు అనుమానమేసింది. మాలో ఒకాయన తొందరగా లేచి 'రండి పోదాం' అని, మా సమాధానం కోసం ఆగకుండానే బయలుదేరాడు. మేమూ లేచాం. మరో అరగంటకు ఆచేలో దొమ్మీ జరిగిందని ఊరంతా గుప్పుమంది. మాలోవాళ్లకు ఆసంగతి ముందే తెలిసిందన్నమాట. నేను హడలిపోయి మా బృందంలో ఒక్కొక్కళ్ళ దగ్గరకూ వెళ్లి, 'ఇది చాలా అన్యాయం! ఇప్పుడేనా మనం వెళ్లి పోలీసుకు రిపోర్టు ఇద్దాం' అంటే అందరిదగ్గరనుంచీ సమిష్టిగానూ వ్యష్టిగానూ ఒక్కటే సమాధానం వచ్చింది...'పోనిద్దురూ మనకెందుకు. దానిలో చాలా చిక్కులున్నాయి. దొమ్మీరూ కెలా ఉన్నా, మధ్యను మనం గమ్మవుతాం' అని.

ఈ దిక్కుమాలిన మనస్తత్వం మన కెలా వచ్చిందంట. దాని దుంపతెగిరి. ఎలాగో వచ్చిందనండి. ఇందులోనుంచి బయటపడడమెలాగ. లేకపోతే మన నిత్యవ్యవహారాలెలా సాగుతాయి. ఎన్ని అవకతవకలు వస్తాయి. ఎన్ని చిక్కులలో పడిపోతాం అని నేను ఎప్పుడూ ఆలోచిస్తూఉంటాను. 'ఎవ్వరికీ లేనిబాధ మీ కెందుకండీ. భూభారం అంతా మీ రొక్కరే మోస్తున్నారా ఏమిటి' అంటుంది మా ఆవిడ.

నిజమే కాని, ఎందుచేతనో నేను అలా స పెట్టుకు ఊరుకో లేను.

ఆ మధ్యను, కొంతకాలం క్రితం, ప్రతి గ్రామంలోనూ దోపిడీలూ, కుప్పలు తగ పెట్టడం జరిగింది. జ్ఞాపకం ఉన్నదా. ప్రతి గ్రామంలోనూ జనం హడలిపోయారు.

★ బారిష్టరుగారి బాతాఖానీ ★

రాత్రి సుఖంగా గడిచి తెల్లవారుతుందా అని రాత్రి తెల్లవార్లూ తోణుకుతూ దేవుడికి దణ్ణం పెడుతూ కూర్చుంటేవారు. ఒక్కసారి మాటువేసి ఈ గూండాలను పట్టుకుని తగిన బుద్ధి చెపుదామని ఒక్కరూ ప్రయత్నం చెయ్యలేదు. ఆలోచన తోచకనూ తెలియకనూ కాదు. ఎవరిమట్టుకు వారు మనకెందుకు. మన ఇంటిమీదకు రాలేదు కదా అనే ధీమా. తమ ఇంటిమీదకువస్తే మళ్లీ పక్కింటివాడూ ఈ ధోరణిలోనే తనకు సహాయం చెయ్యడని తెలుసును. అయినా సరే! సరే! ఆఖరుకు ప్రభుత్వంవారే, ప్రతిగ్రామానికీ స్వచ్ఛంద దళాలు బయలుదేరి రాత్రిళ్లు వొంతుల ప్రకారం గస్తీ తిరగాలని ఆదేశించి, పోలీసువారిని పంపించి, అలా చేస్తున్నారా లేదా అని పరీక్షకు పెడితే చేశారు.

అలాగే యుద్ధం రోజుల్లో, కొన్ని గ్రామాల్లో విద్రోహులు ఎక్కువహంగామా చేస్తుంటే అక్కడ సిపాయిలను వేశారు. గ్రామంరోడ్లు బాగుండేవి కావు. అదివరకూ గ్రామస్థులంతా కలిసి రోడ్లు బాగు చేసుకుంటే బాగుంటుంది అని నాబోటివాళ్ళు ఎంతమంది చెప్పినా "పోనిద్దురూ మన కెందుకు. పన్నులు పుచ్చుకుంటున్న ప్రభుత్వమే చేస్తా'రని పెడచెవిని పెట్టేవారు. ఆఖరుకు సిపాయిలు వచ్చి, గ్రామస్థులను బలవంతపెట్టి రోడ్లు బాగు చెయించారు. ఇలా ప్రాణంమీదకొచ్చేదాకా ప్రతిదానికీ మన కెందుకనే మతమే ప్రతివాడికీని. ఇలాంటి పెద్ద విషయాల్లోనే అనుకుంటారేమో, కాదుసుమండి. 'ఊళ్లోకి ఈవేళ నెహ్రూగారు వస్తున్నారట. చూదాం రండి' అంటే 'పోనిద్దురూ. చూసేదేమిటి.' 'ఉపన్యాస మిస్తారండి.' 'అబ్బ! రేపు పేపర్లో చదువుకోవచ్చు లెద్దురూ.' 'అలా కాదండీ! మళ్లీ ఈ జన్మలో మనం చూడ కలుగుతామో లేదు!' 'ఏం చూడకపోతే. ఎంతమంది మనంచూడకుండా రావడంలేదు-పోవడంలేదు. అలాగే వారూను. మనం వెళ్లకపోతే ఆయనకు కాని మనకు కాని వచ్చిన లోటేమీ లేదు పోనిద్దురూ!' ఇదీ వరస. అందుకనే కొన్ని లక్షల జనాభా ఉన్న పట్టణాల్లో నాలుగోవంతు జనమైనా వారిని చూడడానికి రారు.

'ఏమండీ! రండి సినీమాకు పోదాం.' 'పోనిద్దురూ...' 'ఇదుగో అలా అనకండి. మనం చూచితీరాలి.' 'అబ్బ నాకెందుకు నన్ను చంపకండి. మన కెందుకు కూచోండి. హాయిగా కబుర్లు చెప్పుకుందాం.' 'కబుర్లెందుకు! లేద్దురూ-' 'ఇదుగో సినిమాకేం గాని వెధవ సినిమా-ఎప్పుడు పడితే అప్పుడే చూడొచ్చును......' 'ఇదుగో - ఇది విన్నారా.. కూచోండి చెపుతాను— ఆవిడ...ఎవరా...మన వీధిని లేదండీ-నాలుగిళ్ళ అవతల...'

* * *

'ఏమండీ! మహానుభావా! ఈ వేళా రారా బయటికి.' 'వస్తాను. రాకేమి. కాని ఇప్పుడా మీకు టయిముదొరికింది. కాస్త చల్లపడనివ్వండి పోదాం. మనం ఉన్నది విజయవాడ అన్న సంగతి మరచిపోకండి. ఆఖరుకు బెంగుళూరనా కాదు. 'అది కాదండీ. ఇప్పుడు పురాణమున్నదికాదూ. ఆయ నెవరో ఆ శాస్త్రులుగారు భారతం చాలా బాగా చెపుతాడట. లేవండి త్వరగా. జనం ఇసకవేస్తే రాలకుండా వస్తున్నారు. అందుచేత పెందరాళే పడితేనేకాని చోటు దొరకదు, లేవండి.' 'ఉండవయ్యా! ఒకటే హడావిడి. తీరా వెళ్లినతరువాత, ఇసక వేస్తే రాలుతుందో రాలదో అని ఏ కుంటి కుంకేనా పరీక్షార్థం మన నెత్తినో ఇంత ఇసకపోస్తే...'అబ్బ! ఈ చచ్చు సమాధానాలు కట్టిపెట్టి లేద్దురూ!'. 'ఇదుగో మనలో మనమాట. మనం ఏదో కొద్దో గొప్పో చదువుకున్నాం. వచ్చినంత వచ్చింది. లేనంత లేదు. కాశ్మీపు పురాణంవింటే ఏమి వచ్చింది చెప్పు. లేదూ మనమేమీ చదవలేదనుకుందాం. ఈ గంటలోనో అరగంటలోనో మనం నేర్చుకునేది ఏముంది చెప్పు. కూచో నీకో తమాషా చెపుతాను.' 'లేవండి ముందు నడుస్తూ చెప్పకుందాం'. 'చూడూ నన్నలా తొందర పెట్టకు, పెద్దవాడిని. మనకింకా ఈ భారతా లెందుకు చెప్పు. బోలెడంత భారతం మన కళ్లఎదుట జరుగుతుంటే...'

ఇంకోరోజున: 'ఏమండి సార్. చిదానందయోగి ఒకాయన హిమాలయ ప్రాంతం నుంచి వచ్చాడుట. చాలా గొప్ప తపస్వి లిట. యోగాభ్యాసాన్ని గురించి ఉపన్యాసా లిస్తాడట. కావలిస్తే, నేర్చుకోవలెననే కుతూహలముంటే, యోగాసనాలూ అవీ నేర్పుతాడట. వెడదాం. నాకు కొన్ని సందేహాలున్నాయి. తీర్చుకుందామని ఉన్నది.'

'చూడు బాబూ, ఆగొడవ మనకెందుకు. యోగం అనేది సాధనవల్ల సాధించవలసినదే కాని, ఉపన్యాసాలువింటే వచ్చేది కాదు. ఇంక భక్తి, ముక్తి వగైరా అన్నావు. నువ్వు ఇంట్లో కూచుని కృష్ణారామా అనుకుంటే చాలదూ. ఈ రోజుల్లో అందరకూ ఇదో వెలం వెర్రి. ప్రతివాడూ మాటకు ముందు భగవద్గీతనీ, ఉపనిషత్తనీ, యోగమనీ ఉపన్యాసాలు దంచడం. ఒక్కమాట చెపుతా విను. నిజమైన యోగి, హిమాలయాల్లో తపస్సు చేస్తున్నవాడూ ఇక్కడ ఉపన్యాసాలకు దిగిరాడు. నమ్ము నామాట. రమణమహర్షి ఎక్కడికేనా వెళ్లి ఉపన్యాసాలిచ్చాడా. అరవింద యోగి ఆశ్రమం కదిలి ఇవతల అడుగుపెట్టాడా. వాళ్లు నిజంగా మహాత్ములు...' 'అయితే మీరు వారి దర్శనంచేశారా ఎప్పుడేనా!' 'ఇదుగో ఈలాటి చొప్పదంటు ప్రశ్నలు వెయ్యకు. నేనూరికే ఉన్న సంగతి చెప్పాను. నాకెందుకిదంతా. ఏదో నాదారి నేను చూసుకుంటాను......'

ఇదీ మనవాళ్ల ధోరణి ప్రతిదానికీని. ఏ తూళ్లో కానివ్వండి! ఏ తరహావాళ్లను కానివ్వండి. ప్రతి విషయానికీ ప్రతీనోటా వచ్చే మొదటి సమాధానమిదే...'పోనిద్దురూ మనకెందుకు' అని.—

కొండ విరిగి మీదపడ్డా మన కెందుకనే. గోదావరి పొంగివచ్చి పడుతోందన్నా మన కెందుకనే. కొండమీద కోతి దిగొచ్చి దొడ్లో కూరకాయలన్నీ పాడుచేస్తోందన్నా మన కెందుకనే. ఇలాగైతే ఎలా బ్రతకడం? అన్నీ మనకే కావాలి. మనకు కావలసినది మనం తెచ్చుకోకపోతే, మనకు తెలియనిది తెలుసుకోడానికి ప్రయత్నించకపోతే, మనపై పడుతున్న ప్రమాదాన్ని తప్పించుకోడానికి ముందు మన ప్రయత్నం యత్కించిత్తేనా లేకపోతే, మనకు మానవుడు కాని దేవుడుకాని సహాయం చెయ్యలేడు. చెయ్యడు.

వీటన్నిటికంటే అత్యవసరమైనది, అత్యంతప్రమాదకరమైనది వేరొకటివున్నది. రేపు ఎలెక్షన్లు వచ్చి పడుతున్నాయి. ప్రతివాళ్ళూ మాకు వోటంటే మాకు వోటంటున్నారు. మేము గొప్పవాళ్లమంటే మేము గొప్పవాళ్లమంటున్నారు. మేమింత చేస్తామంటే మే మింకో ఇంత చేస్తామంటున్నారు. రేపు మీరేం చేస్తారు? ఎవరికో ఒకరికి వోటిస్తారా? కిందటిమాటుకు మల్లేనే 'పోనిద్దూ. వాళ్ల ఖర్మం. కొట్టుకు చావనియ్యి - నాకెందుకీ గొడవ' అంటారా? కాస్త ఆలోచించండి, మన కెందుకనే మతం మార్చుకుని, మనకు కాకపోతే ఇంకెవరికనే తత్వంలో పడండి. శుభం భూయాత్ !!

★



(గతసంచిక తరువాయి)

3

రంగయ్యగారు ఉదయం ఆరుగంటలకి స్నానం పూర్తిచేసి మడిగా సంధ్యవారుస్తున్నాడు. తన్మయం చెంది గాయత్రి జపిస్తున్నాడు. ఆయన సతీమణి వరలక్ష్మమ్మగారు కాఫీ కాస్తోంది వంటింట్లో. ఇల్లు అంత పెద్దదీకాదు చిన్నదీకాదు. నాలుగు గదుల ఇల్లు.

కాఫీవేళ కావటంవల్ల రంగయ్యగారి కుమారుడు సదానందం, కూతురు జయలక్ష్మి వంటింట్లో తల్లిదగ్గర కూచున్నారు. పొంగే పాలు దించి డికాక్షన్ కలిపింది వరలక్ష్మమ్మగారు. కాఫీ గ్లాసుల్లో పోస్తూ "ఏమే అమ్మాయి, మీ నాన్నగారి సంధ్యవార్చడం పూర్తయిందేమో చూసిరా" అంది.

అమ్మాయికి పదిహేడేళ్ళుంటాయి. నిష్కపంచువన్నెలో నిగనిగలాడుతోంది.

"ఆయనే వస్తాడులేవే. గంటసేపాయె కూర్చుని" అంది చనువుగా. ఆమెకి తండ్రంటే ఎంత చనువో—అంత భయంకూడా ఉంది.

"నువ్వన్నా వెళ్ళి పిలుచుకురారా" అంది తల్లి కొడుకుని ఉద్దేశించి. కొడుక్కి ఇరవైఏళ్ళుంటాయి. అంతా చెల్లెలులాగే వుంటాడు.

"గాయత్రి నూట పదహారుసార్లు జపం చెయ్యందే ఆయనకి లేవ బుద్ధిగాదే; అందులో ఏలోటు వచ్చినా, మండిపడతాడు..." అంటూ, కాళ్ళచప్పుడు విని, "అరుగో నాన్నగారు వస్తున్నారు" అన్నాడు.

రంగయ్యగారు,సరాసరివచ్చివంటింట్లో ఓపక్కగా పీటవాల్చుకుని కూర్చున్నాడు; కూతురు కాఫీగ్లాసు అందించింది. రంగయ్యగారు కాఫీ నోట్లోపోసుకుని, "ఏమిరా సదానందం, కాఫీ ఏమిటి ఇలావుంది? ఖాతాకొట్లోనే తెచ్చావా పొడి?" అని ప్రశ్నించాడు.

"అక్కడే తెచ్చాను. ఏం?"

"ఏవూరు కాఫీరా ఇది! దరిద్రంగావుంది?"

"నీలగిరినించే తెప్పించాట..." నసిగాడు కొడుకు.

"అవునులే అన్నయ్యా! కాఫీగింజలు నీలగిరిలో పండుతాయని జాగ్రఫీలో చదివుంటాడు. ఇవి చిత్తూరు గింజలు..." అన్నది అమ్మాయి.

"చిత్తూరులో కాఫీగింజలు పండుతాయా? ఏ జాగ్రఫీలో చదివావు?" అన్నయ్య రెట్టించాడు.

"చిత్తూరులో కాఫీగింజలు పండుతాయనలేదు. చిత్తూరు చింతగింజలకి ప్రసిద్ధం..."

అంతా నవ్వారు. హాల్లో గోడగడియారం ఏడుగంటలు కొట్టింది. వచ్చని ఎండపొడ వరండాలోకి పాకుతోంది. జయ లేచి బైటికి వెళ్ళిపోయింది. సదానందం ఒకచేత్తో క్రాపు సర్దుకుంటూ "నాన్నగారూ" అంటూ ఉపోద్ఘాతంలా ఆరంభించాడు.

"ఏమిటది?" అన్నాడు రంగయ్యగారు. ఆయనకి లోలోపల 'బ్రాకెట్' ఏం వచ్చిందో అనే ఆదుర్దా. వెళ్ళి కనుక్కురావాలి...

"రెండురూపాయలు కావాలి" అని నసిగాడు పుత్రుడు. అతను కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు సొదరుకి డబ్బులు లేకపోతే ఇబ్బందిగా వుంటుంది.

"ఏడిశావు వెధవా, నెలాఖరు రోజుల్లో డబ్బు లెక్కడ వుంటాయిరా? జ్ఞానం వుండక్కర్లేదూ?" రంగయ్యగారు రుసరుసలాడుతూ లేచిపోయినాడు.

సదానంద మెల్లిగా అమ్మదగ్గరికి చేరాడు. తల్లి, కొడుకువేపు జాలిగా చూస్తూ, "ఎందుకురా డబ్బులూ? నాన్న దిగులుపడిపోతూంటేనూ! ఆయన్ని వేధిస్తారూ?" అంది.

"నీకేమమ్మ చెబుతావు! వొచ్చే మంగళవారం కాలేజీలో ఏదో సెలిబ్రేషనట. తలా రెండు రూపాయలు వసూలు చేస్తున్నారు అందరిదగ్గిరా! నేనూ ఇవ్వాలా! పేరేమో రంగయ్యగారబ్బాయి అని! తీరా చూస్తే జేబు ఖాళీ! నాకు తలవొంపులుగా వుందమ్మా! ఎలాగైనా ఈ రెండు రూపాయలూ ఇవ్వాళ నువ్వు ఇవ్వాల్సిందే!"

జయ, శుభ్రంగా అలంకరించుకుని వొచ్చింది. "నాన్న వెళ్ళాడా—అన్నయ్యా?" అని ప్రశ్నించిం దామె రావటం రావటం.

"ఏం అట్లా అడుగుతున్నావు?" అంది తల్లి కొంత అనుమానం తీర్చుకోవల్సినట్టు.

"ఏమోనే అమ్మా, నాన్న ఎన్నడూ లేనిది ఈమధ్య నాలుగైదు నెలల్నించి రాత్రి పదకొండు దాటి ఇంటికి రావటం—ఉదయం కాఫీ తాగగానే పెద్దపనివున్నట్టు పరిగెత్తటం...ఏమిటా తిరుగుడూ అని ఆలోచిస్తున్నా" అంది జయ.

సదానందం, "నువ్వుండవే, మధ్య లేనిపోని సోది! అమ్మా, డబ్బులే" అంటూ గునుస్తున్నాడు.

"అబ్బ చంపుతున్నావురా!" అంది తల్లి. ఆమె కూడా లోలోపల తన భర్త ప్రవర్తనగురించి కొంత అనుమానిస్తోంది. "అయితే...అయితే...ఆయనకి లక్షు పనులుంటాయి. ఆ పుస్తకం

నాయనా, ఈ పుస్తకం దిద్దనా..." అంది తన సంశయాన్ని తనే తీర్చుకోడానికి ప్రయత్నిస్తూ—సమర్థించుకుంటూ.

"కాదులే అమ్మా! నువ్వు సత్తెకాలం మనిషివి. నాన్న ఈమధ్య ఆ రాస్తోన్న 'భాగవతం' కూడా మానేస్తున్నాడు మధ్య మధ్య ఎందుకని? ఎంతో భక్తిశ్రద్ధలతో రాస్తోన్న గ్రంథాన్ని, తన కెంతో ప్రియమైన కావ్యరచనని కూడా మానేసి—ఆయన ఇంకే పనిలో దిగినట్టూ? ట్యూషన్ కుర్రవాళ్లు తొమ్మిది గంటలకే ఇళ్లకి పోతారయ్యె..." అంటూ ఆమె—అన్నయ్యవేపు తిరిగి, "నువ్వన్నా కాస్త కనుక్కోరాదుట్రా?" అంది.

సదానందం, "పోదూ! ఆయన పర్సనల్ అఫైర్స్‌లో మన జోక్యమేమిటి మధ్య?"—అని తీవ్రంగా అంటూ, "అమ్మ, డబ్బు లే" అని మళ్లీ తన పాఠంలోకి వచ్చాడు.

"అంతేలే. అయినా, నీకు ఒకదాంట్లో మాత్రం జోక్యం ఏడ్చింది? అమ్మా! అన్నయ్యకి అడిగినప్పుడల్లా ఒకటీ రెండూ ఇస్తూవుండు. తొందరగా బాగుపడ్తాడు" అంది జయ కోపంగా.

"నేను తీసుకుంటే నీకేమిటే కడుపుడుకు? నువ్విక్కడ్నుంచి పో ముందు."

తల్లివొచ్చి సర్దింది. "ఊరుకోరా నాయనా, దాంతో నీ కేమిటి! నువ్వు వెళ్లి చదువుకోవే అమ్మాయి!" కూతురు, గబగబ లేచి లోపలికిపోయింది.

"ఏమిటిరా, నువ్వు! దాన్ని చూస్తే క్షణం పడదేమిరా నీకు!" అంది తల్లి మందలించినట్టు.

కొడుకు ఇంటర్‌మీడియెట్ చదువుతున్నాడన్న మాటేగాని, కుర్రతనం వొదల్లేదింకా. తోక తక్కువగా కోతి. "నువ్వు డబ్బు లిస్తావా ఇయ్యవా ఇంతకీ? నేనుపోయి చదువుకోవాలి" అంటూ అలకపాన్పెక్కాడు సుపుత్రుడు.

"నువ్వు బళ్లోకి పొయ్యేటప్పుడు ఇస్తాలే, ఊరికే వేధించకు. పోయి చదువుకో." అన్నది తల్లి. కొడుకు ఈలవేసుకుంటూ వెళ్లి పోయినాడు.

తల్లి స్నానంచేసివచ్చి వంటపనిలో దిగేటప్పటికి ఎనిమిది గంట లయింది. పదింటికల్లా భర్తకి, కొడుక్కి వంటచేసిపెట్టి పంపించాలి. ఆమెకి కూతురుదిగులు వేరే. పెళ్లిచేసి రెండేళ్లయింది. పెద్దమనిషి అయికూడా...కట్నాలదగ్గర పేచీవచ్చి, ఇంతవరకూ అల్లుడు తీసుకువెళ్లే ప్రసక్తే తీసుకురాడు. ఇంకో వెయ్యిరూపాయ లుంటేగాని ఆ సమస్య పరిష్కారమై కూతురు కాపరానికి వెళ్లదు. ఆయన అఖండ పండితుడే, పేరుప్రతిష్ఠలున్న రచయితే; అయితే ఏం? అల్లుడు కొక్కవల్సింది అమ్మాయీ కాదు; మామగారి పాండి త్యమూ కాదూ; మామగారిస్తానన్న కట్నం. అందులో దమ్మిడీ తగ్గితే ఒప్పుకోడు—వప్పుకోలేదు. పైకి వుపన్యాసాలు చెబు తాడు వియ్యంకుడు.

వరలక్ష్మమ్మగారు, కుంపటిమీద పప్పు పడేసి, పొయ్యిమీద అన్నం పెట్టి, పొట్లకాయి తరుగుతోంది. మనసేమో ఆలోచనలో పడింది.

పెళ్ళప్పుడు ఎన్ని పేచీలు! అరువేలూ కర్పూరం హారించి పోయినట్టు కర్చయినాయి. మాటా దక్కలేదు. వెయ్యిరూపాయలు తగ్గినాయని, ఆ మూడుముళ్లువేసిన క్షణంనించీ తగాదా. అది ఈ రోజుకీ తెగలేదు. వియ్యంకుడు ప్లీడరు. ఆయన వ్యవహారజ్ఞాన మంతా ఉపయోగించి పేచీ తెగకుండా జాగ్రత్తగా చూసుకొస్తు న్నాడు. అల్లుడు ఒట్టి వాజమ్మ.. తండ్రి గీతగీసి 'దాటకు' అంటే చాలు, అటువేపు చూడనుకూడా చూడడు.. తన భర్తకి రోషం పుట్టేడుంది. మాటంటే మండిపడతారు; వీళ్లి పట్టింపులకీ, డబ్బా శక్కీ మధ్య తన కూతురు కాపరం గడ్డలైపోతోంది. చిలకాగోరింక లాగా వుండవల్సిన ఈడులో ఇదేం ఖర్మ...

ఆమె మాట వినేవారు ఆ యింటిలో ఎవరూ లేరు. మొగుడు వినడు—కూతురు వినిపించదల్చే వుంటుంది—కొడుకు అతీతుడు; ఎవరిమాటా వినడు.

ఆమె ఆలోచిస్తో వంటచేస్తోంది. కూతురు ముందుగదిలో కూర్చుని కూనిరాగం తీస్తోంది.

4

మొగల్రాజపురం వెళ్లే దారిలో కొండమీద, త్రిమూర్తి గుహలకి పైన శిలమైన ఎనిమిది స్తంభాల నలుచదరపు నల్లరాతి మండపం ఒకటివుంది. బైటివేపు నాలుగు స్తంభాలూ లోవేపున నాలుగు స్తంభాలూ పై గోపురాన్ని నిలుపుతున్నాయి. తూర్పువైపున కొండే—ఆవైపుగోడకి ఓ శిలాప్రతిమవుంది. పాండ్య రాజుల కాలంనాటి మధుర దేవాలయపు శిల్పనైపుణ్యాన్ని జ్ఞప్తికి తెస్తుంది, ఆ శిలామండపం. చక్కని రూపురేఖావిలాసాల్తో, ఆ శిల్పం చిరునవ్వు నవ్వుతూ, ఒకచేత వింజామరం వేస్తూ రెండో చెయ్యి, నడుముపై వొయ్యారంగా లాలిత్యం పుట్టిపడేలా పెట్టు కునివుంటుంది. నిగనిగలాడే నల్లరాతిలో జీవం తొణికిసలాడే అపూర్వ శిల్పసుందరి ఆ విగ్రహం. ఈ మండపానికి కిందనించి వంకరటింకరగా పైదాకా ఓ వందమెట్ల దారివుంది; మండపం యొక్క ఎనిమిది స్తంభాలమీదకూడా, లతలూ, పక్షులూ అందంగా చెక్కబడివున్నాయి. అయితే జీర్ణస్థితిలో, జాలికొల్పుతూ వున్నాయి. మండపం కిందనించి పిచ్చి తీగలేవో మొల్చి నలు వేపులా ఆక్రమించుకున్నాయి.

మంటపం పగటిపూట కూడా మసకవెల్తురులో ఏవో పూర్వ స్మృతులకు దోహదమిస్తుంది. లోపలికి వెళితే నేలంతా బీడీపీకలతో అధ్వాన్నంగా వుంటుంది. కొంచెం పరీక్షగా చూస్తేగాని తూర్పు వేపు విగ్రహం కనపడదు. ఆ మంటపం అక్కడ ఎందుకుందో, అది దేవాలయమూనో కాదో తెలియదు. అంతా నల్లరాయే కావటం వల్ల చున్నగా, సౌకర్యంగావుంటుంది. అక్కడ చేరేవాళ్లూ వున్నారు. పొద్దుక్రుంకేవరకూ అక్కడ 'కాసుముక్క' ఆట జోరుగా సాగుతూవుంటుంది. గుడ్డలు చినిగిపోయి, క్రాపు చెరిగి పోయి, కళ్లు లోతుకుపోయిన ఓ ఏడెనిమిదిమంది, అక్కడ చేర తారు అన్యుల జోక్యంలేని గుప్తస్థలం కావడంచేత. పైగా బైటి వేపు స్తంభాలకి ఆనుకుని కూర్చునిచూస్తే బెజవాడంతా చక్కగా కనపడుతుంది. రైలువంతెన, స్టేషనూ, దుర్గకొండ, పెద్దరోడ్లు, రేడియో స్టేషనూ వివరంగా కనపడతాయి. కొండకింద రోడ్డు చక్కగా కనపడుతుంది. పోలీసులుగాని ఇతరులుగాని మంటపం వైపు వస్తున్న సంగతి చాలా ముందుగానే చూడవచ్చు. టక్కున చీట్లాట మానేసి పరారి కావచ్చు. మంటపం తూర్పువేపు మెట్ల దారేమీ లేదుగాని, కొంచెం అలవాటుంటే, కొండదిగి పరిగెత్తడం అసాధ్యంమాత్రం కాదు.

సాయంత్రంవేళ మంటపం అస్తమయ కాంతిలో దూరంనించి గొప్ప రాజప్రాసాదంలా కనిపిస్తుంది. ఆవేళ పగలు ఒంటిగంట ప్రాంతాన మంటపంలో చీట్లపేక జోరుగా సాగుతోంది. నలుగురు ఆడుతు న్నారు; ఇద్దరు పైనించి చూస్తున్నారు. ఇద్దరు బైటివేపు ఒక స్తంభందగ్గిర ఆనుకుని కూర్చుని చింతపిక్కల ఆట ఆడుతూ, మధ్య మధ్య కింద పాములా వొంపుతిరిగిన రోడ్డువేపు చూస్తున్నారు. ఈ గుంపుకి నాయకుడు వరదరాజు. అతడు పైనించి ఆట గమనిస్తూ, వింజామరం వీస్తోన్న వొయ్యారిశిల్పం పక్కనే గోడకానుకుని నిల బడి వున్నాడు. అతనికి ఎదురుగా ఒకడు వొంగి నిల్చుని బహు ఆసక్తిగా ఆట చూస్తున్నాడు. ఆడుతున్నవాళ్లకేనా లేని ఆసక్తి చూసేవాళ్ళకుండటం, సహజం. ఆ ఆడేవాళ్ళు నలుగురూ, నాలుగు రకాలుగా వున్నారు. అయినా ఏదో గాఢమైన సానుభూతి నలు గుర్ని కలుపుతున్నట్టు తోస్తుంది. వాళ్ళు అన్నదమ్ములేనా కాదు. తైలసంస్కారం లేని జుట్టూ, భుజాల

దగ్గిరా కాలర్ దగ్గిరా చినిగిన చొక్కాలూ, లుంగీలూ, బొమికెలు బైటికిచూస్తున్న శరీరం, దీనంగా వున్నా, ఏదో ధీమా, ఏదో ఆశా చావని మసకబారిన కళ్లూ వాళ్లు నలుగుర్నీ, ఒకే వర్గానికో, తెగకో, వృత్తికో సంబంధించినట్టు రుజువు చేస్తున్నాయి. ముఖ్యంగా వాళ్ల సంస్కారం—అది అక్కడవున్నవాళ్లంతా ఒకటే సుమా అనిపిస్తుంది. మాటిమాటికీ మధ్య పచ్చిగా బూతులు విసురుతూ మాట్లాడుకుంటున్నారు వాళ్లు.

ఎండ తీవ్రంగా దహిస్తోంది. మండపం పైవేపు తీగలల్లుకుని వుండడంతో, లోపల చల్లగా వుంది. సూర్యరశ్మి బహుప్రయత్నం మీద లోపలికి పడుతోంది. తగినంత వెలుగుమాత్రం లోపలికి వస్తోంది. వరదరాజు నుంచున్నవాడల్లా, పక్కకి తిరిగి, తనపక్కన కూర్చున్న అతనితో, "వొరేయ్ గోశయ్యా, ఏడిరా, ఈ కొండలు గాడు! ఇంకా జాడేం? ఎర్రబుట్టలవాళ్ల చేతుల్లోగాని పడ్డాడా" అని ప్రశ్నించాడు.

చీట్లాడుతున్న గోశయ్య, ఎడం చేత్తో క్రాపు పైకి తోసుకుని, కుడిచేతితో ఆటీన్ తురఫుముక్క కింద పడేసి, "క్లోశారా" అన్నాడు. ఇటు వెనక్కి తిరిగి వరదరాజుతో, "వస్తాడులేరా, పైసా దొరకద్దూ!...ఆపనేం మజాకా అనుకున్నా?" అన్నాడు.

"ఏడిశావులే. ఉదయంనించి సరిగ్గా టిపినన్నా చెయ్యలేదు" అంటూ, తనతోపాటు నుల్చుని ఆట గమనిస్తున్న అతనివీపు తట్టి, "వొరే, చందూ, ఆ కాయ అందుకోరా, ఓ చుక్క మందేసుకుందాం" అన్నాడు.

కూర్చున్న ఆటగాళ్లు తాత్కాలికంగా ఆట విరమించారు. వాళ్లలో యేదో చైతన్యం వొచ్చినట్టయింది.

"స్స .... గోల సెయ్యకండిరా. క్రిందికికూడా వినబడేలాగుంది" అంటూ చందూ శిలాప్రతిమవైపు వొంగి, శిల కాళ్లకి వెనక గోడకీ మధ్యవున్న నల్లటి కిరసనాయిలు సీసా ఒకటి బైటికి తీశాడు. దానివెంబడే వున్న ఓ మురికి గ్లాసు బైటికి దీసి, ముందు వరదరాజుకి సగం గ్లాసు తెల్లని—నీళ్ళవంటి, కొంచెం కెలుకుగా వున్న ద్రవాన్ని పోసి ఇచ్చాడు. వరదరాజు ఒక్క గుక్కలో తాగేశాడు. అతని మొహం వివర్ణమైంది. అగ్ని ద్రావకం తాగినట్టు లోపల మండుతోంది. మిగతావాళ్లూ తలా ఒక అరగ్లాసు తాగారు. కడుపులో ఆకలి మరిచిపోవటానికి ఇది ఒక సాధనం; బీడీలూ సిగరెట్లూ మరో సాధనం. వాళ్లెవళ్ళూ పొద్దుణ్ణించీ అన్నం తినలేదు. ఎప్పుడు తిండి దొరుకుతుందో కూడా తెలీదు. ఇదిమాత్రం వాళ్ల స్నేహితు డొకడు దొంగతనంగా కాస్తూవుండడంవల్ల ఊరికే దొరుకుతోంది. ఆకలినీ, బాధల్నీ మర్చిపోయి, సరదాగా చీట్లపేకలో వాళ్లు తెలియకుండా మునిగిపోవడానికీ వీలవుతోంది.

ఆ అస్థిపంజరాల్లో ప్రాణాలు ఊగులాడేట్టూ, ఉండీ ఉండనట్టూ రెండు నిమిషాలు త్రిశంకుస్వర్గంలో పడి తేరుకున్నాయి. తెచ్చిపెట్టుకున్న 'హుషార్'తో వాళ్లు తిరిగి ఆటలో పడ్డారు. నలుగురిలోనూ కొంచెం పొట్టిగావున్న ఒకతను ముక్కలు పంచుతున్నాడు. వాళ్లలాగే ఆ పేకముక్కలు కూడా, మురికిపట్టి వున్నాయి.

బైటి స్తంభాని కానుకుని కూర్చున్న అతను చింతపిక్కల ఆట మానేసి రోడ్డుకేసి చూశాడు. మరునిమిషం, నోట్లో రెండు వేళ్లు పెట్టి హుషారుగా ఈలవేశాడు. ఆడేవాళ్ళూ వరదరాజూ తిరిగిచూశారు.

"ఏందిరా, గోపీ—! ఎవరా వచ్చేది?" అన్నాడు వరదరాజు.

"ఏడుకొండ లొస్తున్నాడురా.. రొప్పుతో..." అన్నాడు గోపీ ఆత్రంగా. మంత్రించినట్టు చీట్లాట ఆగిపోయింది. అంతా బైటికి వచ్చి ఆదుర్దాగా చూస్తున్నారు. మెట్లదగ్గిర కొచ్చేశాడు ఏడుకొండలు. గళ్లచొక్కా, ఎర్రపంచె; తలకి సిల్కురుమాలు కట్టుకున్నాడు. సన్నగా వున్నాడు. గబగబ పైకెక్కి వచ్చాడు. ఎండదెబ్బకి బాగా చెమటపట్టి వేగంగా నడవటంవల్ల [illegible] గుర్రంమల్లే నురగలు కక్కుతున్నాడు. గబగబ పైకొచ్చి మండపం నీడలో కూలబడ్డాడు. నీడ ఎంతో హాయిగా వుంది ప్రాణానికి.

వరదరాజు శిలావిగ్రహానికి ఆనుకుని నుల్చుని, "ఏం దొరికింది" అని ప్రశ్నించాడు.

"ఏమో! ఎవడు సూశిండు" అంటూ ఏడుకొండలు, బొడ్లోనుంచి, ఓ ఆకుపచ్చని ప్లాస్టిక్ పర్సు తీసి తెరిచి, నల్లరాతిమీద దులిపాడు. కాయితాలు, రూపాయి బిళ్లలూ చిల్లర ఘల్లున రాలినాయి. వరదరాజు లెఖ్ఖ చూస్తూవుంటే మిగతావాళ్లు పైనించి చూస్తున్నారు.

ఒకడు బైట స్తంభానికానుకుని నిలబడి సిగ్నలర్‌లా రోడ్డుకేసి చూస్తున్నాడు. వరదరాజు లెఖ్ఖ చూశాడు. మొత్తం 64 రూపాయల చిల్లర వుంది. వరదరాజు తలపైకెత్తి, కాళీ మనిపర్సు చందూకిచ్చి, "అవతల పారెయ్యరా. జాగర్త! కొండదిగువకి పొయ్యేట్టు యిసిరెయ్యి!......" అనేసి, ఏడుకొండలవేపు తిరిగి, "ఎవరి చేశావ్రా ఈ పని?" అని అడిగారు.

ఏడుకొండలు ఓ స్తంభానికి చేరగిలబడి, "కాస్త మందేయుండిరా, నాలిక పీక్కుపోతంది!" అన్నాడు.

వరదరాజు మందలిస్తున్నట్టుగా, "కొంచేపు ఆగరా! ఎండనబడి వచ్చావు. డాంమ్మని సస్తావు! ఆ కుండలో చన్నీళ్లున్నాయి. ఓ గ్లాసు ఏడు.. అసలు సంగతేందో చెప్పరా" అన్నాడు.

ఏడుకొండలు, చందూ ఇచ్చిన గ్లాసు మంచినీళ్లు గడగడ తాగేసి, "మన కోటప్ప, పెద్దలైను బుకింగ్ కాడ ఓ మైనరుగాడి పక్కజేబు కొట్టేసి నా కిచ్చేశాడు...వీడు పారిపోతంటే మైనరు కేకలేసి పట్టుకున్నాడు. ఎంత తన్నుకున్నా వొదిలాడు గాడు... పోలీసులూ జనం, కోటప్పని గుండకింద కొట్టేస్తున్నారు... నేను మెదలకుండా పారిపోయి వచ్చేసినాను. మనం పోయి ఆణ్ణి యిడిపించుకు రావాల..." అన్నాడు మెల్లిగా.

వరదరాజు—"నే యెల్లొస్తా, రుజా లేదుగదరా! ఆడికేం ఫర్వాలేదులే. దెబ్బలంటావు! మామూలేగా! ఒరే చందూ, అందరికీ ఆడబ్బు పంచరా! పోలీసోళ్లు వొచ్చినా వస్తా రీడకి. దబ్బున యెల్లిపోవాల" అన్నాడు శాంతంగా.

డబ్బు పంచటం ఐదు నిమిషాల్లో పూర్తయింది. తొమ్మిది భాగాలూ పంచారు. పోలీసులకు చిక్కిన కోటప్పభాగం వరదరాజు కిచ్చారు. చీట్లపేక విగ్రహం వెనక దాచారు. సీసా గ్లాసూ చందూ లాగూజేబులో భద్రంగా దాచుకున్నాడు. అంతా చాలా మంచివాళ్లల్లే నెమ్మదిగా సంతోషంగా దిగి వెళ్లిపోయారు. ఆకలి వేస్తోందికదూ?

ఎవరి డబ్బులు వాడి జేబుల్లో గలగల్లాడుతూవుంటే యేనుగబలం వొచ్చింది వాళ్లకి. తలా ఓ మూలకి పట్నంలోకి చెదిరిపోయినారు.

ఓ రెండుగంటలుసేపు పోయినాక సాయంకాలం నాలుగున్నర గంటలకి అదే మండపం, పచ్చని ఎండలో మెరుస్తోంది. మెట్లమీదుగా సదానందం, అతనితోబాటు ఒక స్నేహితుడూ పైకి వచ్చారు. సదానందం క్రాపు చెరిగి నుదుటిమీద పడుతోంది. ఇద్దరు మిత్రులూ సంధ్యాకాంతికి ఎదురుగా, బైటి స్తంభాలవైపు కాళ్లు కిందికి వేళ్లాడేసి కూచున్నారు.

సదానందం మండపం స్తంభాన్నానుకుని కూర్చుని పైకి చూస్తున్నాడు. తీగలల్లుకుని, ఎర్రని, నీలంపూలు ఏవో పూసి, ఎండకి ధగధగ మెరుస్తున్నాయి. అతని ఆలోచన్లు ఎక్కడో వున్నాయి. అతని స్నేహితుడు, "సదానందం!" అని పిలిచి, భుజం గట్టిగా చరిచి, "నీ పేరుకితగ్గట్టు సదా ఆనందంలోనే మునిగివుంటావేంరా? మాట్లాడవేం?" అన్నాడు కొంత నిష్ఠూరంగానూ, కొంత వెక్కిరింతగానూ.

సదానందం మెల్లిగా పక్కకితిరిగి, "వొరేయ్, సుబ్బ

★ అపస్వరాలు ★

క్రీమ్సులోకి వెళ్ళతేవురా! నీకు..." అని ఆగాడు గట్టిగా శ్వాస పీల్చి. అతని మన స్తత్వం, ఇంట్లోగానీ, బైటగానీ ఎవరికీ సమగ్రంగా అర్థంకాదు.

"ఏమిటా క్రీమ్సు? ఎందుకొచ్చిన క్రీమ్సు? దంబిడీకి ఉపయోగిస్తాయా?"

"అంతే నువ్వు...నీకు ఏం తెలుసు నా బాధ?...ఊ..."

"ఊ...ఏమిటిది?...ఆ అమ్మాయిని వెర్రిగా చూస్తూ కూర్చోటం, హా-హా-అనటం, ఇదేనా?...నీ బాధ!

"అదికాదు బ్రహ్మానందం! నాకు దేన్ని చూసినా, ఏమిటో ఒక ఆవేదన; ఏ దృశ్యాన్ని చూసినా...సరే. అందమైన అమ్మాయి కానీ, సంధ్యారాగంగానీ—ఓ గుంపుగానీ—"

"ఆపు నీ ఉపన్యాసం! ఎందుకా ఆవేదన? సీనియర్ క్లాసులో అమ్మాయిమీద కన్నేశావు, అందుకిన్ని కంటిసమర్థనలెందుకు? ఆ అమ్మాయెవరో తెలుసుకోవాలనుకుంటే సూటిగా చెప్పరాదా?"

"నీకూ అంతకంటే అర్థంకాదు! నాకు ఏ దృశ్యాన్నయినా సరె చూస్తే బొమ్మ గియ్యాలని వుంటుందిరా! మొన్న కూచుని ఈ మండపం బొమ్మవేశాను. కాని...నచ్చలేదు. చింపేశాను. నా ఘోష మావాళ్ళకి చెబితే అర్థంకాదు. నాకేమో ఈ చదువబ్బదు. కనీసం స్నేహితుడివి నీకేనా అర్థమౌతుందా అంటే నీకూ అర్థంకాదు!" సదానందం చాలా దిగులుగా అన్నాడు.

బ్రహ్మానందం నవ్వాడు. "పండితపుత్రు డన్నారు—ఊరికే అన్నారూ? మీనాయన పాండిత్యంలో నీకు నూరోవంతు రాలేదు. బొమ్మల్ట బొమ్మలు! ఎవణ్ణి ఉద్ధరించను! కూడా గుడ్డా! బి. ఏ. అని ఆ రెండు అక్షరాలూ వుంటేనే ఇంత కూడు...అంతేనా! నీ తాతా, నా తాతా కానీ సంపాయించి పెట్టలేదు, మనవలు పుట్టి ఏడుస్తారేమోనని!" అన్నాడు. అతనికి దారిద్ర్యం నిత్యానుభవం. అతని తండ్రి, ఒక ఎన్. జి. వో. నానా కష్టాలూపడి చదివిస్తున్నాడు కొడుకుని.

సదానందం వినిపించుకోనట్టే, "అటు చూడూ సూర్యాస్తమయం, కొండలవెనక ఎంత దారుణంగా, నిగనిగలాడే రక్తారుణిమలో ఎంత భయానకంగా సౌందర్యంతో మెరుస్తోందో? దీన్ని కుంచెలతో, రంగులతో, చిత్రించాలిరా...'' అన్నాడు తన్మయుడౌతూ.

బ్రహ్మానందం తన మిత్రునివేపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఏమిటితను! ఎందు కిట్లా, నిమిషానికోసారి పరధ్యానంలో పడతాడు? బాగుపడే లక్షణా లేమీలేవే ఇతనిలో!...నాయన కవిత్వం, కొడుకు చిత్రాలు! బాగానేవుంది...!

"సదానందం! నీకంత వుబలాటంగావుంటే బొమ్మలు వెయ్యి. కాని, చదువు మానకు. నాకు తోచిన సలహా చెప్పాను" అన్నాడు.

సదానందం ఇంకా ఏదో ఆలోచిస్తో "నిజమే నువ్వు చెప్పేది. నువ్వు సూటిగా, దైనికజీవితంలో సంక్షోభాన్ని అర్థం చేసుకుని, చదువుకుని, దాన్ని డబ్బులోకి మార్చే విధమేమిటా అని ఆలోచిస్తున్నావు. నా కదే సాధ్యంకాకుండావుంది. అయినా..." ఆపేశాడు అతను. లేచి, వెనక్కి చూశాడు. వింజామరం వేస్తూ వొయ్యారంగా నిలబడి నవ్వుతూన్న—ఆ సుందరి కనిపించింది, సంధ్యారాగపు లేనారింజ కాంతిలో మెరుస్తూ.

అతను శిల్పందగ్గిరికి వెళ్ళాడు. సుల్చుని, జాగ్రత్తగా, పరిశీలనగా, తన్మయంగా చూశాడు. "బ్రహ్మానందం! చూడు ఇటు! భాభా! కాసేపు ఆ సంసారం, డబ్బూ సంగతి మర్చిపోయి, ఇటు చూడు!" అంటూ, ఆ శిల్పంముందు, ఆ నిత్యసుందరిముందు మోకరిల్లాడు. శతాబ్దాలుగా నిలిచి, నవ్వుతూ పిలుస్తున్నట్టున్నది ఆ సౌందర్యమూర్తి. విశ్వజనీనమైన ఆత్మానుభూతిగల 'ఏ శిల్పి కల్పింకాడో! ఆ సౌందర్యం కల్పనాతీతంగా, లోకాతీతంగా, ఏవో దివ్యానుభూతుల్ని స్ఫురింపచేస్తోంది. ఆ శిల్పంలోని ప్రతి వొంపూ మనోజ్ఞంగా, ఆ సంధ్యాకాంతిలో స్వప్నంలాగా కనిపిస్తోంది అతని కంటికి. ఆ విగ్రహాన్ని తడిమిచూశాడు. స్పర్శ తప్ప—కదలిక తప్ప—అన్నివిధాలా అది గొప్పది.

బ్రహ్మానందంకూడా అతని వెనకనే నుంచుని చూస్తున్నాడు. అత నిదివరకు నాలుగైదుసార్లు ఆ విగ్రహాన్ని చూసివున్నాడు. అతనికి అది వొట్టి రాతిబొమ్మ. అందంగా వున్నమాట నిజమే. కాని దాన్నింతసేపు ముందు మోకరిల్లి చూడాల్సినంత గొప్ప ఏమీ అతని కంటికి కనిపించదు.

"సదానందం! లేవోయ్. వెళ్దాంరా, పొద్దుపోతోంది." అన్నాడతను, సదానందం భుజంతట్టి.

సదానందం కలలోనించి మేల్కొన్నవాడిలా లేచాడు. 'వెళ్దాంరా. ఎంతచూసినా, ఆ అనుభూతిని జీర్ణించుకోలేను. ఆ ఆత్మానుగతమైన సౌందర్యోపాసన మనకి ఎన్నటికన్నా సాధ్యమౌతుందా? అని—నా ఆవేదన' అన్నాడతను మండపం దిగుతో.

'వొచ్చేనెల కాలేజీఫీజు కట్టడం ఎలాగా అని ఆలోచిస్తున్నాను నేను."

సదానందం ఇప్పటికి బాహ్యప్రకృతిలో పడ్డాడు. "అవును. ఆలోచించవల్సిన విషయాలే. డబ్బులేనిదే ఏపనీ సాగదుగదూ? మధ్యాహ్నం భోజనమైనాక తప్పనిసరిగా తాగే ఆ వొక్క సిగరెట్టూ లేనప్పుడు అనిపిస్తుంది, డబ్బుకెంత విలువో—అని" అన్నాడు.

"అన్నీ తెలిసీనా ఆ బొమ్మముందు మోకరిల్లి తన్మయత్వంలో పడ్డావు?" అని ప్రశ్నించాడు, ఎన్. జి. వో గారి కొడుకు.

"అవును. ఒకరికి పూజ్యమైన ఒక రాతిబొమ్మే, ఇంకొరికి, చాకిరేవులో గుడ్డలుతకటానికి ఉపయోగించే బండలాగా కనిపిస్తుంది. తేడా ఎక్కడవుందంటావు? మనస్సులోనే వుంది. చూసే చూపులోనేవుంది."

"కావచ్చులే. నేనేం కాదనను. కాని, కళ అనీ గిళ అని చూస్తూ చూస్తూ జీవితాన్ని నరకప్రాయం చేసుకోటం అజ్ఞానం." అన్నాడు బ్రహ్మానందం. ఇద్దరూ మెట్లుదిగుతున్నారు నిదానంగా.

"అజ్ఞానమేనంటావా? నువ్వేమేనా అను. నాలోమాత్రం ఆ ద్వంద్వప్రవృత్తి నశించటంలేదురా. నాకూ తెలుసు నాన్న సంపాయించటం మానేసిన రోజున నాగతి ఏమిటో. నాన్నని చూడరాదూ! గొప్ప రచయిత; ఆస్థాన కవులవంటివాళ్లుకూడా ఆయన రచనలకి జోహార్లర్పిస్తారు; చీఫ్‌జస్టిస్‌వంటి వాళ్ళు భక్తి చూపుతారు. కానీ—ఆ పుస్తకాలు అచ్చేసే పబ్లిషరుమాత్రం పుస్తకాన్ని తూకంవేసి, వంద చేస్తుంది, రెండొందలు చేస్తుంది అని ధరకట్టాడు; గంటలతరబడి ఆలోచిస్తాడు ఆ డబ్బు ఇవ్వడానికి. అలాగని నాన్న రాయటం మానేశాడూ? రాత్రింబవళ్ళూ ఏదో రాస్తోనేఉంటాడు. దానికి ఎంత వొచ్చినా చాలునంటాడు—అసలు డబ్బు రావాలనే ఉద్దేశంతో రాయనేరాయడాయన...ఏదో ఆవేశంలో రాస్తాడనుకుంటాను..." అన్నాడు సదానందం.

"అవును పాపం...నిజమే; మూడుభాషల్లో అపారమైన పాండిత్యం సాధించి, వాట్ని మథించి, రాత్రింబవళ్లూ శ్రమించి ఓ పుస్తకంరాస్తే, దానికి—చదువువొచ్చీ నిరక్షరాస్యుడూ డబ్బుండడమే అర్హతగల ఒక వ్యాపారి తూచినట్టు విలువకట్టడం దారుణమే. కాని చేసేదేమిటి? ఈనాడు అక్షరలక్షలిచ్చే రాజు లేరే?" బ్రహ్మానందం రంగయ్యగారి శిష్యుడు. ఆయన గొప్పతనం బాగా తెలిసినవాడు.

ఇద్దరు మిత్రులూ మాట్లాడుకుంటూ ఊరివేపు నడిచి వెళ్ళిపోయినారు.

(ఇంకా వుంది)

'స్త్రీణాంచచిత్తం, పురుషస్యభాగ్యం'

శ్రీ మధురాంతకం రాజారాం

ఆనందరావు అయిదుగంటలకు సరిగ్గా నిద్రనుంచిలేచి పడకపైన కూచున్నాడు. తన పాతికేళ్ల జీవితంలో ఆనందరావు ఎప్పుడూ అయిదుగంటలకు నిద్ర లేవలేదని చెప్పడానికికూడా వీల్లేదు. కానీ అతడెప్పుడైనా లేచివుంటే అందుకు కారణాలు, ఒకటి: మునిసిపల్ పార్కులోని సైరను మ్రోత; రెండు: గదిలోని గడియారం అలారం మ్రోత.

బలవంతంగా తనను నిద్రాదేవత ఒడిలోనుంచీ, సర్వసంతోషాలకూ నిలయమైన ప్రపంచంలోకిలాగి తెచ్చినందుకు మునిసిపాలిటీవారిని నిందించుకుంటూనో, అలారం పెట్టినవాళ్లని తూలనాడుకుంటూనో మళ్ళీ నిద్రపోయేవాడు ఆనందరావు.

కానీ ఏరోజునయితే ఆనందరావు అయిదుగంటలకు నిద్రలేచి పడకపైన కూచున్నాడో ఆరోజున సైరన్ మ్రోత కలకంఠి మంజులగీతికగానూ, అలారం మ్రోత ఆత్మీయుడి అనురాగాలాపంగానూ అతడికి స్ఫురించింది.

అతడు హాయిగా గొంతెత్తి పాడుకోవాలనికూడా అనుకున్నాడు!

కానీ సమయానికి ఆనందరావుకు ఏపాటగానీ జ్ఞాపకం రాలేదు. ఐనా ఏనాడు నేర్చిన పాటలు! ఎప్పుడో పల్లెటూరి పాఠశాలలో పంతులమ్మ నేర్పించినవీ, తరువాత హైస్కూలు చదువుల్లో, పోస్టాఫీసు గుమాస్తా బ్రతుకులో పెదవులపై మెదల్లేక ఏ అజ్ఞాతసీమలకో వలసపోయినవీ, ఓ కానొక నాటి సుప్రభాతాన ఆనందరావుకు తమతో పని కలుగవచ్చునని తెలియనివీ - అయినపాటల్ని మననం చేసుకోలేక, ఆనందరావు సన్నగా ఈలవేసుకోవడంతో తృప్తిపడిలేచి అద్దంముందు నిలుచున్నాడు.

"నువ్వు ఊరికి పోబోయేది పన్నెండుగంటలకే కదరా బాబూ!" అన్నది కడపదగ్గర చాపపైన పడుకున్న కామాక్షమ్మ లేచి కూచుంటూ. ఆనందరావు వాలకాన్ని పట్టిచూస్తే అతడు ఎనిమిదిగంటల రైలుకే బయలుదేరేస్తాడేమోనన్న సందేహం కలిగిందామెకు!

తన ఆనందాన్ని తల్లి గమనించిందేమోనని ఆనందరావు కించపడుతూ "మనం ప్రోగ్రాం వేశామంటే, మళ్ళీ దాన్ని మార్చుకోవడమంటూ వుండనే వుండదు. నా ప్రయాణంకోసం నువ్వు లేనిపోని తొందర పెట్టుకోనక్కరలేదు. భోజనమైం తర్వాత వెళ్తాను" అన్నాడు.

కామాక్షమ్మ అంట్లు తోముకోడానికి పెరట్లోకి వెళ్లింది. ఆనందరావు పురవీధుల్లో షికారు బయల్దేరాడు.

షికారుకు బయల్దేరడంతోటే ఆనందరావు ఆరోజుకోసం వేసుకున్న ప్రోగ్రాం కూడా ప్రారంభమైంది. ఏడువరకూ వాహ్యాళి. ఎనిమిదికి లాండ్రీకి వెళ్లిరావడం. తొమ్మిదిగంటలప్పుడు ఆఫీసుకువెళ్ళి తోడి గుమాస్తాదగ్గర సెలవు పుచ్చుకోవడం, పదికి భోజనం. పదకొండుగంటలకు సరిగ్గా రైల్వే స్టేషను. ఇదీ సంక్షిప్తంగా ఆనందరావు కార్యక్రమం.

పన్నెండుగంటలకు వచ్చే రైలుకోసం పదకొండుగంటలకే ఎందుకు స్టేషనుకు వెళ్ళాలి అని ఎవరైనా ప్రశ్నిస్తారేమోనని, ఆనందరావు ఆ ప్రశ్నకు సమాధానం ముందుగానే ఆలోచించుకున్నాడు. "వాన రావడం, ప్రాణంపోవడం ఎలా మానవుడి అధీనంలో లేవో, రైళ్ళ రాకపోకలుగూడా అలా మానవుడినిర్ణయాలకు కట్టుబడివుండవు. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క రైలు రెండు మూడుగంటలు ఆలస్యంగాకూడా వస్తుంది. అలాటప్పుడు ఒకరైలు, ఒకరోజున ఒకగంట ముందుగా రాదనిమాత్రం హామీ ఏమిటి?"

కార్యక్రమం నిర్ణయించుకోవడంలో ఆనందరా వెంత జాగ్రత్తగా వుంటాడో, దాన్ని పాటించడంలో మరింత మెలకువగా వుంటాడు. అందుకు నిదర్శనం అతడు టంచనుగా పదకొండుగంటలు గడియారంలో మ్రోగేసరికి స్టేషనులో వుండడమే!

స్టేషనులో అడుగు పెట్టీపెట్టకముందే ఆనందరావుచేయి జేబులోకి పోయింది. వెంటనే భద్రంగావున్న పర్సు పైకి వచ్చింది. అతడు బుకింగ్ రూము కిటికీదగ్గర నిలబడి, ఒక అయిదురూపాయలనోటు లోపలికిచాపి "నెల్లూరు, ఒక టికెట్ సార్" అన్నాడు.

నెల్లూరికి టికెట్టు యివ్వమని అడగడంలో ఆనందరావు కనబరచిన వినయాన్ని అవగతంచేసుకుని అతడికొక టికెట్టు ప్రసాదించవలసిన బుకింగ్ క్లర్కు తారకరావు అప్పుడు తన స్వాధీనంలో లేడు. స్వాధీనంలోమాత్రం లేకపోవడమేమిటి, అతడప్పుడు భారతదేశంలోనే లేడు! కుర్చీలో కూచుని, టేబిల్ పైకి కాళ్లు చాపుకుని, చేతుల్లో దినపత్రిక వుంచుకుని అతడు అంతర్జాతీయసమితిలో అమెరికా ప్రతినిధి ఉపన్యాసాన్ని శ్రద్ధగా వింటున్నాడు!

ఆనందరావుకు దినపత్రికలంటే బొత్తిగా సరిపడదు. అదేపనిగా వాటిని చదువుకుంటూ కూచునేవాళ్లనిచూస్తే అతడికి తగని చిరాకు. కానీ తన ఆగ్రహాన్ని ఎక్కడ చూపించవచ్చునో, ఎక్కడ చూపించగూడదో బాగా తెలిసిన ఆనందరావు మళ్ళీ వీలైనంత వినయంగానే టికెట్టుకోసం అర్థించాడు. కానైతే, అతడీసారి బిగ్గరగా "టికెట్టుసార్ టికెట్టు. నెల్లూరికి!" అని అరిచినమాటమాత్రం వాస్తవం!

తారకరావు చేతుల్లోనుంచీ పేపరు క్రిందికి జారిపోయింది అతడు ఆనందరావు వైపు చూచాడు. కానీ అదేం చూపులు! తన ధ్యాననిష్ఠను భగ్నంచేసిన మేనకను విశ్వామిత్రుడు అలా చూచివుంటాడు!

తనపైకి ప్రసరిస్తున్న తారకరావు చూపులకు అర్థమేమిటో తెలుసుకునేందుకు ఆనందరావు ప్రయత్నించలేదు. అతడు తన మామూలుధోరణిలోనే "టికెట్టు సార్, నెల్లూరికి" అన్నాడు. డబ్బిచ్చి టికెట్టు తీసుకోవడం ప్రయాణీకుడి హక్కనీ, మారుమాటాడకుండా దాన్ని యివ్వడం బుకింగ్ క్లర్కు బాధ్యతనీ ఆనందరావు ఉద్దేశం!

ఐతే బుకింగ్ క్లర్కు తారకరావు తన బాధ్యతని గుర్తించి, అందుకు తగ్గట్టుగా ప్రవర్తించే 'మంచి ఉద్యోగి' లా కనిపించలేదు ఆనందరావుకు!

"టికెట్టు యిప్పుడు యివ్వబడదు" అని ముక్తసరిగా సమాధానం చెప్పి తారకరావు మళ్ళీ పేపర్ని చేతికి తీసుకున్నాడు.

"ఏం? ఎందు కివ్వబడదు!" అని గర్జించాడు ఆనందరావు, తనకేదో అవమానం జరిగిపోయినట్టు భావించుకుని! ఐతే ఆనందరావు ఎంతసేపు వేచివున్నా ఈ ప్రశ్నకు తారకరావుదగ్గరినుంచీ సమాధానం రాలేదు.

ఆనందరావుకు కోపం సాధారణంగా రాదు. కానీ వస్తేమాత్రం చొక్కా చేతులు పైకితీసి ఎదుటివాడితో పట్టీలం

★ 'స్త్రీణాంచచిత్తం, పురుషస్యభాగ్యం' ★

పడడం అతడికి పుట్టుకతో వచ్చిన గుణం. ఐనా కుర్చీ పట్టడానికి అభ్యంతరంగా తనకూ తారకరావుకూ మధ్య ఒక రాతిగోడ వుండడంవల్ల ఆనందరావు కొంచెం తమాయించుకుని "ఇక్కడ తమరు చేయవలసిన వుద్యోగం పేపరు చదువుకోడం కాదని నా ఉద్దేశం. ఐతే మీ ఉద్యోగంపట్ల మీ అభిప్రాయమేమిటో నాకు తెలియదు. ఇక్కడ 'రైళ్లు బయలుదేరడానికి రెండుగంటలు ముందునుంచీ టిక్కెట్లు యివ్వబడును' అని బోర్డు వ్రేలాడుతోంది. ఇది మరీ అంత చిన్న బోర్డుకాదు, కళ్లకు కనబడకపోవడానికి! మరి...మరి..." అంటూ అర్ధోక్తిలో నిలిపాడు.

"అక్కడ ఆ బోర్డు వ్రేలాడుతూనే వుంటుంది. ఇక్కడ మేము మాయిష్టం వచ్చినప్పుడే టికెట్లు యిస్తూవుంటాము" అన్నాడు తారకరావు పేపరు చూచుకుంటూనే.

ఆనందరావు తోకత్రొక్కిన త్రాచులా బుసలు కొడుతూ కంప్లెయింట్స్ పుస్తకం కోసం స్టేషనుమాష్టరు గదిదగ్గరకు పరుగెత్తి, ఆ గదితలుపులు మూయబడివుండడం చూచి తెల్లమొగం వేసుకుని కాలుగాలిన పిల్లిలా వెయిటింగ్ రూంలో తచ్చాడసాగేడు.

తరువాత అరగంటకు రైలు అవుటయి సందుకు సూచకంగా గంట మ్రోగింది. ప్రయాణీకులు ఒక్కొక్కరుగా టిక్కెట్లు తీసుకోసాగారు. ఆనందరావు, మళ్లీ బుకింగ్ రూమ్ కిటికీదగ్గర నిలబడి తారకరావుముఖాన్ని చూడ్డానికి మనస్కరించక డబ్బిచ్చి ఒక పెద్దమనిషి చేత టిక్కెట్టు తెప్పించుకున్నాడు.

* * *

ఐదురోజులు తరువాత సంగతి.

ఆనందరావు ఆనాటివుదయమే అత్తగారి వూరినుంచీ తిరిగివచ్చి ఆఫీసులో కూచుని ఏదో అకౌంట్స్ చూచుకుంటూవుండగా కిటికీదగ్గరనుంచీ ఎవరో పిలిచారు. ఎవరైనా స్టాంపులకోసం వచ్చారేమోనని ఆనందరావు తలెత్తి చూచాడు. అక్కడ టికెట్లు ఒకపట్టాన యివ్వకుండా రైలు ప్రయాణీకుల్ని ఏడిపించే తారకరావు నిలబడివున్నాడు!

గడచిన నాలుగైదురోజులనుంచీ, అధికారమే గనుక తన చేతిలోవుంటే తారకరావుకు ఏయేశిక్షలు విధించవచ్చునో ఆలోచించుకున్న ఆనందరావు ఈసారి ఉడికించే వంతు తన దనుకుంటూ "ఎవరక్కడ? ఏం కావాలి?" అని ధీమాగా ప్రశ్నించాడు.

"ఆఁ ఏంలేదుసార్! నా కొకజాబు వచ్చివుండాలి గుంటూరునుంచీ. కొంచెం దయచేసి దాన్ని..." అంటూ నసిగాడు తారకరావు.

"గుంటూరునుంచీ జాబా!" అంటూ ఆనందరావు పైకిలేచి "ఇప్పుడు టైమెంత? తొమ్మిదిన్నరయింది. పోస్టుమేన్ ఊళ్ళో ఎక్కడో జాబుల్ని బట్వాడా చేస్తూవుంటాడు. వెళ్ళి అతడ్ని పట్టుకోండి" అన్నాడు.

"ఇక్కడికీ స్టేషనుకూ రెండుమైళ్ళు దూరంకదండీ! పోస్టుమేన్ ఊళ్ళో తన పనంతా అయినతర్వాత సాయంత్రం ఐదుగంటలకుకానీ ఆవైపు రాడు. ఇప్పుడు స్టేషనుజాబులన్నీ ఆఫీసులోనే వుంటాయి. మరి నేను ఎదురుచూస్తున్న జాబులో నా కత్యవసరమైన పనుంది. శ్రమ అనుకోకుండా మీరు దయచేసి..."

శ్రమ అని మా కర్తవ్యాన్ని నిర్వహించకుండా ఊరుకునే అలవాటు మాకు లేదండీ! ఐతే తమకు జాబులు వెదికి యివ్వవలసిన కర్తవ్యం మాదికాదు. మీరు పోస్టుమేన్ వచ్చేవరకూ ఆగడం మంచిది." అని ఆనందరావు మళ్ళీ తనపనిలో లీనమైపోయాడు.

తారకరావు అయిదునిమిషాలవరకూ విగ్రహంలా కిటికీదగ్గరే నిలవడివుండి, యిక లాభం లేదనుకుని తలవంచుకుని మెల్లగా అక్కడినుంచీ వెళ్లిపోయాడు.

"టిట్ ఫార్ టాట్. సరైన శాస్తి చేశాన్నే" అని సంతృప్తిచెందాడు ఆనందరావు.

* * *

పదిరోజులతర్వాత ఒకనాడు ఆనందరావుకు రైల్వేస్టేషనుకు పోయి రావలిసినపని బడింది. సాయంత్రం నాలుగున్నరగంటల బండికి శ్రీమతి నెల్లూరినుంచి రాబోతున్నదన్న శుభవార్త అతనికి ఆరోజు ఉదయమే అందింది. వార్త అందినప్పటినుంచీ వాయువీధుల్లో సంచరింపసాగిన ఆనందరావుకు స్టేషనులో అడుగు పెట్టేంతవరకూ తారకరావు జ్ఞప్తికే రాలేదు.

స్వతహాగా ఆనందరావుది కలహస్వభావంకాదు. మంచికో చెడ్డకో ప్రారంభమైనస్పర్థ అంతటితో ఆగిపోతే బాగుండుననుకున్నాడతడు. కానీ పూర్వవైరం మరింత ఉద్ధృతం అయినట్లు తారకరావు ఆనందరావుపైన తీక్ష్ణవీక్షణాలను ప్రసరింపసాగేడు.

ఎందుకైనా మంచిదని ఆనందరావు ఒక ప్లాటుఫారంటికెట్టు కొనుక్కుని బ్రిడ్జి దగ్గరకువెళ్లి రైలుకోసం ఎదురుతెన్నులు చూడసాగేడు. రైలేమో సక్రమంగా నాలుగున్నరకే వచ్చింది. ప్రవాసానంతరం పుష్పకవిమానంనుంచీ దిగిన సీతాదేవిలా

ఇందిర పుట్టినరోజునాడు ఏదయినా బహుమతి ఇవ్వాలని వసంత అనుకున్నది. కాని తీరా అప్పటికి మరిచిపోయింది. ఆతరువాత ఇందిరని కలుసుకొని చెప్పింది.

"ఇందూ! నీ పుట్టినరోజు మాట మరిచిపోయానే. చాలా పొరపాటయింది. అందుకని నువ్వుకూడా వచ్చే బుధవారం నాడు నాపుట్టినరోజన్నమాట మరిచిపో!"

శ్రీమతి దరహాసవదనంతో ప్లాటుఫారంపైన కాలుపెట్టింది. ఆమెగారు వెంటతెచ్చిన ట్రంకుల్ని, బెడరుబ్యాగుల్ని జాగ్రత్తగా క్రిందికి దింపి, ఆనందరావు "టికెట్టు భద్రంగా వుందికదా!" అని భార్యని హెచ్చరించుకున్నాడు.

'టికెట్టు' అన్నమాట చెవినిబడగానే శ్రీమతిముఖంలో వెలుగు కొస్తా మాయమైపోయింది ఆమెచేతవున్న పుస్తకాన్ని విదిలించి విదిలించీ చూచుకుంది. తొందరగా పెట్టె తెరచి చీరల మడతలన్నీ గాలించింది. బెడరుబ్యాగు తెరచి అందులోవున్న పుస్తకాలన్నింటినీ ప్లాటుఫారంపైన క్రుమ్మరించింది. కానీ టికెట్టుమాత్రం ఎక్కడా కనిపించలేదు!

టికెట్టుకోసం శ్రీమతి అన్వేషణ కొనసాగుతూవుండగానే 'టికెట్, టికెట్' అంటూ తారకరావు అక్కడికి వచ్చేశాడు!

ఆనందరావు అధోముఖుడై "టికెట్టు లేదు. ఎక్కడో జారిపడిపోయింది" అన్నాడు.

"జారిపడిపోయిందని మాకు నమ్మకం ఏమిటి? మీరు టికెట్టు లేకనే ప్రయాణం చేసివుండవచ్చు" అన్నాడు తారకరావు.

"ఇంతకూ మీరనేదేమిటి?" అన్నాడు ఆనందరావు, శిక్షను ధైర్యంగా ఎదుర్కొనడానికి సంసిద్ధుడైన నేరస్థుడిలా.

ఇన్స్పెక్టరుజావర్‌లా సీరియస్‌గా "పెనాల్టీ చెల్లించాలి. ఎక్కడనుంచీ వస్తున్నారు?" అని ప్రశ్నిస్తూ తారకరావు రసీదుపుస్తకం చేతికి తీసుకున్నాడు.

"నెల్లూరునుంచీ" అంటూ ఆనందరావు జేబులో చేయివేశాడు

తారకరావు కాగితంపైన ఏదో లెక్కచేసి "ఆరురూపాయలా పన్నెండుఅణాలు" అన్నాడు!

ఆనందరావుముఖం వెలవెలబోయింది. అతడిజేబులో అంతడబ్బు లేదు. అయినా అతడు తారకరావుని బ్రతిమాలుకోవాలనుకోలేదు.

"నువ్విక్కడే ఆచెట్టుక్రింద కూచునివుండు. నే నిప్పుడేవస్తాను ఊళ్ళోకివెళ్ళి" అని భార్యతో చెప్పి అతడు తారకరావంటూ ఒకవ్యక్తి అక్కడున్న విషయాన్ని మరచిపోయినట్టు తిన్నగా ఊళ్ళోకి దారితీశాడు.

ఆనందరావు స్టేషనుకు తిరిగి వచ్చేసరికి అయిదున్నర దాటింది. అతడు సరాసరి బుకింగ్‌రూంలోకివెళ్ళి డబ్బును టేబిల్‌పైన కుప్పబోసి "రసీదు యివ్వండి" అన్నాడు.

"మన్నించాలి ఆనందరావుగారూ మీకు శ్రమకలిగించినందుకు. మీరు వెళ్ళిపోయిన తర్వాత టికెట్టు దొరికింది!" అన్నాడు తారకరావు.

ఆనందరావు డబ్బు చేతిలోకి తీసుకుని వెనుతిరిగి వెళ్ళిపోబోతుండగా మళ్ళీ తారకరావే ప్రారంభించాడు. "ఆనందరావుగారూ! ఇప్పటికే ఊళ్ళోకి స్టేషనుకు రెండుమూడుసార్లు తిరిగేరు. ఈరాత్రికి మీరు మాయింట్లో ఆతిథ్యాన్ని తీసుకోకూడదూ దయచేసి!"

ఆనందరావుకు ఒళ్ళు చరాలుమన్నది. అతడు "థేంక్స్. మీ ఆతిథ్యాన్ని నిరాకరించవలసివచ్చినందుకు చింతిస్తున్నాను. సెలవ్" అంటూ బయటికివచ్చి శ్రీమతికోసం ప్లాటుఫారమంతా కలయజూచాడు. ఒకటి రెండుసార్లు ఈ చివరినుంచీ ఆ చివరకు తిరిగాడు. వెయిటింగ్‌రూంలోకూడా చూచాడు. కానీ శ్రీమతిఏదీ! ఇట్టే సాక్షాత్కరించి అట్టే మాయమైపోయిందే!

ఇంతలో తారకరావు బుకింగ్‌రూంనుంచీ బయటికివచ్చి "ఆనందరావుగారూ! మీ అవిడకోసం వెదుకుతున్నట్టున్నారు! అదిగో ఆమె ఆ ఇంట్లోకి వెళ్ళడంమాత్రం చూచాను. మళ్ళీ అక్కడినుంచీ రాలేదు. బహుశా అక్కడే వుండవచ్చు" అన్నాడు.

ఆనందరావు మళ్ళీ ఒక 'థేంక్స్' ను తారకరావుముఖాన విసరికొట్టి అతడు చూపించిన ఇంటిముందరికి పోయి నిలబడ్డాడు. ఇంట్లోనుంచీ నవ్వులు మాటలు చప్పట్లు జోరుగా వినిపిస్తున్నాయి. "ఏమిటో రాచకార్యం వెలగబెడుతున్నావులే" అని మనసులో అనుకుని ఆనందరావు "శ్రీమతీ! శ్రీమతీ!" అని భార్యని పిలిచాడు.

"అక్కడే నిలబడిపోయారేం? లోపలికి రండి" అంటూ శ్రీమతి బయటికి వచ్చి "మీరు దీన్నెరగరుకదండీ! ఇదే మా సత్యవతి" అంటూ తన నేస్తాన్ని ఆనందరావుకు పరిచయం చేసింది.

ఆనందరావు వరండాలోవున్న కుర్చీమీద కూలబడుతూ "మీవారిక్కడ ఏంచేస్తున్నారమ్మా" అని సత్యవతిని ప్రశ్నించాడు.

"మీకు తెలియదేమండీ! మావారిక్కడ బుకింగ్‌క్లర్కుగా వుంటున్నారు" అన్నది సత్యవతి.

హతోస్మి! హతోస్మి! అనుకున్నాడు ఆనందరావు.

"ఈరాత్రికిక్కడే వుండిపోవాలని బలవంతంచేస్తోందండీ సత్యవతి" అని, ఆనందరావు అభిప్రాయానికి ఎదురుమాడకుండా "లేక లేక నాలుగేళ్ళకు కలుసుకున్నాం. మనకు దానిచేతులమీదుగా విందు పెట్టాలనుందటండీ!" అన్నది శ్రీమతి.

ఈసారి, ఆతిథ్యాన్ని నిరాకరించే సాహసం ఎంత ప్రయత్నించినా ఆనందరావుకు కలుగలేదు.

ఆ రాత్రిపూట రైల్వే క్వార్టర్సులో పోస్టల్‌క్లర్కు ఆనందరావు, రైల్వే బుకింగ్‌క్లర్కు తారకరావు ప్రక్కనకూచుని విస్తరిలోని పిండివంటల్ని మాయంచేస్తూ సత్యవతమ్మ చేతిపాకాన్ని నలపాకమనీ, భీమపాకమనీ మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాడు. ★

విధానసభ

జె. వి. రమణమూర్తి

మా నాన్నగారి పూర్తి పేరు యం. యల్. ఏ. రామారావు గారు. అదెందుకో యం. యల్. ఏ. ఆయనకు సార్థకనామమై కూర్చుంది. ఆయన ప్రస్తుతం యం. యల్. ఏ కాదు. 1946 యెన్నికలలో గెలిచి యం. యల్. ఏ. అయారు. 1952 యెన్నికల్లో ఓడిపోయినా, ఆ బిరుదు మాత్రం పేరుని అంటిపెట్టుకొనే ఉండిపోయింది. ఎన్నికల్లో ఓడిపోయాక ఆయన దైనందిన జీవితంలో చాల మార్పు వచ్చింది, రోజూ ఊరంతా తిరగడం, హోటల్లో రాజకీయాల లోక దంపుడు దంచడం, మా నాన్న మానలేని దుర్వ్యసనాలయ్యాయి.

కొన్నాళ్ళయాక మా యింట్లో 'విధాన సభ' యేర్పాటు చేశారు. మా అమ్మ స్పీకరు; మా నాన్న, సరే, మినిస్టర్. నేను ప్రభుత్వపు పార్టీ, పైగా డిప్యూటీ స్పీకరు. మా అన్న వెంకట్రావు ప్రతిపక్ష నాయకుడు. మా చెల్లి సీత, యింటర్మీడియట్ మూడేళ్ల నుంచి మార్చి, సెప్టెంబరు విధిగా, విసుగులేకుండా చూస్తూన్న మా చిన్నబావ వెంకటేశ్వరరావు, ప్రతిపక్ష సభ్యులు. నేను, మా నాన్న కాక, మా పెద్దక్క (హిందీ నేర్చుకొంటోంది) మా ఆయన (యిల్లరికపుటల్లుడు), మా చిన్న తమ్ముడు (రెండేళ్ల వాడు) ప్రభుత్వపార్టీ సభ్యులు. మా యింట్లో యే విషయమూ, విధానసభలో ముందు చర్చకి రాందే అమలు జరగటానికి వీల్లేదు. అన్ని విధానసభల్లోలాగే ప్రశ్నోత్తరాలు, విరామ తీర్మానాలు, వాకవుట్లు, బడ్జెటు చర్చలు మాలో ఉన్నాయి. అన్నింటికి మించింది మా పొరుగింటి వెంకాయమ్మ గారి బ్రాడ్‌కాస్టు. ఆవిడ మా యింట్లో జరిగిన ప్రతి విషయానికి లేనివాటిని కొన్ని సందర్భానుసారంగా జోడించి ప్రజలకందించేది. మానవసేవయే మాధవసేవ అని త్రికరణశుద్ధిగా విశ్వసించిన వెంకాయమ్మ గారు మమ్మల్ని ప్రతిఫలం యెన్నడూ అడిగియెరుగదు.

కౌలుదార్లు ధాన్యం అమ్మి డబ్బు వారం రోజుల్లో తెస్తారనగా మా 'బడ్జెట్' చర్చలు ప్రారంభమయ్యేవి. మా నాన్న సహజధోరణిలో రాబోయే సంవత్సరపు ఆదాయం, ఖర్చు - లోటు, లోటు భర్తీచేయడానికి తేవలసిన అప్పు, అమ్మవలసిన భూమి తదితరమైన వివరాలు, అంకెలతో సహా వివరించేవారు. అన్న ప్రతిదానికి 'కోత తీర్మానాలు' (*Cut - Motions*) ప్రవేశపెట్టేవాడు. ఖర్చు తగ్గించమని, ఆదాయం పెంచమని గంటలతరబడి, తాను కాలేజీలో చదివిన ఆర్థికశాస్త్రం ఆధారంగా వాగేవాడు. అయినా, యిదివరకే అమ్మకి, నెక్లెసో, టెన్యూచీరో, లేటెస్టుమోడల్ చేతిగడియారమో మభ్యపెట్టడంవల్ల స్పీకరు 'కాస్టింగు' ఓటుతో నాన్న డిమాండులన్నీ 'పాస్' అయ్యేవి. అప్పుడప్పుడు, నాకు, మా ఆయనకి కూడ ఖర్చుకని కొంత సొమ్మియిచ్చి నాన్న డిమాండులు పాస్ చేయించుకునేవారు.

విధానసభ యేర్పాటుచేసిన రెండేళ్లలోను ఒక్కసారీ మిగులు బడ్జెటు ప్రవేశపెట్టబడలేదు. రామన్న పంతులు గుమాస్తాగిరిలో మాయింట్లో ఖర్చు యింతకన్నా బాగ తక్కువగా ఉండేది. ప్రతియేడు అప్పులేకుండా నెట్టుకురాగలడమే కాక, పదిహేనువేలు వెనకేశారు. విధానసభ యేర్పాటుచేశాక ఆయన పలుకుబడి అంతరించింది. వసూళ్లు నాన్న అంచనా ప్రకారం యెప్పుడూ అయ్యేవి కావు. అప్పుడప్పుడు వసూళ్ళు చేసుకోడానికి కోర్టుల్లో బోలెడంత ఖర్చయేది. యింటికికూడ అంచనాలకి మించి ఖర్చయేది. రామన్నపంతులు మా యింటి వ్యవహారాలు చూసే రోజుల్లో జాగ్రతగా దాచిన పదిహేనువేల రూపాయలు ఈ రెండేళ్ళలో కర్పూరంలాగ హరించిపోయింది. నిల్వలు తరిగిపోగా యింటిమీద, పొలంమీద వేలకొద్దీ అప్పులు తెచ్చాము. ఆఖరికి ఉన్న యింటిని అమ్మేద్దామని నాన్న తీర్మానం ప్రవేశపెట్టాడు. అన్న చాల గందరగోళం చేశాడు. విసిగి తన పార్టీ సభ్యులతో 'వాకవుట్' చేశాడు. నాన్న యిల్లు అమ్మక తప్పింది కాదు.

మా విధానసభలో యెన్నో తీర్మానాలు ఆమోదించబడ్డాయి. విధవా వివాహాలు జరిగి తీరాలని అన్న తెచ్చిన తీర్మానం ఓటింగు ప్రసక్తిలేకుండా గెలిచింది. అయినా అమ్మ భయపడి, నాన్న అక్కకి రెండో పెళ్ళి చెయ్యలేకపోయాడు. 'కష్టించందే తిండి తినడం దొంగతనంతో సమానమనీ, ప్రతివాడు కనీసం తన తిండి బట్ట కష్టించి సంపాదించాలనీ' ఒక తీర్మానం యేకగ్రీవంగా ఆమోదించాము. కాని నాన్న చేతిలో పైసా ఉండగా, అన్నగాని, మా చిన్న బావగాని, మా ఆయనగాని నౌకరీప్రయత్నాలు చేయలేదు. పైగా యింట్లో ఖర్చవుతూన్న ప్రతి దమ్మిడీకి బాధ్యత నాన్నదని వాదించేవాడు అన్న.

అప్పుడప్పుడు అమ్మ కొట్టిందనీ, తనకి చింకిగౌను వేసుకొని వీథిలోకి వెళ్ళడానికి నామోషీగా ఉందనీ సీత విరామ తీర్మానాలు ప్రవేశపెట్టేది. అమ్మ వాటిని పరిశీలించకముందే కొట్టేసేది.

ప్రశ్నల కాలం బలే మజాగా ఉండేది. ప్రతిపక్ష పార్టీ రోజూ ప్రశ్నలతో నాన్నని ఉక్కిరి బిక్కిరి చేసేవారు. మామూలుగా చలించని నాన్న ఒక్కోసారి తడుముకొనేవారు. సమయం గ్రహించి అమ్మ సభని వాయిదా వేయడమో, ప్రశ్నలు త్రోసివేయడమో చేసేది. ఫలాని అప్పు యెందుకు చేశావని, ఖర్చు యీ యెందుకు పెరిగిందనిగాని అన్న అడిగినా కూడ నాన్న యేనాడు, 'నిరుద్యోగులు, నిష్ప్రయోజకులైన మిమ్మల్ని మేపడానికని' చెప్పలేదు.

అమాంతంగా ఒకరోజుని - ప్రక్కింటి వెంకాయమ్మగారేం బ్రాడ్‌కాస్టు చేశారో గాని అప్పులవాళ్ళంతా నాన్నమీద దావా వేసిఉన్న పొలం తక్షణమే అమ్మాలని ఒత్తిడిచేశారు. నాన్న ఐ. పి. పెట్టనున్నాడని ఊర్లో పుకార్లు పుట్టాయట. నలభై యకరాల మాగాణీ కోర్టు డిక్రీమీద అమ్మి బాకీలు తీర్చగా నాన్న చేతిలో అయిదువేలు మాత్రమే మిగిలాయి. పరిస్థితి సమగ్రంగా అర్థంచేసుకున్న, అన్న వెంటనే గుమాస్తాగా చేరి వేరింటి కాపరం పెట్టాడు. మా చిన్న బావ తంటాలుపడి యిన్స్యూరెన్స్ యేజంటయాడు. మా ఆయన మొదట్లో కొంత నసిగినా, చేతిలో డబ్బు ఆడకపోయేసరికి కొలువు చేయక తప్పలేదు. ఒక్కదెబ్బతో కుటుంబం చీలిపోయింది. నాన్నకి గూడ 'రెక్కాడితే గాని డొక్కాడదు' అన్నట్లయింది: అందరిలాగ ఆయన బెంగతో మంచంపట్టలేదు. స్వయంగా వయోజన పాఠశాల నడుపుతున్నాడు. సీత పెళ్ళి, తమ్ముడి చదువు నాన్నకి, అమ్మకి తీర్చలేని సమస్యలుగా తయారయ్యాయి.

★

పెద్దకథ:

సుశీల

(గత సంచిక తరువాయి)

7

పద్మనాభంగారు రాత్రి యింటికి వచ్చే సరికే కాలాతీతమైంది. సుశీల పడుకొని నిద్దరోయింది. పొద్దున్న కాఫీఫలహారాలుముగిసినతర్వాత ఆయన గారుతీరుబడిగా కూర్చుని పత్రిక తిరగవేస్తూ వుండగా ప్రక్కనే వచ్చి కూర్చున్న సుశీల, "రాత్రి అక్కడకు వెళ్లివచ్చారా నాన్నా?" అనడిగింది. అంతటితో జడ్జీగారు పత్రిక చదవడం విరమించి సుశీలకు ఉన్న సంగతంతా చెప్పెయ్యాలని సంభాషణ సాగించారు.

"వెళ్లానమ్మా వెళ్లాను, కాని.. "

"అంటే వాళ్లు ఒప్పుకోలేదా నాన్నా? నేను మొదటనే చెప్పానుకాదూ, వాళ్లకూ మనకూ పొత్తు కుదరనే కుదరదని."

"అదేంలేదు అతణ్ణి అడిగి తరవాత మాట యిస్తానన్నారు రావుగారు."

"అతనేమన్నాడు మరి? వస్తారన్నానని చెప్పాడా?"

"లేదు, నేను తండ్రితో మాత్రమే మాట్లాడి వచ్చానమ్మా."

"ఇహ్...అతనితోనే మాట్లాడితే అసలు రంగు బయటపడేదిగా నాన్నా, ఎక్కడో బండెడు పుస్తకాలు ముందువేసుక్కూర్చొని వుంటాడు. అతను ఇంట్లోవున్న అలికిడి అన్నా తెలియలేదా మీకు? చెప్పానుకాదూ, కొత్తవాళ్లొస్తే బొత్తిగా దాక్కొని పోతాడని. వట్టి పిరికివాడు. ఎదటబడి మాట్లాడుతున్నా వంచిన తల యెత్తడు. తెలీనివాళ్ళు అదంతా వినయం అనుకుంటూ వుంటారు. అతనికీ మనకీ యెక్కడ కుదురుతుంది నాన్నా?"

"అదేవిటమ్మా అలాగంటావ్? శ్రీనివాసరావుగారు అతనిమీద యెన్ని ఆశలు పెట్టుకున్నాడని! తండ్రిని మించిన కొడుకౌతాడు చూశావో లేదో.. "

ఆఁ...అతని 'యాక్టివిటీస్' అన్నీ కాలేజీలో చూస్తూనే వున్నానుగా! ఏదో మీటింగ్ అవుతుంది, ఏవో పద్యాలు చదివి యేదో గంపెడు చెప్పాలనుకుంటాడు నోరు పెగిలిరాదు పాపం! అందరూ చప్పట్లు కొడతారు, వెర్రిచూపులు చూసి లోపలకు జారుకుంటాడు. గరల్సు వున్నారంటే ఆ చాయలకు రావడమే భయం! మేమందరం 'బాడ్మింటను' 'రింగ్ టెన్నిసూ' ఆడుకుంటుంటే అరమైలు దూరంనించి బిక్కమొహం వేసుకుని చూసుకుంటూ పోతాడు. అతనికి 'లైఫ్ అంటే యేవిటో బొత్తిగా తెలీదు నాన్నా!'

"నువ్వనుకున్నవన్నీ నిజాలు కావమ్మా! అంతమాత్రాన వొకమనిషిని గురించి 'జడ్జిమెంటు' చెప్పెయ్యడం సబబుగాదు. ఈ పద్మనాభం లోకం పోకడ అర్థంచేసుకున్నవాడే గాని అజ్ఞాని కాడని తెలుసా?"

"మరైతే మీరు నన్ను అర్థంచేసుకోలేదా నాన్నా?"

ఘట్టి కృష్ణమూర్తి

"చేసుకున్నాను, కాని యెల్లకాలం యిలాగే జీవించాలంటే అది కష్టమైన సంగతి జీవితమంటే యేవిటో బొత్తుగా అర్థం శుభం తెలియని అమాయకురాలవు గనక నీదే లోకం, నీదే రాజ్యం అనుకుంటున్నావ్, ఇటుచూడు. రేపు నీ వొక గృహిణివై ఒక యిల్లు చక్కబెట్టుకోవాల్సిన అవసరం యేర్పడినప్పుడు యీ కుప్పిగంతుల బతుకు ఇట్టే మరిచిపోతావ్ తల్లీ! నాన్న చెప్పేమాట నిదానంగా విను!"

"అదేవిటో నాకు భయం వేస్తోంది నాన్నా!"

"ఎవరున్నారిక్కడ! నేనేగా! వెనకా ముందూ ఆలోచించుకునే నేను శ్రీనివాసరావుగారి దగ్గరకు వెళ్లాను. సుగుణభూషణరావుని గురించి కాలేజీవారివల్ల చాలా తెలుసుకున్నాను. నువు చెప్పినవి కొన్ని నిజాలు, కొన్నికల్లలూను, అటువంటి గాంభీర్యం గల కుర్రవాడు మన పట్టణంలో మరి దొరకడనే నేనింత తొందరపడుతున్నాను."

"అదేవిటి నాన్నా అలా అంటున్నారు? అతనంటే అందరూ నవ్వుతారు నాన్నా! వట్టి పిచ్చివాడికింద కట్టేస్తూ వుంటారు."

"నవ్వే వాళ్లకు మనుషుల విలువ తెలీదు తల్లీ! ఎక్కడ ఏమాత్రం అవకాశం దొరికినా నవ్వేస్తూవుంటారు. కొస్తకు గంపంత చెబుతూవుంటారు. నూటికి నూరుపాళ్లూ మనం నమ్మకూడదమ్మా!"

"నే నన్నీ కళ్లతో చూశాను నాన్నా!"

"అయితే వొక్కమాట అడుగుతాను చెప్పు! నువు వొక్కదానివే చూశావా, అప్పుడు నీతో మరెవరైనా వున్నారా?"

"లేకేం, నా క్లాసుమేట్సు అందరూ వుండగానే, కావాలంటే వాళ్లచేతకూడా చెప్పిస్తాను మీకు."

"అందుకే అలా అడిగాను. వొక్కసారి నాతో వచ్చిచూడు అతనెలా కనబడతాడో! నీ పక్కన వున్న వాళ్లు వొకలాటి పిల్లలు. వాళ్లతోపాటే నీకూ పిచ్చెక్కించాలని, వాళ్లు నవ్వినతీరుగా నిన్నూ నవ్వించాలని చూస్తుంటారు పిచ్చితల్లీ! ఆపాటి ఆలోచన మీ కెక్కడిదమ్మా?"

"మీరు చెప్పేది నాకేవీ అర్థంకావడం లేదు నాన్నా."

"అర్థమయేటట్లు నే చేస్తాగా, వేళ అవుతోందిగానీ కాలేజీకి వెళ్లు! రోజూలాగా కాకుండా యివ్వాళ్ళనించీ కాస్త జాగ్రత్తగా వెళ్ళి వస్తూవుండాలి సుమా!"

"అంటే నా ఫ్రెండ్సు యెవ్వరితో కలియవద్దంటారా నాన్నా?"

"కలియవచ్చు, కాని నే చెప్పినమాటలు మనసులో వుంచుకొని మసులుకోవడం మంచిదంటాను. ఒక్క సుగుణభూషణుడే కాదు. యెవ్వర్ని గురించీ నీ అంతట నువు ఆలోచించకుండా, వొకరు చెప్పినట్టు నమ్మవద్దంటాను. అలా వ్యవహరించడం మనకు మంచిదికాదమ్మా మరొక్కమాట, నువు సుగుణ భూషణుణ్ణి గురించి మాట్లాడవలసి వచ్చినప్పుడు 'అతను, అనే కంటే.' ఆయన, అంటూ వుండడం మంచిది. మనల్ని మనం మన్నించుకోవడం తెలిశాకనే వొకళ్లని గౌరవించడం అంటే యేవిటో అ

ళ

మవుతుంది తల్లీ! వయసుకి, తాహతుకి మించిన మాటలు మాట్లాడితే మనుషులు తేలికైపోతారమ్మా! ఎదటివాళ్లని గురించి యెంతో తెలిస్తేగాని వొక్కమాట అనకూడదు"

"అదేమిటి నాన్నా, నా యిష్టం వొచ్చిన సంబంధం చేస్తానని మీరే అన్నారుగా మరి యిప్పుడు అతన్ని - కాదు ఆయన్ని చేసుకోమని బలవంతం చేస్తారెందుకు?"

"ఇప్పుడైనా నీ యిష్టం లేకుండా చేస్తానా? లోకవ్యవహారాల్లో తల పండినవాణ్ణి కనక ఉన్న బాగోగులు చెబుతున్నాను. నిజానికి యెవరెలాంటివారో నీబోటివాళ్లకేం తెలుస్తుంది చెప్పు! నాదగ్గర నువ్వింకా పసితల్లివే గదా! నీ అంతట నువ్వు చేసుకోనేలా వదిలిపెడితే అది చివరకు బెడిసికొడితే లోకం నన్ను దుయ్యబట్టదూ? ఇవన్నీ కళ్లెట్టుకు చూస్తూవూరుకోగలనా? కని పెంచిన మమకారం అలా యేడిపిస్తూ వుంటుంది. అక్కయ్య నీలాగే మారాం చేసింది. చివరికి నా యిష్టంమీదనే అతగాణ్ణి చేసుకొంది, ఇప్పుడేం లోటు వచ్చింది చెప్పు! నాన్నపైన ఆమాత్రం అభిమానం లేకపోతే యెలా తల్లీ!"

"అయినా ఇప్పుడేమంత తొందరొచ్చింది నాన్నా, నేను కావాలన్నంత చదువు చెప్పిస్తానన్నారుగా మరి?"

"అన్నానమ్మా, అన్నాను. కాని ఇప్పుడామాట మార్చుకుంటున్నాను. ప్రస్తుతానికి యింటర్‌తోనే ఆపెయ్య దల్చుకున్నాను.

ఆపైన అతనికి యిష్టమైతే నిన్ను లండన్ పంపడానికైనా సిద్ధమే."

"వాళ్లెందుకు వొప్పుకుంటారు నాన్నా?"

"లేకపోతే మానేద్దాం. ప్రపంచజ్ఞానానికి యీమాత్రం చాలదూ? మనం ఉద్యోగాలు చెయ్యాలా, వూళ్లు ఏలాలా? సరే కాలేజీకి వేళయింది పదమ్మా, నేనూ అలా వూళ్ళోకి వెళ్ళిరావాలి!" అంటూ జడ్జీగారు బైటికి వెళ్లిపోవడంతో సుశీల తిరిగి అక్కడే కూర్చుండిపోయింది—.

8

'ఇతరుల్ని గురించి స్వంతంగా ఆలోచించాలి' అంటాడు నాన్న. ఎవ్వరో చెప్పినమాట అంత తొందరగా నమ్మవద్దంటాడు. తనిప్పుడు చేసిందేమిటి? రోజూ కళ్లయెదట కనబడే వ్యక్తిగా అతను. అతన్నిగురించి తాను చేసుకొన్న కొన్ని నిర్ణయాలు యథార్థాలు కావా? అవన్నీ వొకళ్ళు తనకు చెబితే నమ్మినట్టివేనా? నాన్న తనమాట నెగ్గించుకోడానికి యిలా యెత్తులేసి మాట్లాడుతున్నాడేమో... అయినా, దేశంలో యింతమంది చదువుకున్న యువకులు, నవనాగరిక సంపన్నులు ఉండగా అతనికే తన నిచ్చి వివాహం చెయ్యాలనడంలో ఆయన స్వార్థం యేమీ లేదూ? లేక తన్ను కొంత అదుపులో పెట్టాలనే ఆదుర్దాలోనే యింత తొందరగా యిలాటి సంబంధం వెతుక్కొచ్చాడా?

తను మాత్రం హద్దుమీరి ప్రవర్తించిన దెప్పుడు? కాలేజీ కుర్రవాళ్ళంటేనే వట్టి పలుగాకులు! అందులోనూ కొంచెం స్వేచ్ఛగా, చనువుగా వ్యవహరించుకుపోయే తనలాటి వాళ్లను చూస్తే మరింత పగలబడిపోతారు. ఉన్నవీ, లేనివీ పది కల్పించి యాగీ చెయ్యాలని కాచుకూర్చుంటారు. వాళ్ళు చెప్పేవన్నీ యథార్థాలౌతయ్యా? పంకజం వొంటరిగా బండీలో వెళ్లుతున్నప్పుడు గవర్నరుపేట సెంటర్లో వొకడు సైకిలుమీద వచ్చి, మల్లెపూల చెండులో చీటీ కట్టి వొళ్ళోకి విసిరి రివ్వున దూసుకుపోలేదూ? నిజానికి అది చేసిన అపరాధమేమిటి? ఒకనాడు క్లాసులో లెక్చరర్ యేదో అడిగినప్పుడు ఒక్కడూ మాట్లాడకపోతే అది సమాధానం చెప్పింది. 'ఆడపిల్లల పాటి స్టడీ అన్నా లేద'ని ఆయనగారు ఆక్షేపించాడు. అందుకు దానిమీద సెక్షనంతా కత్తిగట్టి యిలాటి అవినీతి పనులకు దిగాలా? రచ్చకెక్కించి ఆ మొన్నాటిసించీ గోడలు పాడుచెయ్యాలా? అది హద్దుమీరిందని పెద్దలు కేకలెయ్యాలా? ఈ కచ్చ మనసులో పెట్టుకునే తను మాగజైనులో యేదో వ్రాసిందని కొందరు కామెరాలు పట్టుకుని తన వెనక తిరగాలా? లేనిపోని అహంభావం చూపుతున్నదని చర్చాసంఘాల్లో వాదించుకోవాలా?

ఇలాటిదేదో నాన్న చెవినిబడివుంటుంది. ఇంక అదుపులో పెట్టకపోతే చెయిదాటిపోతుందని ఆయన ఇలాటి సంబంధాన్ని పట్టుకువచ్చివుంటాడు.

అతనికీ తనకీ, తూర్పు పడమర కున్నంత తేడా వున్నది. నిజం కూడా అంతే. పాశ్చాత్య నాగరకత నిలువెల్లా వ్యాపింపజేసుకున్నది తను, పూర్వపు సంస్కారాలో పడి బూజుపట్టినవాడు అతను. మరి, యిద్దరికీ సన్నిహితత్వం యెలా కుదురుతుంది?

ఇవన్నీ నాన్న విచారించగలడా? ఆయన మనసు అంత సూక్ష్మపరిశీలనకు పోదేమో...ఉన్నవీ లేనివీ విని సమయానికి ఉచితంగా తోచిన తీర్పు చెప్పడం ఆయన వొంతు. ఆయన కడపటిజీవితమంతా అలాగే గడిచింది. ఇప్పటి పిల్లల మనస్తత్వం యెలా అర్థంచేసుకోగలడు? లేకపోతే వొకప్పుడు వొళ్ళో కూర్చోబెట్టుకుని 'నీయిష్టం వచ్చిన సంబంధం చేస్తానమ్మా' అంటూ బుజ్జగించినవాడు ఇప్పుడో మారిపోయి మాటల్లోనే మధ్య పెట్టజూడటం యెందుకు?

ఆయన మనసు మార్చుకుంటే తనూ మార్చుకోవాలా? ఇన్నాళ్లుగా కలలుగంటూ తాను అనుగమించాలనుకుంటున్న స్వేచ్ఛాజీవితపథాన్ని తప్పి ఆయన చూపిన బాటలోనే పయనించి అంతటితో తృప్తిపడి అదే ఉత్తమ లక్ష్యసాధనం అనుకోవాలా? తన చేత రోజూ నిర్లక్ష్యంగా చూడబడే ఒక వ్యక్తినే, జీవితసర్వస్వంగా యెంచి, అంతస్సులో కలిగిన అసంతృప్తి అణచుకుని, వంతలపాలై రవ్వంతైనా చైతన్యంలేని కట్టెలా బ్రతుకు వెళ్లదీయాలా?...అమ్మయ్యో... తనకు రాబోయే యీ దుర్గతి, రసవిహీనమైన యీ బ్రతుకు తల్చుకుంటే గుండె గాయమౌతుంది. జీవితరథానికి చక్రం తొలగుతుంది. అబ్బ......నాన్న యెంతటి ఘాతుకం తలపెట్టాడు?—తల గట్టిగా పట్టుకుని కనురెప్పలు పైకెత్తి అటు గడియారం వంక చూడబోయింది సుశీల. జడ్జీగారు గుమ్మం యెదురుగా నిలబడివున్నాడు. ఉలిక్కిపడ్డట్టయింది సుశీలకు. మైకంనించి



కదళీవనం
ఫొటో: కావూరి గోపాలకృష్ణమూర్తి—బాపట్ల.

కమాయించుకుని మొహంలోకి లేని నేవళం తెచ్చుకుంటూ తండ్రితో యేదో మాటాడబోయింది. అంతలో ఆయనే అంటుకున్నారు, 'ఇవ్వాళ కాలేజీకి వెళ్లవా అమ్మా!' అని—

9

సుగుణ భూషణరావు మామూలుగానే ఆనాడూ కాలేజీకి బయల్దేరాడు. అతనిలో చెప్పదగిన మార్పేమీ పైకి కనబడ్డంలేదు. యథారీతిగానే అతను ఆలోచించుకుంటున్నాడు. కాని, అతని కళ్లు ఈనాడెవరి కోసమో వెతుక్కుంటున్నట్లున్నయ్.

అతని భావుకహృదయం యెందుకనో ఆమె నొకసారి చూడాలని తహతహలాడుతోంది. మనసులోని భావం కొంత మార్పు చెందవలసిన అవసరం వున్నప్పుడు, లేదా - అది అట్టి మార్పుకు అభిముఖమై వున్నప్పుడు - బాహ్యప్రకృతులు యథాతథంగానే భాసిస్తవా లేక వాట్లలో యేదైనా వైలక్షణ్యం గోచరించగలదా అని ప్రస్తుతం అతను లోలోపలనే ప్రశ్నించుకుంటున్నాడు. అతని గంభీర హృదయాంతరాళంలో యేమూలనో యిట్టి ఆలోచనాలేశం యిమిడివుండి సూక్ష్మమైన భావపరంపరను పొటమరింపజేస్తున్నది. కేవలం భావసంపదే కాక లౌకిక వ్యవహారజ్ఞానం తదనుగుణమైనదిగా వుండాలనే అతని దృఢనిశ్చయం. అందువల్ల కొద్దిసేపటికిందటే తండ్రి తనతో అన్నమాటలను నెమరుకు తెచ్చుకోసాగాడు-'ఆయన కేవలం యాంత్రికంగా యిట్టి నిశ్చయానికి వచ్చివుంటాడా?' అన్న భావం పొడమటంతో చివుక్కున ఆగి తిరిగీ నడక సాగించాడు.

అలా భావించడం ఆయనయెడల ద్రోహం తలపెట్టడమౌతుందా? అన్నదే అతని భయం.

నైతికోన్నతినిగురించి, లౌకిక సమీక్షవలన దాని స్థాయి తగ్గిపోకుండా వుండవలసిన అవసరంగురించి అతను కొంతగా తెల్సుకున్నాడు. కాని, దాని యథార్థం యెంతవరకు రూఢికాగలదో నిరూపించుకోవలసిన సమయం యిప్పుడు వచ్చినట్లుంది! తన మనస్తత్వం బొత్తిగా తెలియకనే ఆయన ఇలా మాట్లాడివుంటారా! తను మాత్రం ఆయన పెద్దరికాన్ని యేమి నిల్పగలిగాడు? "ఇది ధర్మనిలయం అనే మాట యథార్థమేనా?" అని అంత నిర్మోహమాటంగా గద్దించి ప్రశ్నించడంతో మానుషం దెబ్బతిన్నదేమో ఆయనకు... కాగా తనూ కొంత ఉద్రేకానికి గురిఅయ్యాడన్న మాట! ఇది యథార్థ పరిశీలనకు దూరమైన ఆవేశమా? లేక తాను విశ్వసించిన మార్గాన గమించినప్పుడే సుఖశాంతులు లభింపగలవని, జీవితానికి శాశ్వతమైన వెలుగు చేకూరగలదని, అనుకొనే ఆశయానికి యిందువలన విఘాతం కలుగుతుంది, దానికి ఆయనే ఆలంబనమనే రోషంవల్ల అలా మాటలు మీరడం సంభవించిందా? ఒక దృష్టితో పరిశీలించినప్పుడు ఇదీ తన స్వార్థమే అవుతుంది. ఎవ్వరి స్వార్థం యెవ్వరు వదులుకుంటారు గనక! నోటితో చెప్పకపోయినా తనకీ సంబంధాన్ని ఖాయపర్చాలని పట్టుబట్టడంలో ఆయన స్వార్థంకూడా కొంత యిమిడివున్నదని తనిప్పుడు భావించుకోవడం ద్రోహమౌతుందా?

మొదట్లో మొగ్గజూపి వదలిపెట్టిన

★ సుశీల ★

నుంటూరు సంబంధంకూడా యుంటేగా! కాకపోతే సాంకేతికములైన యేవో కొన్ని కారణాలవల్ల అది కాకుండాపోయింది. ఒక్క చదువు మినహాయించితే యిదీ దానికి నకలేగా!

ఈమధ్యలో చేసుకొన్న కొన్ని స్వల్పమైన నిర్ణయాలు తనకు కొంత అనుభవాన్ని గడించిపెట్టినా అది వొక రూపానికంటూ రాలేదు. ఇంత తొందరలో యిది యిలా బిళ్లబీటుగా ముంచుకువస్తుందని తనుమాత్రం అనుకున్నాడు కనకనా? ఏది యేమైనా యివ్వాళ సుశీల యెలా కనబడుతుందో అన్న ఆతురత యెక్కువైనకొలదీ అడుగులు తొందరగా పడసాగినై. సాధ్యమైనంత వరకూ ఆమె కాలేజీకి వస్తున్నప్పుడే చూడాలి. అదీకాక బండీలో వొక్కొక్కసారి వొస్తూవుంటుంది కూడా! ఎప్పుడో వొకవాడు కాని మరెవ్వరైనా యెక్కరారు. తను బాల్కనీలోనే వుంటే మెట్లెక్కబోయేటప్పుడు కళ్లనిండుగా కనబడుతుంది. అయినా తనక్కడ తారట్లాడుతుంటే 'ఆహారా' లాంటివాళ్ళు కొందరు అనుమానపడి యాగీకి దిగరుగదా!

తానెంత త్వరగా నడిచివస్తున్నా ననుకున్నా ఆలోచనల బరువులో అడుగులు తడబడుతూనే వున్నయ్. రోజూ కాలేజి మొదలుకి అరగంటముందే వచ్చేవాడు. ఈనాడు అరఫర్లాంగు దూరంలో వుండగానే మూడవగంట 'ఖంగ్' మని మోగడంతో గోడమీది కాలు సగానరి క్లాసు రూములో పెట్టాడు.

10

కోటివారితో తిరిగి కొనసాగించిన చర్చల ఫలితంగా ప్రస్తుతానికి వొక నిర్ణయానికి వచ్చాడు రావుగారు. తాను వేసుకున్న ప్రణాళికలన్నీ యధాతధంగా కొనసాగనంత మాత్రాన బొత్తుగా తిలోదకాలిచ్చుకుని దూరం పడిపోవడం ఉత్తమం కాదని తన సహచరులలో కొందరు గాఢంగా హెచ్చరించడంతోనే పర్యవసానం యిలా అయింది. చింత చచ్చినా పులుపు చావదు, ఎంత పుచ్చినా మిరియపుగింజ కందిగింజకు సాటి రాకపోయిందా?

ప్రస్తుతం అధికారం వెలగబెట్టేవారంతా తన పలుకుబడిని గుర్తించనివారి కోవలోనే చేరివుండవచ్చు. బంధుప్రీతి, జాత్యభిమానం మొదలైన అవగుణాలు వారిని ఆవరించడంవల్ల కంట్రాక్టులు, రూట్లు తన దాకా రాకపోవచ్చు, కాని, స్థానికంగా తనకుగల పలుకుబడిని యెవ్వరూ హరించలేరు; దాదాపు ఒక తరంపాటు ఆంధ్రావని సర్వతోముఖాభివృద్ధికి పాటుబడి అందులో తలపండిన తనను కాదని యెవ్వరీ పట్టణంలో అడుగుపెట్టగలరు? ఒకవేళ అధికారం అలా చేసినా, యెన్నాళ్లక్కడ కాలూని నిలవగలరు?

అయితే గంగాధరం వ్రాసిన వ్యవహారం బొత్తుగా వదులుకోకుండానే యేకకాలంలో రెండూ కొనసాగేటట్లు చూసుకోవడంలో తన చాతుర్యాన్ని ప్రదర్శించితే అందరూ నోరెళ్ళబెలవేస్తారు! దీనికి యింటా - బయటా కూడా కొండంత సహాయం కావలసివున్నది. సుగుణభూషణంగాడికి పరీక్షలు కూడా అయిపోతున్నయ్, వాడిని వొప్పించి గోదాలోకి దించాల్సిందే! అదృష్టం లేని వాళ్ళకే యిలాంటి వాళ్లు దాపురిస్తారుంటారు. మరొకడైతే యెగిరి గంతువేసి తను చెప్పినట్లు నడిపించుకుపోడూ? ఇంతకీ కడుపున పుట్టినవాడు కాకపోవడంవల్ల కష్టసుఖాలు అర్థంచేసుకు మెసులుకోవడం వాడికి చేతకావడంలేదు. ఎద్దుపుండు కాకికి ముద్దా? తెచ్చిపెడితే తినమరిగినవాడికి స్వయంకృషిలోవుండే విలువ యేమర్థమవుతుంది? ఇంతవరకూ వాడి చదువుకి యెన్ని వేలు తగలబోశాడూ తను? వాడేకనక తనతో కలియకపోతే యిదంతా బూడిదంలో పోసిన పన్నీరేగా! ఈ గాడిద బరువంతా తను మోయడం దేనికి? ఎవరికోసం? ఆమాత్రం జ్ఞానం వాడికేదీ?—

మిత్రులు చెప్పిన మరో సలహాకూడా మర్చిపోకూడదు. తన పలుకుబడిని పెంచుకోడానికి - కనీసం ఉన్నది తుడిచిపెట్టుకుపోకుండా వుండడానికి - అవసరాన్ని అవకాశాన్ని బట్టి అన్ని రాజకీయ పార్టీలతోనూ సహకరించినట్లు కనబడాలి. అదీ నిజమే మరి! ఇంతవరకూ తను ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోనేలేదు. కాని ఈనాడు అధికారంలో వున్న పార్టీ రేపటికి పట్టీకొడుతోంది. వచ్చే పరిణామాలు జాగ్రత్తగా గమనించి ఒకరిని మంచిచేసుకోవడం ఉత్తమమే అవుతుంది. కాకపోతే జడ్జీగారితో వియ్యంపొంది యిలాంటి రాజకీయ కత్తులలో పాల్గొనడం సబబేనా? అన్నది విచారణీయాంశం. అవసరమైతే ఆయన్నూ తనతో పాటు దించుతాడు. ఆయన ప్రభావానికి తను లొంగుతాడనడం కల్ల. నిన్నకాక మొన్న యిక్కడికి వచ్చి స్థిరపడిపోయినవా

చాయక. అనాదినించీ అతుక్కుపోయిన వాడు తను. ఎంతలేదన్నా తనలాంటి వ్యాపారస్థులకు, జడ్జీగారిలాంటి వారికీ పెద్ద తేడా వుండనేవుంటుంది. వారు తాత్కాలికంగా అవకాశాన్ని పురస్కరించుకొని కొన్ని తరహాల వ్యక్తులపై మాత్రమే ప్రభావం చూపగల్గుతారు. ఆ కుర్చీలో వున్నంతవరకే వారి విలువ. తరువాత మొహం జూసేవారుండరు. అక్కడికీ మానుమంకోసం పాకులాడుతూ పూర్వపు ప్రాభవాన్ని సంపాదించుకోలేక దించుకుపోయేవారి కొందరిని చూడడంలేదు? తన జాతివారికీ విధమైన దురవస్థ యెన్నటికీ ప్రాప్తించదు. కాలంతోపాటే విలువలు పెంచుకోవచ్చును. ఒకవేళ వాతావరణం అనుకూలంగాక అది అణగివున్నా మరో దెబ్బకు బంతిలా పైకెగురుతుంది. పువ్వుల్లో దారం దూరినట్లు తనలాంటివాళ్లు అందరి హృదయాల్లోకీ చొచ్చుకుపోయి వారిని యిస్తే ఆకట్టుకుని అదుపులో పెట్టుకో గలరు.

కొందరు చెప్పినట్టు మితిమీరిన వాంఛలు యెవ్వరికీ పనికిరావనే మాటకు తనూ కట్టుబడే వుంటాడు. కాని చెప్పే మాట సూటిగావుండాలి. చేసుకుపోయేది ఖచ్చితంగా ముక్కుకు సూటిగా సిమ్మెంటు రోడ్డులా వుండాలి.

దేశక్షేమంకోసమే పాటుపడుతున్నా మనుకొన్న యెవ్వరుమాత్రం స్వార్థానికి సొంతం తిలోదకాలిచ్చుకొన్నారు? తన్ను మాలిన ధర్మం యెక్కడైనావుందా? దేశానికి కానీ విలువైన పని చేసిపెట్టామంటే కాస్తైనా ప్రతిఫలం ముట్టవద్దూ? ఆ లక్ష్యంతోనే తను ఇన్నాళ్లూ పాటుబడ్డాడు; లక్షణంగా వ్యవహారం నడిపించుకువచ్చాడు. ఈ వ్యూహాల్లో ఏవొక్కటి లక్ష్యంగా పెట్టుకుని పనిచేసినా సుగుణభూషణుడు బాగు పడిపోను. కాని వాడు ఏదీ పట్టించుకోకుండా బొత్తిగా పరాయివాడుగానే వెళ్ళ తొలిగి పోరుకోవడంలో తాను అల్లుడా మనుకొంటున్న ప్లానుల తంతువులు చిక్కుపడిపోయే ప్రమాదం పొంచిచూస్తోంది. దానికోసం తనిప్పుడు వెనుకకు నడుస్తాడా? అలా యెన్నటికీ జరగదు. శ్రీనివాసరావు రథం అప్రతిహతంగా సాగిపోవలసినదే! అదృష్టంలేక యెవరైనా అడ్డువస్తే వెధవలు నలిగి పోతుకుంటారు. తరువాతి వ్యవహారమంతా జడ్జీగారితో ఆలోచించాలి; అనిగుండె దిటవుచేసుకుని ఉజ్వల భవిష్యత్ప్రాంగణంలోకి అడుగుపెట్టాలనే దృఢ నిశ్చయంతో కుర్చీలోనించి చివాల్న లేచాడు రావుగారు. అప్పుడే కాలేజీనించి వస్తున్న సుగుణభూషణుడు గదిగుమ్మంలో అడుగుపెట్టాడు——

(ఇంకా వుంది)

'ఇప్పటిసంగతి కాదు'

ఎం. ఎస్. ప్రకాశరావు

చోళరాజ్యంలో పెనుతుఫాను వీస్తోంది. ఆమాటకొస్తే ప్రక్కనున్న పాండ్యదేశంలోనూ, ఇంకా తదితర ప్రాంతాలలోనూ కుంభవృష్టి దంచేస్తోంది. అయితేనేం మగధరాజ్యపు రాజధానీ నగరమయిన పాటలీపుత్రంలో అలాంటి అవాంతరమేమీ లేదుకనుక, ఆ దేశాధీశ్వరుడు, భీమసేన మహారాజులుంగారు అంతఃపురోద్యానవనంలో పచార్లు చేస్తున్నారు. సూర్యాస్తమయ సమయం. ప్రకృతంతా చాలా అందంగా ఆనందంగావుంది. పైన వివిధవర్ణాలతో ఆకాశం, క్రిందా అదే విధంగా వివిధవర్ణాల పుష్పాలతో ఉద్యానవనం. ఇవన్నీ, నిజానికి సామాన్య మానవుడికి ఆనందాన్నిస్తాయి, కవికుమారులకి కవనం పుట్టిస్తాయి. ఇంకా ఇతరులని వారి వారి వ్యాపకాలనిబట్టి ఆయావిధాల వుత్తేజింప చేయగలిగే ప్రకృతి అది. కాని వీరు మహారాజులు కనుక యీ ప్రకృతి ఆయన్నంత ఆకర్షించలేదు. మహారాజుల శరీరాలు మాత్రమే అక్కడుంటాయి. మనస్సు ఎక్కడో తిరుగుతూవుంటుంది. అలా ఎక్కడో పచార్లు చేస్తున్న ఆయన మనస్సుని ఇక్కడికి లాక్కొచ్చాడు, అప్పుడే ప్రవేశించిన ఆ యువకుడు. మేలి సువర్ణచ్ఛాయను బోలు దేహమువాడు, సమున్నతవక్షుడు, పుండరీకదళనేత్రుడు, ఇత్యాది విశేషణాలతో కూడి, కాశీమజిలీ కథానాయకుడిలాంటివాడా యువకుడు. ఆయన్ని చూసి గొంతు సవరించుకుని ఏదో నసిగాడు.

"ఊఁ?" అని ప్రశ్నార్థకంగా వురిమేరు భీమసేనులు. ఆయనకి వురమడంతప్ప మామూలుగా మాట్లాడడం చేతకాదు.

"నన్ను పిలిపించారుట?"

"తప్పా?" అంటూ మధ్యలో అతన్నాపేశారు మహారాజులుగారు, ఈ సంగతేదో తేల్చుకుంటేనేకాని ముందుకి వెళ్ళడానికి వీలులేనట్లు. ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఈ తండ్రీకొడుకుల సంవాదం సాధారణంగా యీ ఫక్కీలోనే నడుస్తుంది.

"తప్పని ఎవరనగలరు? కారణమేమా అని?"

"కారణం లేందే పిలిపిస్తారనుకున్నావా?"

"మరా కారణమేదో త్వరగా చెబితే సంతోషిస్తా."

"ఏమిటా తొందర?"

"క్రింద గుర్రం సిద్ధంగా వుంది. ప్రతిదినం సాయంత్రమీ సమయానికి గుర్రపుస్వారీ చేయడం నా కలవాటన్న విషయం తమకు తెలియంది కాదు" అన్నాడు అతి విసుగ్గా.

"ధస్" అంటూ పగిలిన బెలూన్లా అక్కడున్న తిన్నెమీద చతికిలబడ్డారు భీమసేనులు. తన కే చింతా లేదు. వీడు - తన సుపుత్రుడయిన వీడు మాత్రం తెగ ఏడిపించేస్తున్నాడు. తానెంత ముఖ్య విషయం వాడితో మాట్లాడాలనుకున్నారు? వాడికా గుర్రపుస్వారీ ఎక్కువయింది కాబోసు! కాని అసలు సంగతి వాడికి తెలియజేయలేదన్న సంగతాయన విస్మరించారు. తండ్రిగారితో సంభాషణంటే కులవర్ధనుడికి తలనొప్పి. బండిరెప్పుడూ నిష్ఠురాలతో పక్కబాట పట్టిస్తారు కాని అసలు దారికి రారు.

"నేనెంతో ముఖ్యవిషయం నీతో మాట్లాడా లనుకుంటూంటే, దానికంటే యీ వెధవగుర్రపుస్వారీ ఎక్కువటోయ్?"

దీనిమీద యువరాజు, వ్యాపకా లనేవి మానవుడికెంత ముఖ్యాలో, వాటిలో పేరెన్నికగాంచిన పెద్దలెంతమందున్నారో, వారి పేర్లతో, చరిత్రలతో ఋజువుచేసి, తన గుర్రపుస్వారీ వ్యాపకాన్నంత తేలికగా తోసేయడం తన కంత రుచించదన్నట్లు రాజావారికి తెలియజేశాడు. నలుడు, ధర్మరాజు, ఇత్యాది పురాణపురుషులందర్నీ లాక్కొచ్చేశాడు. వాటిమీద తిరిగి వో అరగంట వాదోపవాదాలు జరిగాయి. చివరికి యువకుడికి విసుగొచ్చి,

"అసలు సంగతేదో చెబుదురూ" అన్నాడు.

"ఏ సంగతీ చెప్పకపోతే ఎందుకు పిలిపిస్తానోయ్? నాకే కాబోసంత తీరుబడి. పిలిపించింది నీ పెళ్ళివిషయం—"

"ఏమిటీ నా పెళ్ళివిషయమా?" టక్. దీనికోసమా తన కాలాన్నంతా వ్యర్థం చేశారు? ఈపాటికి నగరం పొలిమేర దాటి వుండేవాడు.

"అవునోయ్, నీ పెళ్ళి. లేకపోతే నా దనుకున్నావా?" తిరిగి వాదోపవాదాలు నడిచాయి. బహుశః సృష్ట్యాది నుండి ఇది వస్తూన్న విషయమే నేమో! తనమాట కొడు కెందుకు వినకూడదని తండ్రి, తనమీదంత అధికారం చేయడానికాయనకేమి హక్కున్నదని కొడుకు అనుకోడం, దాంతో ప్రతి చిన్న విషయాలకి వాదించుకోడం. అలా అని ఒకళ్లనొకళ్లు ద్వేషించుకుంటారని అనుకోడానికి వీలులేదు. సాధారణంగా అటువంటివాళ్ళకే ప్రేమాభిమానాలు ఎక్కువుంటాయి.

"ఆ పిల్లని నీవు తప్పకుండా చేసుకోవాలి."

"నే చేసుగోను."

"ఏం?"

"ఏంలేదు. నా కిష్టంలేదు."

"ఇష్టంలేదూ? ఎందుచేత? ఆ పిల్లని చూశావా, ఏడిశావా?"

"అందుచేతనే. క్షమించండి." అంటూ కందగడ్డలా గయిపోయిన ముఖాన్ని తక్షున వెనక్కి తిప్పేసి వెళ్ళిపోయాడు. పాపం, అతని గుర్రానికి ఎప్పుడూ తగలని దెబ్బ ఛెళ్లున తగలడంతో వాయువేగంతో పరుగు తీసింది. కానయితే అతని కానాడు స్వారీ నిరాఘాటంగా చేసే అదృష్టం కలగలేదు. బలంగా కళ్లెంలాగి ఆ గుర్రాన్ని సమయానికి ఆపకపోయివున్నట్లయితే, తనూ గుర్రమూకూడా తిన్నగా ద్వారాని కడ్డంగా నిలబడిన బండికేసి కొట్టుకునుండేవారు. రాజకుమారుడికి తగనికోపం వచ్చింది.

"ఏమిట్రా యీ బండీ గొడవానూ?"

"ఆ బండిలో ఆవిడెవరో బండితో లోపలకి వెడతానంటూంది. ప్రభువుగారి ఆజ్ఞలేనిదే ఎలాపంపడం?"

ఇంతలో బండికి వున్న తెర తొలగించుకుని తొంగిచూచిందో తలకాయ. అదెవరిదయిందీ కులవర్ధనుడికి తెలియదు. కాని అంతఅందమయిన ముఖాన్ని తానింతవరకూ చూడలేదనిపించింది. ఒక్క విషయం. తన తండ్రిగారు చెప్పిన అమ్మాయిని తను ఛస్తే చేసుగోడు. రాజ్యమో, గీజ్యమో .. ఈ ఆలోచనలో వుండిపోయి, ఆ తలకాయ తనతోటే ఏదో మాట్లాడుతోందన్న విషయం గమనించనేలేదు. ఈయన అవస్థని

కొద్దిగా వంగి
చెవిలో వూద

"—పిల్లలకి ... చెప్పడానికి, రాణిగారికి చెలికత్తె వుండటానికీ, ఎనిమిది భాషలు వచ్చునన్నిక్కడికి [illegible] చారు. తక్షశిలనుంచి వచ్చాను" అంటోందా అమ్మాయి. ఈ విషయనే ప్రసంగవశాత్తు తన తల్లి ఎవరితోనో అంటూంటే విన్నాడు. అంత చిన్న వయస్సులో అన్ని భాషలెలా నేర్చుకుందోనని ఆవిడ ఆశ్చర్యం కూడా కనబర్చింది. తన తండ్రిగారి మందమరుపుకి వొళ్లు మండింది రాజకుమారుడికి. అక్కరకు రానివన్నీ గుర్తొస్తాయి, కాస్త ఈ విషయంలో ముందుగా ఆజ్ఞాపత్రమిస్తే ఎంత బాగుండేది. ఆ అమ్మాయికీ అవస్థ తప్పేదికదా. "బండి లోపలికి పోనీయండ"ని వాళ్లకి ఆజ్ఞాపించి, "మీరు లోపలికి వెళ్లండి. మా అమ్మగారు, బహుశః మీకోసం నిరీక్షిస్తూనేవుంటారనుకుంటా" నన్నాడు. తనింతవరకు రెప్పవాల్చక చూస్తోన్నది యువరాజునని తెలియగానే, ఆ తలకాయ చటుక్కున తెరలలోకి మాయమైపోయింది.

ఆతరువాత యువరాజుగుర్రం దౌడు తీయడం మానేసింది, యజమాని ఇంగితాన్ని గుర్తించినట్లు. కానయితే అతని మనస్సు వెనుకటి అన్ని స్పీడు రికార్డులని ఛేదించుకుని వెనక్కి దౌడుతీయడం ప్రారంభించింది. ఈ గుర్రాన్నాపడం రాజకుమారుడి తరం కాదు.

*   *   *

"మహారాణీ, ఆ వచ్చినమ్మాయి సంగతి సందర్భాలు కనుక్కున్నావా?"

"అదేం మహారాజా! అలా అడుగుతున్నారు? ఆ అమ్మాయికేం, చాలా బుద్ధిమంతురాలు సంస్కృతాంధ్ర, వంగ, పార్శీ, ఇత్యాది ఎనిమిది భాషలలో ప్రావీణ్యముంది. అక్కడ ఆమె సంరక్షకుడు గొప్ప పండితుడట. ఆయనే నేర్పారట. చాలాగ్రంథాలు చదివింది పిల్లలంటే చాలా శ్రద్ధ చూపిస్తుంది."

"అబ్బబ్బ. భగవంతుడా! నాకో తిక్కశంకరయ్య కొడుకుని, వట్టి అమాయకపు భార్యని ప్రసాదించావేమయ్యా? చూడు మహారాణీ, ఆ అమ్మాయి ముఖం ఎక్కడో చూసినట్లుంది. ఆమె తక్షశిలనుండికదూ వచ్చిందన్నావు?"

"అవును. ఏమిటందులో ప్రత్యేకత?"

"ఆ గోడమీదున్న చిత్రపటాన్ని చూశావా? ఈ అమ్మాయిలో ఆ పోలికలు కనబడుతున్నాయి." అంటూ అక్కడనుండి తప్పుకున్నారు భీమసేనులుంగారు. ఆ తరువాత మహారాణీవారు, అక్కడ గోడమీద వేలాడుతూన్న వెనుకటి మహారాజుగారి

[illegible] తలబడిపోయారు చాలా సేపు. [illegible] కాక. చివరికి ఒక పెద్దనిట్టూర్పు విడిచి, 'అంత అదృష్టం కూడానా' అనుకుంటూ వెళ్ళారు.

*   *   *

చిత్రపటం సంగతి వచ్చింది కనుక, చరిత్ర కొంచం చెప్పాల్సివుంటుంది. పద్దెనిమిది సంవత్సరాలకి క్రితపుమాట. భీమసేనుడు మగధరాజ్యానికి మహామంత్రిగా వుండేవారు. సామ్రాజ్యానికి మహామంత్రిని సంరక్షకుడుగా నియమించి, మహారాజువారు (అంటే ప్రస్తుతం చిత్రపటంలో వున్నవారు) అప్పటికి సంవత్సరపు వయస్సు కుమార్తెను, భార్యను తీసికుని తీర్థయాత్రకి వెళ్ళారు! ఎక్కడో మార్గంలో మహారాజు హత్యచేయబడ్డారు. రాణీ, రాకుమార్తెల సంగతిమాత్రం ఎవరికీ తెలియలేదు. ఆ విషయంలో భీమసేనుడి చేయుందని తెలిసినవాళ్ళు చాలా కొద్దిమంది. ప్రస్తుతపు మహారాణికి తెలియదా విషయం. అప్పటినుండి సంరక్షకుడి పేరుతో ఆ మహారాజ్యాన్ననుభవిస్తున్నారు భీమసేనులు. చాలామందీ ఈయన సంరక్షకుడన్నమాట అప్పుడే మరచిపోయి, ఈయన్నే మహారాజులా చూస్తున్నారు. కాని ఇప్పటికీ రాజకుమార్తె కోసం అన్వేషణ జరుగుతూనేవుంది. ఆమె రాగానే ఈ రాజ్యభారాన్ని ఆమెకో, ఆమె భర్తకో వప్పగించేసి భీమసేనులుంగారు విశ్రాంతి తీసికుంటారు. రాజకుటుంబంమీది భక్తిచేత పాపం భీమసేనులుంగారు, నిజానికి రాజ్యమంతా తమక్రిందున్నప్పటికీ రాజాంతఃపురంలోకి మారకుండా, ఇంకా తమ వెనుకటి భవనంలోనే వుంటున్నారు. ఇది ప్రజలకి తెలిసిన విషయం. ప్రజలకి తెలియనివిషయమేమంటే, తమ రాణీగారు తక్షశిలలో బందిఖానాలో యీ పద్దెనిమిదేండ్లనుండి మ్రగ్గిపోతున్నారనీ, రాకుమార్తెకూడా అక్కడే ఒక పేద బ్రాహ్మణుడింట్లో తను రాకుమార్తెనన్న విషయం తెలియకుండా పెరుగుతోందనీ ఆమె జన్మరహస్యం ఆమెకి, ఆ పేద పారుడుకికూడా తెలియదు.

కాని భీమసేనులకు రోజులెప్పుడూ నిశ్చింతతో జరగలేదు. ఆయనలో ఏమూలో అంతవరకూ గాఢ సుషుప్తిలో వున్న అంతరాత్మ మేలుకోడం మొదలుపెట్టింది. అది మేలుకోకుండానే వుండాలి కాని మేలుకుంటే ఇంక దాన్నాపడం మెవరితరం కాదు. అదప్పటినుండి ఆయన చేసిన పాడుపనికాయన్ని రంపపుకోతకోయడం మొదలెట్టింది. మెత్తటి హంసతూలికా తల్పం మీద తాను నిద్రించినప్పుడు కటికనేల

ఇప్పటిసంగతి కాదు

మీద కడుపాకలితో, కష్టపడే మహారాణి దైన్యరూపం కళ్లకికట్టినట్లుండి పోయేది. అల్లారుముద్దుగా, అతి సుకుమారంగా పెరుగవలసిన రాజకుమార్తె నానా కష్టాలు పడుతూ దరిద్రబ్రాహ్మణుడింట్లో పెరుగుతూండడం ఆయన కొక దుస్స్వప్నమై పోయింది. ఇది రాను రాను విషమించి పోయింది. తక్షశిలలోని తన మనిషినుండి లేఖ వచ్చిననాడది మరీ విపరీతంగా వుండేది. దాంతో అక్కడి మనిషికి తనకే లేఖా వ్రాయవద్దని ఖండితంగా ఆజ్ఞాపించారు. కాని ఆయన అంతరాత్మ ఆయన్ని వదలలేదు. దాంతో చాలారోజులు రాత్రులందు నిద్దుర లేకుండా పోయింది. ఈ అంతరాత్మ అనేది కొమవరపు జీడిలా, నల్లేరు బంకలా పట్టుకుని వదలదు. దాన్ని విడిపించుకునే శక్తి మానవుడికి లేదు; ఒక్క జంతువులకే వుంది!

ఈ బాధ ఆయన చాలా పడ్డాడు. ఒక్కొక్కప్పుడు రాజకుమార్తెను పిలిపించి ఆ రాజ్యం కాస్త ఆమె కిచ్చేద్దామనుకునేవారు. కాని తిరిగి ఆశ ఒక మూలనుంచి "నేనూ వున్నాన"నేది. ఆశ, అంతరాత్మల మధ్య యుద్ధంతో రోజులు జరిగిపోయాయి, సంవత్సరాలు జరిగిపోయాయి. వాటిలో వోటమి దేనికీ కలగలేదు. ఇటువంటి సమయంలోనే ఆయనకా రెండింటికి మధ్య సంధి పొసగించేస్తే తన బాధ తీరిపోతుందనుకున్నారు. ఈ సంధిమార్గమాయన సుపుత్రుడే చూపించాడు. వాడు మంచి అందగాడుగా తయారయ్యేసరికి, అంతవరకూ భిన్నమార్గాలు పట్టేసిన ఆయన ప్లానులన్నీ ఒక దారికొచ్చాయి. ఆ అమ్మాయిని తీసికునివచ్చి, పీడికిచ్చి పెళ్లి చేసేస్తే, తరువాత ఆమె జన్మరహస్యం బహిరంగం చేసేసినా, రాజ్యం తమ చేతుల్లోంచి పోదు. ఈ ప్లానులన్నీ బాగానే వున్నాయి కాని ఒక్క అవాంతరమే వచ్చిపడింది. కులవర్ధనుడేమో వట్టి దౌర్భాగ్యుడు. తను చెప్పి నమ్మాయిని ససేమిరా చేసుకోనంటున్నాడు. ఇంతలో ఈ అమ్మాయి ఎవరు? ఆమెయే ఈమెయా? ఈ అమ్మాయి వచ్చిన తరువాత తిరిగి తనకి మనోబాధ ఎక్కువయింది అందుకనే ఆ అమ్మాయి ఎప్పుడు తన కంటబడినా భ్రమింగేసేలా చూస్తూవుంటారు.

ఇంతలో తక్షశిలకి పంపిన వార్తాహరుడొచ్చాడు. రాణిగారు సంవత్సరం క్రితమే మరణించింది. రాకుమార్తె మాత్రం, తన సంరక్షకుడైన పేదబ్రాహ్మణుడి మరణంతో పొట్టపోషించుకోడాని కెక్కడికో వెళ్లిపోయింది. దాంతో ఆయన కడుపులో రంపపు కోత ఎక్కువైపోయింది. ఆ అమ్మాయిపై కోపం ఇంకా ఎక్కువైపోయింది. ఆ అమ్మాయి లేకపోతే తనకే బాధా ఉండేది కాదు. ఆమె సంగతేదో పూర్తిగా కనుక్కోవాలి. 'మహారాణీ' అంటూ లోపలకి పరిగెత్తారు. ఏదో పనిమీద అలా వచ్చిన ఆ అమ్మాయి ఈయన వురుములకి ఖంగారుపడి లోపలకి పరిగెత్తింది.

ఆ అమ్మాయికి మొదటినుండీ ఆయనంటే భయం, అసహ్యం కలిగాయి. తనేదో అపరాధం చేసినదానిలా ఎప్పుడూ తనకేసి గుర్రుమనే చూస్తాడు. రాణిగారు మంచిదే కాని వట్టి అమాయకురాలు. "నువ్వెవరివి?" అంటూ అర్థంలేకుండా అప్పుడప్పుడు ప్రశ్నిస్తుంది. తనకేసి, ఆ గోడని వ్రేలాడే పటంకేసి వెర్రిమాపులు చూస్తుంది. అలాంటిదే చిన్నపట మొకటి తనదగ్గర వుండాలి. మరి అది తనదగ్గిర కెలా వచ్చిందో? ఇక్కడంతా తమాషావాళ్లే. ఆ యువరాజు మళ్లా కనబడితే బాగుండును. ఆయనొక్కడే వీళ్లందరిలో మంచివాడిలా వున్నారు అంతఅందమయిన వ్యక్తి ఇంకెవరైనా వుంటారా అనిపించిందామెకి. అలా ఆ యువరాజుని గురించి చాలాసేపు ఆలోచించిందా అమ్మాయి. చివరికి తన ఆలోచనలకి తనకే సిగ్గొచ్చింది. ఆయనే మహారాజు కాబోతున్నాడాయె. తనేమో, జీవితం గడవడానికి నౌఖరీకొచ్చిందాయె. తానాయన కెందుకు గుర్తుంటుంది?

కాని ఆ అమ్మాయి విషయంలో చాలా పొరబడింది. ఎందుచేతనంటే రాజకుమారుడి కామ్మాయిని గురించితప్ప వేరే ఆలోచనలు కలగటంలేదు. చివరికి ప్రియమైన గుర్రాన్ని కూడా మరచిపోయాడు. తండ్రిగారితో యీ ప్రస్తావన తేవడ మెలాగ? రాజ్యమో, గీజ్యమోనని ఎప్పుడో అనుకున్నాడు. కానయితే యీ మాట తండ్రిగారికి చెప్పడ మెలాగో తెలియలేదు. రెండు, మూడుసార్లు వెళ్లాడు రాజుగారిదగ్గిరికి. కానయితే ఏదో గొణిగేసి వచ్చాడు. తనదగ్గర తుపాకిలాగ టపటపలాడేసే నోరు ఇలా నీళ్ళతుపాకిలా తుస్సుమనడం ఆయనకే, ఆశ్చర్యం కలిగించింది. ఇప్పుడు రాజకుమారుడు తిరిగి స్థిరనిశ్చయుడై రాజుగారిదగ్గరికి వెళ్లాడు.

* * *

రాజుగారూ, రాణిగారూ ఆ అమ్మాయిని పిల్చారు.

"ఏయ్ అమ్మాయి, నీవు తక్షశిలలోని హరిశాస్త్రియింట్లోంచే వచ్చావా?" అని ఆ అమ్మాయిమీద మొరిగాడు మహారాజు. అదేదో మహాపరాధమైపోయినట్లు, ఖంగారుపడిపోయి ఆ అమ్మాయి 'చి...చి...చిత్తం' అంది. ఆ సమయానికే రాజకుమారుడు రాజుగారిని వెతుక్కుంటూ అక్కడికి వచ్చాడు.

"ఆ అమ్మాయి హరిశాస్త్రి ఇంటినుండి వస్తేనేం, గిరిశాస్త్రి ఇంటినుండి వస్తేనేం? ఆ అమ్మాయిని నేను పెళ్ళాడబోతున్నాను." అని గబగబా అనేసి, చటుక్కున అప్పుడే గుర్తుకి వచ్చినట్లు "రాజ్యమో, గీజ్యమో" అని నెమ్మదిగా అనేశాడు.

"ఊఁఫ్" అంటూ రెండుచేతుల వ్రేళ్లు గబగబా నోట్లోకి కుక్కేసుకుందా అమ్మాయి. అంతకంటె ఆ సమయంలో ఏమిచేయాలో ఆమెకి తెలియలేదు. కాని ఒక్కటిమాత్రమామె స్థిరంచేసుకుంది. సింహంలాంటి ఆ రాజుగారి కళ్లలోకి కళ్లుపెట్టి, రాజ్యమో, గీజ్యమో అనగలిగినవాడు; చాలా ధైర్యవంతుడే. ఆ నిమిషంలోనే తన జీవితాన్ని అతని కంకితం చేసేసిందా అమ్మాయి.

"ఏమ్‌?" అన్నారు రాజుగారు.

"అవును, మీరు చెప్పిన ఆఅమ్మాయిని నేను చస్తే చేసుకోను."

"అదసంభవం."

"ఎందుచేత?" ఇలా తిరిగి రాజంగా సాగి పోయింది.

చివరికి రాజుగారు అదెందుకు అసంభవమో. తాను చెప్పినమ్మాయి యీ అమ్మాయే! ఇప్పుడు "ఊఁఫ్" అంటూ మూడు గొంతుకలు కూశాయి. ఆ అమ్మాయి రెండుచేతుల్నీ తనకే నోరికేసుకుంది కనుక, ఇంక నోరకడాని కేం లేక శిలాప్రతిమలా నించుంది. మొదటినుంచి యీ సందర్భాలన్నీ అర్థంకాని రాణి వాళ్ళందరి ముఖాలకేసి వెర్రిగా చూస్తూవుండిపోయింది. ★



"కళ్లా కాటూకపెట్టీ, కడవా చంకానబెట్టీ...."

పూనానగరంలో ఒక జలయంత్రం. ఫొటో: ఎమ్. బసవయ్య

వనితాలోకం

వ్యాయామము

స్త్రీలు సౌందర్యోపాసకులు. సహజముగా తమకున్న సౌందర్యాన్ని అనేక విధాల మెరుగులు దిద్దుకొని ఇనుమడింప చేసుకొంటారు. తలవెంట్రుకలు తుమ్మెద రెక్కలవలె నల్లగా, కురులు అతి దీర్ఘములై మోకాళ్ళు దాటుతూ ఉంటే స్త్రీల కందమని భారతమహిళలనుకుంటారు. కేశసంపదను అభివృద్ధి చేసుకోవటానికి తైలము లనేకముగా కనిపెట్టబడ్డాయి. వాటిని సామాన్యముగా స్త్రీలు ఉపయోగిస్తూనే ఉంటారు. ఆ విధముగానే దేహకాంతిని ఇనుమడింప చేసుకోవలెననే కుతూహలము కొద్దీ సబ్బులు, పౌడర్లు క్రీములూ స్త్రీలు వాడుతునే ఉన్నారు.

అదేవిధముగా వంపులు తిరిగిన స్త్రీల శరీర సౌష్టవముకూడా వాంఛనీయమే. శరీర సౌష్టవము అప్పటికప్పుడు యత్నించితే లభించేదికాదు. దానిని నిలుపుకోవటానికి ప్రయత్నాలూ సాధనలూ అవసరము. వయసు అధికమయిన కొద్దీ అనేక మార్పులకు శరీరము గురిఅవుతుంది. ఆ మార్పులకు శరీరము లొంగిపోతుంది. ఆ కారణముచేత ఆకారము మారిపోతుంది. గుర్తుపట్టలేని స్థితికి వస్తుంది. చిన్నవయసులోనే వికృతాకారము కలగటమువల్ల జీవితములో నిరుత్సాహము ఏర్పడుతుంది. అందుచేత చాలామంది స్త్రీలు అభిమానపడి ఇంటినుండి కదలరు.

కాని స్త్రీలు అంతగా నిరుత్సాహ పడవలసిన అవసరములేదు. శరీర సౌష్టవము నిలుపుకోటము, ఆకారము మారిపోకుండా కాపాడుకోవటము సాధ్యమే. కొద్దిపాటి శ్రమతో సాధించటానికి వీలవుతుంది. ఆ సాధనే వ్యాయామము.

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

ఇల్లిందల సరస్వతీదేవి

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

'స్త్రీలకు కూడా వ్యాయామము కావాలా?' అని కొందరు హేళనచేస్తారు. 'స్త్రీ అయితే మాత్రం దేహాన్ని కాపాడుకో నవసరము లేదా?' అని వాళ్ళతో ఎట్లా వాదించటము!

వ్యాయామమంటే దేహ పరిశ్రమ. దేహానికి కొంత పరిశ్రమను ప్రతిదినము కల్పించకపోయినట్లయితే క్రొవ్వు మితిమీరి పెరిగిపోతుంది. కండరాలు బలిష్ఠముగా ఉండవు. నరాలకు పటుత్వము ఉండదు. రక్తప్రసారము చక్కగా ఉండదు. కనుక వ్యాయామము స్త్రీ పురుష భేదము లేకుండా అందరికీ అవసరమైనది.

'వ్యాయామమంటే శరీరపరిశ్రమే కదా! ఉదయము లేచిన దగ్గరనుండీ రాత్రి పడుకో బోయేవరకూ కష్టపడి పనిచేస్తూ ఉంటాము. వంటచేయటము వడ్డించటము గొప్ప వ్యాయామము కాదా? అది చాలదా?' అంటారు చాలామంది. నిజమే! కాని— దేహములోని అన్ని భాగాలకు, అన్ని కండరాలకు తగిన వలసేము ఇంట్లో చేసే మామూలు పనులవల్ల కలుగదు.

"ఏమమ్మా! అట్లా ఉన్నావేం?" అని సామాన్యముగా ఏ స్త్రీ నడిగినా 'ఏమిటో-ఒంట్లో బాగాలే' దంటుంది. మనిషిని చూస్తే పెద్ద జబ్బుగా ఏమీ కనబడదు. భోజనము సరిగా జీర్ణము కాకపోవటమో, కాళ్ళు లాగటమో, నడుము నొప్పో- ఏదో ఒకటి ఎప్పుడూ బాధపెట్టుతునే వుంటుంది. మందులతో సర్దుకోక బాధిస్తూ ఉంటాయి.

పూర్వము వడ్లు దంచడము, పప్పులు విసరటము, ఊడ్పు ప్రతి స్త్రీకి నిత్యకృత్యముగా ఉండేవి వాటివల్ల శరీరములో ఏ భాగానికి కావలసిన వ్యాయాయము ఆ భాగానికి లభించేది. ప్రస్తుతము స్త్రీలకు అటువంటి అవకాశము లేదు కనుక మరొక మార్గమేదైన దేహారోగ్యాన్ని కాపాడగల దానిని అన్వేషించటము అవసర మనిపిస్తున్నది.

స్త్రీలలో కొందరు అధికముగా శ్రమించేవారూ అసలు శ్రమ నెరుగనివారూ ఉన్నారు. అధికముగా శ్రమించినవారు దేహమును కాపాడగల పుష్టికరమైన ఆహారము లభ్యము కాక దేహారోగ్య

"అ
పోయిన స దేమిటండీ డాక్టర్ గారూ
రూపాయ సారి జబ్బుచేస్తే
ఈ సారి లు రూపాయలకు
బిల్ పంపించారేం?
"ఔనండీ – పోయినసారి
న్యూమోనియా ఈసారి డబుల్
న్యూమోనియా"
—జి. వి జి. కృష్ణ

మును పోగొట్టుకొంటున్నారు. కాలు కదల్పకుండా – కూర్చున్నచోటనే దినమంతా గడిపేవారు తగిన దేహపరిశ్రమలేక దేహారోగ్యాన్ని పోగొట్టుకొంటున్నారు. ఈ రెండుతరగతుల మధ్య ఉన్నవారు గృహజీవితపు ఒత్తిడిలో అమాటనే తలచుకోలేకుండా ఉన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోటానికీ, అహారము జీర్ణము కావటానికీ ఉదయముగాని సాయంత్రముగానీ కనీసము ఒక మైలు దూరము నడవటము ముఖ్యము.

యోగాసనాలలో స్త్రీల శారీరక నిర్మాణానికి అనువైన ఆసనాలుకొన్ని ఉన్నాయి. వీటివలన దేహము కండలతో మోటుతేలుతుందని భయపడనవసరములేదు. దేహానికి ఎంత పరిశ్రమ అవసరమో అంతే చేకూర్చగలుగుతాయి ఈ అసనాలు. దేహములో రక్తప్రసారము చక్కగా జరగటానికీ, దేహము అతి స్థూలముగాగాని అతి సన్నగాగాని కాక ఆ దేహతత్వానికి సాధ్యమైనట్టుగా, ఉండవలసినట్టుగా దేహ సౌష్టవాన్ని కలిగించటములో యోగాసనాలు ఉపకరిస్తాయి.

పదిమందిలో కనీసము తొమ్మిదిమంది స్త్రీలకు నరముల బలహీనత ఉన్నదంటే ఆశ్చర్యకరమైన విషయము కాదు. 'ఈ కాలములోని ఆహారవిహారాలు, నాగరికతలోని అసహజవాతావరణము మెదడును బలహీనపరుస్తున్నాయి – అందులో స్త్రీలను బలహీన ప్రకృతిగలవారిని మరింత బలహీనపరిచివేస్తున్నాయ'ని కొందరు వైద్యుల అభిప్రాయము. నరముల బలహీనతకు చాలావరకు ఇవే కారణాలని వాళ్ళనమ్మకము. నరముల బలహీనతయొక్క లక్షణాలు ప్రత్యేకముగా 'అంతా శూన్యమనిపించటము, మనసుకు నిలకడలేకపోవటము, నిస్సత్తువ నిస్పృహ అసంతృప్తి ఆందోళన' మనిషిని పీడిస్తూ ఉంటాయి. కొంతమంది ఏదో వస్తువు కొరకని గదిలోకివెళ్ళి – వచ్చిన పని మరచిపోయి, ఆలోచనలో పడేవారిని నిత్యమూ చూస్తూనే ఉంటాము. వీటిని తొలగించి దేహానికి హితము కూర్చగల శక్తి యోగాసనాలలో ఉన్నది.

చాలామంది స్త్రీలు ఏ కాలములో పాటించవలసిన నియమాలు ఆ కాలములో పాటించకపోవటమువల్ల గర్భకోశము వైతొలగటము, పొత్తికడుపు విపరీతముగా పెరగటము మొదలైన లక్షణాలు కనబడుతున్నాయి. ఇవన్నీ యోగాసనాలవల్ల తేలికగా సర్దుకొనిపోతాయి. యోగాసనాలలో ఒక్కొక్క ఆసనానికి ఒక్కొక్క ఉపయోగమున్నది.

1. స్థితప్రార్థనాసనము: ఇది నిలబడి రెండుచేతులు జోడించి చేసేది. ఇది దేహశకటము సరిగా నిలవబడటానికి అనువైన శక్తిని ప్రసాదిస్తుంది.

2. ఏకపాదాసనము: ఈ ఆసనమువల్ల నరాలు అదుపులోకి వస్తాయి.

3. పర్వతాసనము: స్థూలకాయమువల్ల కలిగే అనేక అనర్థాలను తొలగించి మంచి ఆరోగ్యాన్ని దేహసౌష్టవాన్ని కలిగిస్తుంది. పొత్తికడుపులోని కండరాలను యథాస్థానానికి తెచ్చి, నడుముచుట్టూ గర్భముచుట్టూ పెరిగిన క్రొవ్వును కరగించివేస్తుంది.

4. కోణాసనము: దీనివల్ల వెన్నెముక దగ్గరఉన్న కండరాలు, కంఠముయొక్క కండరాలు, పొత్తికడుపులోని నరాలు కండరాలు, కోశాలు బలకరములై, నవచైతన్యముతో దేహారోగ్యాన్ని పెంపొందిస్తుంది.

5. భుజంగాసనము: దీనివలన రక్తము శాఖోపశాఖలయిన రక్తనాళములగుండా ప్రసారమవుతుంది. ఆపాదమస్తకము రక్తము పారుదల స్వేచ్ఛగా కలిగి దేహానికి చర్మానికీ పుష్టినిస్తుంది.

6. ఓష్ట్రాసనము: దీనివలన స్థానము తప్పిన అవయవములు గాని, కండరములు గాని యథాస్థానికి రావటమే కాకుండ వెన్నెముకకు పుష్టినివ్వగలదు.

7. అర్థాంగాసనము:

8. సర్వాంగాసనము:

ఇవి రెండు ఒకదాని తరువాత ఒకటి అభ్యసించవలసినవి. పొత్తికడుపుకు సంబంధించిన నరములు కండరములు కోశముల అక్రమములైన అనర్థాలను, వాటి దుష్పరిణామాలను అరికట్టి స్త్రీజనహితమైన లాభాలను కలిగించగలవు.

ఈ యోగాసనాలకు కూడని పరిస్థితులూ తగని కాలమూ ఉన్నాయి. పాఠకులలో ఎవరికయినా వీటిమీద శ్రద్ధ నమ్మకము ఉన్నయెడల యోగాసనాలనుగూర్చిన పుస్తకము తెప్పించుకొని దానిలో వివరించిన ప్రకారము నడచుకోవచ్చును. (*Eas[y] Postures for Women. By Sita Dav[i]* *P. o. Box 481. Bombay*). నియమములను మాత్రము అతిశ్రద్ధగా పాలించవలసియుంటుంది. ★

ఇల్లాలు

పురాణం సూర్యప్రకాశరావు

ఫ్యాక్టరీ సైరను హోరుమని కూసింది. ప్రకాశం మంచం మీద లేచి కూర్చుని కిటికీ రెక్కలు తెరిచాడు. పల్చటి ఎండ గోరు వెచ్చగా ఒంటికి తగిలింది. గడియారం ఏడు గంటలు కొట్టింది.

వంటగదిలోంచి భార్య సరస్వతి గొంతు విని ప్రకాశం బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని పెరట్లోకి నడిచాడు. తన్ను గమనించినా గమనించనట్టుగా భార్య మసులుకుంటుందని ఊహించిన ప్రకాశం ఆమె ముఖం వేపు చూడకూడదనుకుంటూనే చూశాడు. ఎప్పటిమాదిరిగానే ఆమె ప్రసన్న వదనంతో నవ్వుతూ "ఇంత ఆలస్యంగా లేచారేమండీ" అంటూ పలకరించింది.

ప్రకాశం పేలవంగా నవ్వాడు. ఏదో జవాబు చెప్పాలనుకుంటూనే మాటలు తడబడి నోరు మెదపలేకపోయాడు. ఒక్కసారి శరీరమంతా కుంచించుకుపోయింది. కొంతమంది వ్యక్తులు ఇంత సహజంగా ఎలా మసులుకుంటారో తనకి అర్థంకావటం లేదు. శిక్షించవల్సిన మనిషిపట్ల ఇంత ఓర్పు ప్రదర్శిస్తే ఇవతల వ్యక్తికి అంతకంటె దుర్భరమైన శిక్ష మరొకటి ఉండదు. మనసులోనే పెద్ద సంఘర్షణ, బాధ ఉద్భవించాయి. చరచరా బావిదగ్గరకు నడిచాడు.

నోటిలో పండుంపుల్ల నానిపోయినా అతనికా ధ్యాసే ఉన్నట్టు లేదు.

వెనకనించి భార్య గొంతు వినిపించింది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు. "కాఫీ చల్లారిపోతోంది. తొందరగా తెమలండి" అంది. తనూహించిన మార్పు ఆమెలో ఏకోశానా కనిపించటం లేదు. చాలా సహజంగా మామూలుగానే ఆమె సంచరిస్తోంది. రాత్రి తను చెప్పింది ఆమెను కలవర పెట్టలేదా? ఆమెకి సంబంధించిన విషయం కాదని ఆమె భావిస్తోంది కాబోలు!

గదిలో కొచ్చేసరికి టేబిల్ మీద కాఫీ సిద్ధంగా ఉంది. గప్‌చిప్‌గా తాగేసి వీధిలోకి పోవాలనుకున్నాడు. ఈ పరిసరాలు తన్ని మరింత క్రుంగతీస్తున్నాయి. ఇంత ఉదాసీనంగా, ఓర్పుగా ఆమె మసులుకోవటం కంటె ఎదుటబడి నెత్తి మొత్తుకుని నాలుగు తిట్టినా తన కింతకంటె మనసు కొంత తేరిపిగా ఉండేదేమో!

చెప్పుల టకటక శబ్దం విని భార్య గదిలోకొచ్చి "బజారు వెళ్తున్నారు కాబోలు. కూర లేవైనా తీసుకురండి" అంది సంచీ అందిస్తూ.

జేబు తడుముకున్నాడు ప్రకాశం! అతని ముఖభంగిమ ఆమె కనిపెట్టినట్టుగా "ఇవిగో డబ్బులు! త్వరగా రండి" అంది.

నీదగ్గర ఎక్కడివి అన్నట్టుగా ఆమె వేపు చూడబోయి ముఖం తిప్పుకున్నాడు ప్రకాశం. ఆమె ఏవేవో సర్దుతోంది. మంచంమీద పక్క సరిచేసింది. దుప్పటీ మడతపెట్టి తలాపిదిక్కున పరిచింది. మంచానికి వేలాడేసిన చొక్కాలూ, పంచెలూ తీసి కొంకికి వేసింది. మంచంకింద అడ్డదిడ్డంగా ఉన్న పెట్టెలు ఒక క్రమంలో సర్దింది. టేబిల్ మీద చెల్లాచెదరుగా ఉన్న కాగితాలు దొంతులుపెట్టి ఓ వారగా పెట్టింది. తలుపువార పాతచెప్పుల జతలు కిటికీవారకు తోసి వరసలో పెట్టింది. ఇంతసేపూ ఆమె ఏదో కూనిరాగం తీస్తూనే ఉంది. క్షణం పోయింతర్వాత ఆమె ఉన్నట్టుండి తలెత్తి "ఇంకా మీరు వెళ్లేదూ?" అంది ఆశ్చర్యంగా.

అతను తదేకంగా ఆమెవేపు చూస్తున్నవాడల్లా ఈ హెచ్చరికతో దెబ్బతిన్నవాడిలా తబ్బిబ్బుపడి "ఆఁ! వెళ్తున్నా" అంటూ గొణుగుతూ వీధిలోకి నడిచాడు. ఆఖరి మెట్టుమీద అడుగు మెల్లగా వేశాడు. లోనుంచి మృదుమధురమైన ఆ గొంతు ఇంకా సన్నగా వినిపిస్తూనేఉంది. ఆ శ్రావ్యమైన గొంతు వనక ఎంతో నిర్లిప్తత, ఉదాసీనత, అమాయకత్వం ప్రస్ఫుటమౌతున్నాయి. ఆమె బాధ్యతలు ఆమె నిర్వర్తిస్తోంది. లోటులేని గర్వంతో ఆమె మసులుకుంటోంది. కానితను?

...పడ్డాడు

...వార నడుస్తూ ఆలోచనల సంతృప్తి, గర్వం! అవును. తనకా ... ఎప్పుడూ ఏర్పడ...నాయి? తనెందుక...లేని జీవితం గడుపుతు...వెరుగ్గా తృప్తి...కూ ఓ విధమైన భావన...! ...నిన్న సాయంత్రం మరో పెనుతుఫాను చెలగింది. ఇవ్వాళ తను ఆఫీసుకు పోనక్కర్లేదు. ఇవ్వాళేమిటి, ఇక జీవిత పర్యంతం ఆ ఫ్యాక్టరీ గుమ్మం ఎక్కనక్కర్లేకుండా చేశారు అధికార్లు. తన ఉద్యోగం ఊడిందని, ఇక తనకీ ఆఫీసుతో ఋణం తీరిపోయిందని ఆఫీసరు అన్నప్పుడు క్షణం ఒళ్ళంతా ముచ్చెమటలుపోసినా, ఆతర్వాత కలిగిన సందేహం – "ఈ ఆఫీసర్లు మటుకు లంచాలు తీసుకోరూ? తనొక్కడేనా అవినీతిపరుడు?" అని. అవునో కాదో ఆఫీసులో అందరికీ తెలిసిన విషయమే. తెలిసినా తెలియనట్టు సంచరించటం కూడా అందరికీ తెలిసిన విషయమే! అయితే తన విషయంలో అధికారి ఇంత ఖచ్చితంగా, న్యాయబద్ధంగా చర్య తీసుకోవటంలో ఆయన ఉద్దేశం? వల్లకాడు! ఏవో లక్ష కారణాలు చూపెడతారు. అసలు అడగటానికి తనెవరు? అడిగి ప్రయోజనం? తన మొర ఆలకించే దెవరు?...అయితే తనెందరి మొర ఆలకించాడు అధికారం చేతిలో ఉన్నప్పుడు? జవాబు తనకే ఎదురు తిరిగింది. హృదయం మరింత సిగ్గుతో కుంచించుకుపోయింది. కిక్కురుమనకుండా ఇవతలి కొచ్చేశాడు తను. ఇంటికి చేరగానే ఈ వార్త తెలిపితే భార్య ఎంత గొడవచేస్తుందో అనుకున్నాడు. రాత్రి పదింటివరకూ ఆమెకీ విషయం చెప్పలేదు. ఆతర్వాత ఆమె ప్రవర్తన తన్ని ఆశ్చర్యపరచటం కూడా సంభవించింది. వినీ విననట్టుగా ఊరుకోలేదు గాని "ఇంతేనా! మరో ఉద్యోగం చూసుకోవచ్చు లెండి" అంది తాపీగా.

మరో ఉద్యోగం అంటే మాటలా! ఎవరిస్తారీ రోజుల్లో! నిక్షేపంలాంటి ఉద్యోగం చేజేతులా ఊడగొట్టుకున్నాడే! ఇదేవీ ఆమెని బాధించినట్టుగా తనకి కనిపించటం లేదు. నెలకి నూటఏభై రూపాయల ఆదాయం పోవటంతో తన కుటుంబం వాస్తవస్థితి కంటిముందు మెదిలింది. పిల్లల చదువులు ఆగిపోతాయి! ఆ పై . నెల! ఆ తర్వాత నెల.. ఇక రోజులెలా గడుస్తాయి? ఆపాటి ముందాలోచన ఉన్న వ్యక్తిఎవరూ తను వర్తించినట్టు ప్రవర్తించడు. ఓవిధమైన అంధత్వం తన్ని ఆవరించింది. ఉన్నవాడూ లేనివాడూ, తరతమ భేదాలు లేకుండా అవకాశమున్న చోటల్లా కక్కూర్తిపడ్డాడు. ఒక్కసారి ప్రకాశం చెవుల్ని వేలకొలదీ కుటుంబాల హాహాకారాలు చిల్లులు పొడిచాయి.

ఎవరో తనవైపే చూస్తున్నారు రోడ్డు మీద! అప్రయత్నంగా ప్రకాశం తల వంగి పోయినా ప్రయత్నించి నిలబెట్టాడు. తన బకరప్ సంగతి వాడికి తెలిసేఉంటుంది! తెలిసే తనవేపు గుచ్చిగుచ్చి చూస్తున్నాడు. ఆ చూపు ఎంత హేళనగా జుగుప్సగా ఉంది! నిన్నటివరకూ అధికారం చాటున ఉన్న తన్ని వీళ్లంతా ఎలా గౌరవించారు! అంతా నటన!

ప్రకాశం ఆ అపరిచితవ్యక్తి చూపు తప్పించి తప్పుకోవాలనే ప్రయత్నంలో చరచరా ముందుకు అడుగులు వేసి జనప్రవాహంలో కలిసిపోయాడు.

తను చేసింది తప్పుకాదని ఎంత సమర్థించుకుందామనుకున్నా మనసులో ఏదో అంతశ్శక్తి తనమీదకు దాడిచేస్తూనే ఉంది.

మార్కెట్టుగేటు బయట ఒకళ్ళిద్దరు మిత్రులు కనబడ్డారు. వాళ్ళతో మాట్లాడుతున్నంతసేపూ ఏదో తప్పుచేసిన వాడిలా బాధపడిపోతున్నాడు. తన ఉద్యోగం ప్రస్తావన వాళ్లు తీసుకురాలేదు; తను చెప్పనూ లేదు.

"కూరగాయల ధరలు మహాదారుణంగా ఉన్నాయండీ"

"ఆఁ! ఆఁ!" అంటూ నసిగాడు ప్రకాశం.

"మిగిలిపోతే కుళ్లబెట్టి పారెయ్యటానికైనా ఇష్టపడతారు గాని ఓ అణా తగ్గించి అమ్మటానికి ఇష్టపడరు" అంటూ అవతలి వ్యక్తి విసుక్కున్నాడు.

"అవునవును. అంతా మోసం!" మామూలుగా ఈ చివరిమాట నోరుజారింది. వెంటనే గతుక్కుమన్నాడు.

అవతలి వ్యక్తి నవ్వాడు, వీడ్కోలు తీసుకుంటూ. "ఆ నవ్వులో వ్యంగ్యం లేదూ?" అని తర్కించుకున్నాడు ప్రకాశం! ఛీ! ప్రతీదీ అనుమానించటమే? ఎవరు మటుకు నీతిగా బ్రతుకుతున్నారు? అయితే ఇంకొకళ్ళ విషయం వస్తే అంతా నీతిమంతులే!

అటు తిరిగి ఇటు తిరిగి పదింటికి ఇంటికి చేరుకున్నాడు ప్రకాశం. అరుగుమీద పిల్లలు ఆడుకుంటున్నారు. వంట గదిలో నుంచి పొగ మధ్యగదిలోకి అలుముకుంటోంది ముక్కు మూసుకుని గొంతునుసతో చిన్న దగ్గు దగ్గాడు. లోపించి "వచ్చారా?" అంటూ సరస్వతి ప్రశ్నించింది. నిన్నటి వరకూ ఇటువంటి సందర్భాల్లో తన ప్రవర్తన చాలా విసుగుదలతో కూడినదై వుండేది. "ఛీ! ఏమిటీ పాడుపొగ! ఇంట్లో ఉన్నంతసేపూ ఊదరకొట్టి చంపేస్తున్నావ్" అని ఎగిరిపడేవాడు. అయితే ఇవాళ మటుకు "ఆఁ వచ్చాను" అంటూ వినీ వినిపించనట్టుగా నసిగాడు.

భార్య ఇవతలకొచ్చింది కళ్లు నలుపుకుంటూ. చేతిలో సంచీ ఆమె కందించాడు. 'ఆమె స్నానానికి లేవండి' అంది. ప్రకాశం ఏమీ మాట్లాడలేదు. గదిలోకి వెళ్ళి చొక్కా విప్పి కొంకికి తగిలించి తువ్వాలు కట్టుకున్నాడు. చప్పున ఏదో స్ఫురించినట్టు ఆగిపోయాడు ప్రకాశం. తన వ్యక్తిత్వాన్ని చంపుకుని ఇవాళనుంచీ ఆమె చేతిలో కీలుబొమ్మ అవుతున్నాడాతను! ప్రతి విషయంలోనూ ఏదో అర్థంకాని మొహమాటం ఎక్కువవుతోంది. సాధ్యమైనంతవరకూ ఆమె ఎదుటనుంచి తప్పుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. తనిలా మసులుకోవటంలో అంతర్యం? అంతర్యం మాటెల్లాగున్నా తను లోకువైపోవటంలా!

విసురుగా చేతిలో తువ్వాలు మంచంమీదికి గిరవాటేసి కుర్చీలో చతికిల బడ్డాడు. ఆమెవచ్చి 'ఇంకా స్నానం చెయ్యలేదూ' అంటే తను ఖచితంగా చెప్పాలి 'ఇప్పుడు చెయ్యను' అని. ఇలా అనుకున్న ప్రకాశం గుమ్మంలో నిలబడి భార్య ప్రశ్నించగానే "ఆ! ఆ! వెళ్తున్నా" అనేశాడు అప్రయత్నంగా. మళ్లీ తనే చిరాకు పడ్డాడు. ఆమె ప్రసన్నవదనం వేపుచూస్తే ఏదో అజ్ఞాతశక్తి తన్ని లొంగదీస్తోంది.

స్నానంచేసి ఓగంట ఏవో పుస్తకాలు చదవటానికి ప్రయత్నించి మనసు లగ్నం కాక చిరాగ్గా గదిలో అటూ ఇటూ తిరిగి పన్నెండింటికి విస్తరిముందు కూర్చున్నాడు. భోజనం చేస్తున్నంత సేపూ ఆమె ఏవేవో చెబుతూనే ఉంది. చిన్నకొడుకు బళ్లో మాస్టరు వేసిన ప్రశ్నలకి ఎంత చురుగ్గా సమాధానాలు చెప్పిందీ సగర్వంగా ఆమె చెబుతోంది.

★ ఇల్లాలు ★

ప్రకాశం ఊ కొడుతున్నాడు, మధ్య మధ్య తెచ్చికోలు నవ్వులతో.

* * *

సాయంత్రం చీకటి పడుతోంది. వీధి వార దీపాలు అప్పుడే వెలిగాయి. చలిగాలి గజగజ వణికిస్తోంది.

ప్రకాశం పార్కు బెంచీమీద కూర్చుని చెట్లమీద గోలచేస్తున్న పక్షులవేపు చూస్తున్నాడు. ఈ ప్రకృతిలో ప్రతిప్రాణీ తన కేదో గుణపాఠం చెబుతున్నట్టు అనిపిస్తోంది ప్రకాశానికి! అతను లేచి చెట్లులేని ప్రదేశంలో వెళ్ళి కూర్చున్నాడు.

చాలా సేపటివరకు అతను తనున్నది నిర్జన ప్రదేశం అని అంతా వెళ్లిపోతున్నారని రేడియో ఎప్పుడో కట్టేశారనీ ఆధ్యాసే అతనికి లేకుండా పోయింది.

లేచి ఇంటికి బయల్దేరాడు.

హోటళ్లు మూసేస్తున్నారు. వీధుల్లో జనం పల్చబడ్డారు. పదవుతుందేమో!

ఇంటికి చేరేసరికి మధ్యగదిలో భార్య దీపం ముందు కూర్చుని ఏదో చదువుకుంటోంది. గడియారం కేసి చూశాడు, పదయింది.

భార్య, తన్ని గమనించి చప్పున పుస్తకం మూసి దీపం కొంకికి తగిలించి "ఇంత ఆలస్యంగా వచ్చారేం?" అంది.

"నువ్వు అన్నం తిన్నావా"?

"మీరు తినకుండానా!"

ప్రకాశం తలవంచుకొని గదిలోకి నడిచాడు. లోపల భోజన సన్నాహంలో ఉంది సరస్వతి. పిల్లలు ముడిచిపెట్టుకుని పడుకున్నారు. ఏ విధమైన మార్పులేని ఈ పరిసరాల్లో తనొక్కడే పూర్తిగా మారిపోయాడు! లోకం దృష్టిలో తను నీతిలేని మనిషి! కాని ఈ ఇంట్లో? - బాధగా అతను రెండు చేతులూ జుట్టులోనికి పోనిస్తూ కళ్లు మూసుకున్నాడు. తను క్షమార్హుడు కాడు. కానీ క్షమించే వ్యక్తి ఈ ఇంట్లో ఉంది!

మాటా మంతీ లేకుండానే భోజనం పూర్తి చేశాడు. మంచంమీద వాలబడి బలవంతాన కళ్ళుమూసి నిద్రపోవాలనుకున్నాడు. వంట గదిలోంచి సందడి ఇంకా వినిపిస్తూనే ఉంది. ఎంగిళ్ళు ఏమార్లూ ఎత్తుకుని, ఇల్లు కడిగి ఆమె చేతులు తుడుచుకుంటూ వొచ్చింది.

"నిద్రపోతున్నారా?" అంది భర్తను సమీపించి.

"లేదు".

"లేవండి దుప్పటి మాసిపోయింది. ఇస్త్రీ దుప్పటి వేస్తాను. ఇంతవరకూ తీరికే లేకపోయింది," అంటూ ఆమె అలమారు వేపు నడిచింది.

"ఇప్పుడొద్దు లెద్దూ"

"అలా కాదు. లేవండి" అంటూ బలవంతం చేసింది.

ఆ తర్వాత ఉన్నట్టుండి భార్య వేసిన ప్రశ్న ప్రకాశాన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. "ఇవ్వాళల్లా ఆదోమాదిరిగా ఉన్నారేం?"

సమాధానం ఏమి చెప్పాలో పాలుపోక నోరు మెదప లేదు.

"ఆ మాత్రానికి ఎవరైనా దిగులు పడతారా?" - అమాయికంగా ఆమె వేసిన ప్రశ్న ప్రకాశాన్ని మరింత కలవర పెట్టింది. ఆమె కేదో జవాబు చెప్పాలి. "ఇక ముందెలా గడుస్తుందా అనే బెంగ" అన్నాడు.

సరస్వతి అయోమయంగా భర్త ముఖంలోకి చూసింది.

"ఎందుకలా బాధ పడతారు? అంత చదువు చదువుకున్నారే, అంతా వృధా అయిపోతుందా? మరో ఉద్యోగం దొరుకుతుంది లెండి" అంది తాపీగా.

"ఎవరిస్తారిలంచగొండికి?"

"అయినా మీరుచేసిన తప్పేమిటండీ"

"డబ్బుకోసం కక్కుర్తి పడ్డాను. అధికారుల కళ్ళు కప్పి డబ్బు దోచాను' అన్నాడు ఆవేశంగా.

"డబ్బు దోచారా? ఎవరి జేబులోంచి" భయం భయంగా అడిగిందామె

విషాదంలో కూడా నవ్వుకున్నాడు ప్రకాశం. "జేబులు కత్తిరించలేదు. ఇదో రకం దోపిడీ, నీ కర్థం కాదు. నువ్వెళ్ళి పడుకో సరస్వతీ" అన్నాడు దుప్పటి ముఖంమీది కంటా కప్పుకుంటూ.

సరస్వతి లేచి వెళ్లి పడుకుంది. భర్త చెప్పిన విషయాలు ఆమె కేమీ బోధపడలేదు.

* * *

తెలతెలవారుతోందనగా ప్రకాశానికి నిద్ర మెలుకువ వచ్చింది. ఫ్యాక్టరీ సైరను హోరుమని కూసింది. గుండెల్లో రాక్షసి కేకలు ప్రతిధ్వనించాయి. హృదయమంతా భారం అయిపోయింది. భార్య మంచం వేపు చూశాడు. ఆమె అప్పటికే లేచి పనిపాటల్లో మునిగిపోయింది. వంట గది వేపు నడిచాడు. శ్రావ్యమైన గొంతు సన్నగా వినబడుతోంది. గుమ్మం వారగా ఆమెకి కనిపించకుండా నిలబడి వినసాగాడు. ఆమె భగవధ్యానం చేసుకుంటోంది.

చీకట్లో నిలబడ్డ ప్రకాశం, వెలుగులో దేముడి ముందు మోకరిల్లిన భార్య వేపు చూశాడు. అలా ఎంతసేపు నిలబడ్డాడో, ఆమె భగవధ్యానం ముగించేవరకూ అతను కళ్ళు తెరవలేదు.

తిరిగి వచ్చి మంచంమీద బడ్డాడు. కిటికీలోనుంచి బయటికి చూశాడు. వెలుతురు మసక మసగ్గా అలుముకుంటోంది. జన సందడి పశువుల అరుపులు, పక్షుల కిలకిలా రవాలు, గిలక చప్పుళ్ళు అంతా కలగా పులగంగా క్రమక్రమంగా హెచ్చు స్థాయిలో వినిపిస్తున్నాయి.

ఫ్యాక్టరీ గొట్టంలోంచి వలయాలు వలయాలుగా లేచిన పొగ ఆకాశంలో మేఘాల్ని సృష్టిస్తోంది. దేముని ముందు మోకరిల్లిన భార్య విగ్రహం కంటిముందు మెదిలింది. ఎదురుగా తాడిచెట్టులా ఫ్యాక్టరీ గొట్టం, సుళ్ళు తిరుగుతున్న పొగ, అన్నీ మనసు బెంబేలు చేస్తున్నాయి. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

ఈ ఆరు సంవత్సరాలూ తన్ని తల్లిలా కాపాడిన ఆ కర్మాగారానికి తనుఅన్యాయం చేశాడు. వృత్తులు లేక ఎంతమంది అల్లాడిపోతున్నారు! ఇటువంటి అవకాశాన్ని తనెందుకిలా దుర్వినియోగం చేసుకున్నాడు.

"ఈ ప్రపంచంలో తన్నిగురించి మంచిగా అనుకునే వారెవరైనా ఉన్నారా?" ప్రకాశం వెనక్కి తిరిగి వంటగది వేపు నడిచాడు. పెరట్లో బావిముందు నిలబడ్డ భార్యని చూస్తూ "ఎందుకు లేరూ? ఈమె తన్ని గౌరవిస్తోంది" అనుకున్నాడు.

"ఆమె కర్తవ్యం ఆమె పాటిస్తోంది! ఆమె బాధ్యతలు ఆమె నిర్వహిస్తోంది. కాని తను?" - కన్నీటితో అతని చెంపలు రెండూ తడిసి పోయాయి. రెండు చేతుల్తోనూ ముఖం కప్పుకుని పొర్లుకొస్తున్న దుఃఖాన్ని అతి ప్రయత్నంమీద అణుచుకున్నాడు.

పెరట్లోంచి భార్య శ్రావ్యంగా ఇంకా ప్రార్థనా గీతాలు పాడుతూనే ఉంది. ఆమె హృదయంలో తలదాచుకుని బలవలా ఏడవాలనిపించింది ప్రకాశానికి.

కాని ఒక్క అడుగైనా కదపలేకపోయాడు. కాళ్ళు రెండూ బిగుసుకు పోయినట్టుగా అడుగు ముందుకు పడలేదు. అక్కడే చలి కిల బడి విహ్వల చిత్తంతో సజల నేత్రాలతో పెరటివేపు చూస్తూ ఉండిపోయాడు ప్రకాశం! ★

అత్తగారి అసహనము

కనుపర్తి వరలక్ష్మమ్మ

అత్త:

అసలే గొప్పయింటి పిల్ల. ఆపైన చదువుకున్నది కూడా. మనకొద్దురా యీ సంబంధం అని వెయ్యివిధాల చెప్పా, విన్నాడు కాదు. వాడికేమి తల్లి ఎల్లా పోతేనేం పెండ్లాము షోకుగా సింగారించుకొని యాస్‌పీస్ మని యింగ్లీషు మాట్లాడితే చాలునని మురుసుకుపోయినాడు. ఈ పిల్లకు ఒక్కపని, చేతగాదు. ఎప్పేలు బియ్యేలు చదివిన ఆమెకు ఏమి పనిచేత నవుతుంది? గిన్నె తోమితే అంచుల క్రిందంతా మసే. చెంబులు తోమితే మరక లేపోవు. కంచాలు కడిగితే అంతా జిడ్డే. గుడ్డతడిపితే పొళ్లే తడవవు. కూర తరగమంటే ఏ పనైనా చేయకుండా చెయ్యికోసుకొని కూర్చుంటుందేమో నని భయం. మడి మైల తెలియదు. అదేమంటే చెప్పిచేయించుకో మంటాడు.

ఎన్నని చెప్పిచేయించుకుంటాడు; వాళ్లకు తెలియాలికాని. తానెంత కలెక్టరు కూతురైతే మాత్రం పనిచేయకుండా మా కెట్లా నాగుతుంది? తన పుట్టింట్లోలాగా నౌకర్లెట్లా వస్తారు? నేను మొదటనే చెప్పాను నీవు గొప్పచదువు చదివావని వాళ్లు ఆశపడి పిల్లనిస్తున్నారే కాని, వాళ్ళకు మనం అనంరా అని, కాని ఏంలాభం! మా వాజమ్మ వింటేగా! నేను ఆ పిల్లనే చేసుకుంటానని పట్టుపట్టి కలించి చేసుకున్నాడు. ఇప్పుడేమున్నది? ఒక్కపని చేతగాదు. అన్ని నేనే చేసుకోవాలె కోడలు వచ్చి నాకేం సుఖం? నే నెట్లాచస్తే వాడికేమి తాను వచ్చేటప్పటి కల్లా తలదువ్వి జడవేసుకొని మడత నలగకుండా చీరగట్టుకొని పూసుకు పూసుకు తిరిగితే వాడికిచాలు. మామయ్యకూతుర్ని చేసుకోరా అంటే పల్లెటూరి పిల్ల నాకొద్దని చేసుకోకపోయినాడు. ఆ పిల్లైతే నే నెంత సుఖపడి ఉందును?

అసలు ఎంత గొప్పతనమున్నా, ఎంతమంది నౌకర్లున్నా తల్లైనది ఆడపిల్లకు పని నేర్పాలె. అందుకే తినవలెనే కలెక్టరు చేసే మొగుళ్లే దొరుకుతారా? ఆవిడ తానొక్కపని ముట్టుకోదాయె కూతురికేమి నేర్పుతుంది? తెల్లవారిలేస్తే కుడితి గోళంలో పోసినట్లు పొట్టలో కాఫీలు పోయడం దోసెలు యిడ్డెన్లు పడేయడం నేర్పింది. ఈవిడకు కాఫీలు ఫలహారాలు అలవాటైతేమాత్రం ఇక్కడెవరిస్తారు? మావాడు అనర్సు చదువుతున్నా చద్ది అన్నం ఊరుగాయముక్క తప్ప వేడి అన్నమైనా పెట్టి యెరగను. ఈ కాఫీలు గీఫీలు మాయింట్లో ఎన్నడు లేనిది ఈవిడకోసం యిప్పుడు క్రొత్తగా ఏర్పాటు చేస్తారా ఏమిటి? కాఫీలు పెట్టుకున్న వాళ్ళ కొంపలు గుల్లైపోతున్నాయి మా కెందుకీ గొడవ.

కాఫీ త్రాగకపోతే తలనొప్పిట. తలనొప్పి! తలనొప్పివస్తే ఏమి? రెండురోజులు ఊరుకుంటే అదేపోతుంది. అదేమంటే వాళ్లమ్మ కాఫీ ఖర్చులకు నెలకు పదో యిరవయ్యో పంపుతుందిట. ఎవరికి కావాలె ఈవిడ రూపాయలు రూపాయల ముఖం ఈవిడే చూచిందా?


రోజూ వీణె వాయించుకోకపోతే మరిచిపోతావు, రోజూ కాసేపు వాయించుకుంటూ ఉండమని తల్లి ఉత్తరం వ్రాసింది. ఇది సంసారి కొంపనుకున్నదో! సానికొంపనుకున్నదో! తన కొమార్తె యిక్కడ చిత్రంవచ్చినట్లు సంగీతాలు సాయిద్యాలు సాగిస్తే అత్తవారికేమిటి? పైగా వదినగారు అమ్మాయిని కాస్త సంగీతం మరిచిపోకుండా సాధకం చేసుకోమని చెప్పండని దానికి పని అట్టే చేతగాదు కాస్త చెప్పి చేయించుకోండని నాకు వ్రాస్తుంది. తానేమో చదువులు సంగీతాలు నేర్పించి పనిపాట చేతగాని అడ్డగాడిదలాగా తయారుచేసింది. నేనేమో చెప్పి చేయించుకోవాలెట! తాను కలెక్టరు పెళ్ళామైతే ఎవరికి గొప్ప? తన గొప్ప ఉంటే తనకే. ఈవిడ సలహాలు వినవలసిన పని నాకేమి? పాపం పనిచేయలేక కూతురు కష్టపడిపోతుందిట! ఏమి కష్టం? బజారు పప్పు, బజారు బియ్యం, కొళాయి నీళ్ళు, కొనుక్కున్న పాలు, అంత లాంతరు దీపాలైనా తుడవనక్కర్లేదు. చిటుక్కున నొక్కితే పట్టపగల్లాగా దీపాలు, మా తేమి అలసిపోతున్నది ఆవిడగారంత వలవలాడడానికి.

నాకెందుకూ, కాస్త చెట్టుగా ఉండకపోయినాడా వీడి గడ్డి వీడు తింటాడు. ఆ తల్లి చూడలే, కలెక్టరుచేసే ముండా కొడుకుని తానెంత చెప్పితే అంత చేసేవాడినిగా గాజులు తొడిగించి కూర్చోపెట్టింది. ఆ తల్లికూతురు గాదూ యిది రేపు వీడి గతీ అంతే. ఆడదాన్ని అదుపులో ఉంచుకోలేని మగవాడు ఎందుకు కాకుండా పోతాడు. నా పనిపాటల కేమిటి? ఆవిడ చేస్తే చేస్తుంది. లేకపోతే నేనే చేసుకుంటా. ముందు వీడి గతికి అఘోరిస్తున్నా.


అత్తయింటి కోడలుగదా, మాటిమాటికి తల్లికి ఉత్తరాలు వ్రాయడ మేమిటి? ఆ ఉత్తరాలు ఈ సన్యాసి నౌకరివాడిలాగా జేబులో పెట్టుకొనిపోయి పోస్టులో వేయడ మేమిటి? ఇక నేను ఉత్తరాలు వ్రాయవద్దంటె అదెట్లా వినిపించుకుంటుంది? ఒరే, ఏమిటిరా ఈ ఉత్తరాలు, కాస్త నీవన్నా మందలించగూడదురా అని నేనంటే, 'ఆఁ ఆఁ వాళ్లమ్మకు ఉత్తరం వ్రాసుకుంటె ఏమిటో' అంటూ సణుగుతాడాయె. అయ్యో! ప్రక్కయింటివారి సువర్చలను మొగుడు బొంబాయి తీసుకపోయి ఒక్క సంవత్సరమైంది. దాని చేతిమీదుగా ఒక్క ఉత్తరం వ్రాయనిస్తే ఒట్టు. వాడెప్పుడైనా అంతా బాగానే ఉన్నామని ఒక ఉత్తరం వ్రాస్తే వ్రాస్తాడు. లేకపోతే లేదు.

అదేమంటె అత్తగారు కోడండ్రికం పెట్టిందంటారు గాని కోడలన్న తర్వాత కాస్త భయభక్తులుగా వుంచవద్దూ. అంత స్వేచ్ఛ యిస్తే ఎట్లా? ఈ పప్పు దద్దమ్మ నోరు మూసుకు ఊరుకుంటే నే నూరుకున్నానూ? 'నీవు పుట్టింటికి ఉత్తరాలు వ్రాయడానికి వీలుగాద'ని కచ్చితంగా చెప్పివేశా. ఈవిడ కలెక్టరు కూతురైతే మాత్రం నన్నేమి చేస్తుంది? ఏమయినాసరే నా బొందిలో ప్రాణం ఉండగా నా కొడుకును తన తండ్రిలాగా పెండ్లాం చెప్పుచేతల్లో ఉండేవాడ్నిగా ఉండనివ్వను. నా మేనగోడల్ని కాదని గొప్ప యింటి పిల్లను చేసుకున్నాడుగా, వానికంటె ఈ

(30-వ పేజీ చూడండి)



హిమానీ సౌందర్యం



నీటిరంగుల చిత్రం: అమెరికన్ చిత్రకారుడు—చార్లెస్ బర్చ్‌ఫీల్డ్.
(మద్రాసులోని అమెరికన్ చిత్రలేఖన ప్రదర్శనంనుండి)

★ అత్తగారి అసహాసము ★

పెళ్లాంవల్ల ఏమి సుఖపడతాడో చూస్తాను. నాసు మాత్రం నా మాట వినకపోతే కడుపులో మండదూ,

కోడలు ;

నా బ్రతుకు రోజురోజుకూ దుర్భరమౌతున్నది. క్షుద్బాధ భరించవచ్చు, తిట్ల బాధ భరించవచ్చు. దెబ్బల బాధ భరించవచ్చు. శారీరకమైన మరే బాధనైనా భరించవచ్చును గాని ఈ మాటల బాధ భరించడానికి శక్యం కావడం లేదు. ఆ కోడలు మనుమరాలేగాని, మేనగోడలే గానీ, పరాయిపిల్లేగాని కోడలు అనగానే యింతగా హింసించాలె కాబోలు! కొంత ప్రేమ రవ్వంత గౌరవము చూపడానికి అత్తల శాస్త్రం ఒప్పుకోదు కాబోలు? మా స్నేహితురాలు సుశీలను మేనత్త కొడుక్కు ఇచ్చారు. ఏమయితేనేం అన్న కూతురు అన్న ఆ రక్తం బాంధవ్యం ఏమయిందో, మూడుమాట్లు వడకట్టిన పొడితో డికాక్షన్ చేసి అత్తగారు కాఫీ యిస్తుందిట. మధ్యాహ్నం అన్నం రాత్రికి, రాత్రి అన్నం ప్రొద్దుటికి పెట్టుతుందిట. ఏ టిఫిన్ చేసినా తమమటుకేట. కోడలికి రవ్వంత రాల్చదట. సిగ్గువిడిచి మొగుడికి చెప్పుకుంటే, 'తెగ బలిసిపోతున్నావు ఈ తిండి చాల్లే' అంటాడుట. అటువంటి ఆదరంగల అత్త; అటువంటి ప్రేమగల పెనిమిటి, పాపం సుశీల కులాసాగా ఉండమంటే ఏమి ఉంటుంది. మనిషి గుర్తుపట్టలేకుండా మారిపోయింది. కన్ను తెరిస్తే కడవెడు కన్నీరు కారుస్తుంది. మా మేనమేమకూతురు రాజ్యం అత్తగారు వాళ్ళ అమ్మమ్మే, ఆడపిల్లను కన్నావని కాల్చుకుతింటుందిట, ఆవిడకేమైనా వివేకం ఉన్నది! స్త్రీల మనస్సు మృదువంటారు ఈ అత్తల హృదయం యింత కఠినమేమో. వీరు స్త్రీలు కారా? మా సుశీల అత్తగారు మూడోరకం నాలుగోరకం కాఫీయైనా యిస్తున్నది. మా అత్తగారు అదీ లేదు. అబ్బా! ఈ తలనొప్పి ప్రొద్దుకూకులూ ప్రాణం తీసేస్తున్నది. ఏమీ తోచనియ్యదు. ఏపనీ చేయనియ్యదు. కాళ్ళు గుడ్డపేలికల్లాగా వేళ్ళాడిపోతుంటాయి. కళ్ళు [illegible] ఎంత వేధిస్తున్నది! ఎటువంటి నిపానీయాన్ని అత్తవారింటికి పోయే బాలికలకు అలవాటుచేయడం తల్లుల తప్పే! ఆయన చెప్పొ చెప్పకో ఎట్లాగో కాఫీ హోటల్లో ఏపూటా కాఫీ త్రాగుతూనే ఉన్నారట ఆ డబ్బు పెడితే ఇంట్లో ఉభయులం త్రాగుదుముగదా అమ్మా! మా అత్తగారు ఒప్పుకుంటారా! కాఫీ కర్చు ఆమె పెట్టకపోతే మాని మా అమ్మ కాఫీ పొడి పంచదార అన్నీ పంపిస్తానన్నది పాలకుగూడా డబ్బు యిస్తానన్నది. మా అత్తగారు ఒప్పుకుంటేగదా మొన్న మా అత్తగారు సముద్రస్నానం వెళ్లింగామాచి ఒక్క కప్పు కాఫీ తెచ్చియిచ్చారు. ఆ రోజంతా ఎంత హుషారు ఉన్నది! ఏనుగంత బలం వచ్చినట్లై యింట్లో పనులన్నీ చకాచకీ చేశాను. ఇందుకే యిది దుష్పానీయాల క్రిందికి వచ్చింది.

నాకు పని చేతగాదని పొద్దస్తమానం సాధిస్తారు అత్తగారు. నిజమే! నాకేమి చేతనవుతుంది? ప్రొద్దున్నే నిద్రలేవడం, ముఖం కడుక్కోవడం, కాఫీ త్రాగడం, చదువుకోవడం, సంగీతం నేర్చుకోడం, తల దువ్వుకోవడం, జడవేసుకోవడం, స్నానంచేయడం, మంచి దుస్తులు వేసుకోవడం, వేడి వేడి అన్నం వేపుడు కూరలు, మీగడ పెరుగులు ఆరగించడం, కారు ఎక్కడం, స్కూలుకు పోవడం. అక్కడ ఉన్నన్నాళ్లు ఇల్లా గడిచిందాయెను. నేను పని నేర్పిం దెక్కడ?

అప్పటికీ యీ పెండ్లే అయి ఉన్నట్లయితే సంగీతంలో ఫస్టుప్రైజు తెచ్చుకొనేదాన్నేనా! ఆ వీణతెచ్చి అక్కడ పడవేశారన్నమాటే గాని దానిని చేతితో తాకడానికి లేదు. పాపం వారికి నేను వీణ వాయిస్తే వినవలెనని ఉంటుంది. కాని పాడమనడానికి ధైర్యమేదీ? 'ఈ చిన్న యింట్లో ఒక మంచం పెట్టున ఈ వీణపెట్టె ఒకటీ' అని అత్తగారు ఒకటే అసహ్యించుకుంటూ ఉంటూరాయెను. ఇంక నన్నేమి వాయించుకోనిస్తారు. నిజంగా యిక్కడ యీ వీణ నాకెందుకు? తీగలన్నీ త్రుప్పుపట్టి పాడైపోతున్నాయి. అటువేసి యిటువేసి మూడు వందలరూపాయల వీణె పాడైపోతున్నది. అమ్మవద్దకు పంపివేస్తాను. ఆమైనా ఉపయోగిస్తూ ఉంటుంది. చక్కని పూలతీగచేతెస్తారనుకోండి దానికి మంచి అల్లులేకపోయినా, చక్కని ఆవరణలేకపోయినా, మంచిపోషణ లేకపోయినా ఆ లతా ద్రుమం ఏమి పెరుగుతుంది? ఏమిపూలు పూస్తుంది? ఏమి ఆనందం యిస్తుంది? ఆడపిల్లల విజ్ఞానం, వివేకం, వికాసం వాళ్లమీద ఆధారపడలేదు. వాళ్ల భర్తలమీద ఆధారపడిఉన్నది. భర్తృగృహ వైఖరిని బట్టే వారి వైఖరి ఉంటుంది.

అత్తగారు పనిచేతగాదనో ఆచారం తెలియదనో సీమ దొరసాననో! మహారాణి అనో! ఇంకా ఏవేవో వ్యంగ్యాలూ నిందలూ ప్రొద్దున లేచింది మొదలు అంటూనే ఉంటారు. దానికేమిగాని నన్ను కనిపెంచిన తల్లిదండ్రులను, ప్రేమాస్పదులైన నా తలిదండ్రులను, నాకొఱకు తమ విలువైన ధనమును కొల్లబెట్టుకున్న తలిదండ్రులను, అహర్నిశలు ఏవో కాని మాటలంటూఉంటే వినడం నన్నన్నదానికంటె మరీ హృదయవిదారకంగా ఉన్నది. మా తలిదండ్రులు వీరికిచేసిన అపకారమేమిటి? కోరిన ధనమిచ్చి లాంఛనా లిచ్చి పిల్లనిచ్చి పెండ్లిచేశారు. ఈ నేరానికి వాళ్లను ఎల్లప్పుడు ఎందుకు నిందించాలె? వాళ్ళు ఏమి చేసినా, వీళ్లకు ఆక్షేపణీయమే. అదేమి కర్మమో! మా నాన్న, అమ్మ, చాలా అన్యోన్యంగా ఉంటారుట! ప్రక్కన భార్య లేంది మా నాన్న కారెక్కరట! ఏ మీటింగుకు పోయినా ఏ షికారుకుపోయినా ఏ క్యాంపుకుపోయినా భార్య విడిబడి ఉండవలసిందేనట; ఒక్క ఆఫీసుకు మాత్రం ఎట్లాగో ప్రాణం బిగపట్టుకొని భార్య వెంటలేకుండా వెళ్లివస్తారట. మా నాయన ఒక్క చేతగాని దద్దమ్మట. భార్యకు బానిసట. నెలకు ఆరు వందలు సంపాదించుకువచ్చి ఆమె దోసిట్లో పోసి ఆమె చెప్పుచేతల్లో ఉంటాడట. ఒక చేటిమిటి వీరికి పిల్లనిచ్చినందుకు మా తలిదండ్రులు వీరి కంటికి చేలగింజకంటె తేలికై పోయినారు.



వస్తుతః మా నాన్నగారెంతో మంచివారు. సమర్థులు, న్యాయ తత్పరులు. ఎంతెంత అధికార్లు ఆయన నెంతో గౌరవిస్తారు. అటువంటి మా నాన్నగారు మా అత్తగారికి ఒట్టి అప్రయోజకుడుగా కనిపిస్తున్నారు! మా అమ్మ యెంతో మంచిది. ఎంతో చదువుకున్నది. మా అమ్మ మా నాన్నగారియందు చూపే భక్తిశ్రద్ధలవల్లనే మా నాన్నగారామె నెంతో గౌరవంగా ప్రేమగా చూస్తారు. అకల్మషమైన అమూల్యమైన అమృతతుల్యమైన మనసు కలిసిన దాంపత్యం వారిది. అనుక్షణం ఒకరి నొకరు ద్వేషించుకుంటూ, ఒకరిమాట ఒకరు కాదనుకుంటూ ఒకరి నొకరు అనుమానించుకుంటూ ఉంటే అది భర్తృత్వాధికారం చెలాయించడం కాబోలు. బహుశా మామగారు బ్రతికిఉన్న రోజుల్లో మా అత్తగారి కాపురం అట్లాగే ఉండిఉండాలె! అందువల్లనే పరస్పరానురాగంగల మా తలిదండ్రుల దాంపత్య జీవితం ఆమెకు అసహ్యంగా ఉన్నది. మనుష్యు లెప్పుడూ తమరిని మించి ఊహించలేరు. తమకున్న అవగుణాలు యితరులకూ ఉన్నవనుకుంటారు. తమరిని మించిన మంచితనం యితరుల కున్నదన్న విషయం మానవులు సహించరు. కనుకనే 'తా నెంతో జగమంత' అన్న సామెత వచ్చింది.

అయ్యో! యిన్ని వేలు పోసి కాఫీనీళ్లకు నోచుకోని సంబంధం తెచ్చారుగదా మా నాన్నగారు! అయ్యో ఎంత తెలివితక్కువగా నాన్నగారి నంటున్నాను. పైపైన చూస్తారే గాని అంతరంగిక పరిస్థితు లెవరికి తెలుస్తాయి. ఒక్కగా నొక్క కొమారుడు. ఎమ్ ఎస్ సి ఫస్టున ప్యాసైనాడు. పదెకరాల పల్లపుభూమి ఉన్నది. వారి ఊరిలో మేడ ఉన్నది. పిల్లవాడు బుద్ధిమంతుడు. నాన్నగారు చూచిన సంబంధంలో లోటేముంది? లోకదృష్టిలో నాన్నగారు తమ పితృధర్మం చక్కగా నిర్వర్తించారు. నవనవలాడే ఎలప్రాయపు కన్నెల సర్వశక్తులు నులిమివేసే కోడంట్రికపు బాధకు యెఱజేయబడకుండా చేయడం వారి కెట్లా సాధ్యమవుతుంది?

నా కట్టు, నా బొట్టు, నాజుట్టు, నా సంగీతం, నా చదువు అన్నీ మా అత్తగారికి వగటే. నాలో ఒక్క మంచితనం ఆమెకు కన్పించడం లేదు. కోడళ్ల మంచితనం ఒప్పుకోడానికి అత్తల ధర్మశాస్త్రం అంగీకరించదేమో! కోడళ్లంతా నేరజాతికి చెందినవారూ అత్తలు అధికారజాతికి చెందినవారూ కాబోలు.

మా అత్తగారు నన్ను కాస్తంత ఆదరంగా చూస్తే నేనెంత ఉల్లాసంతో, భక్తితో శ్రద్ధతో ఆమెను సేవిస్తూఉందును? నేనెంతచేసినా యిప్పుడు ఆమెయందు భయం తప్పితే భక్తికి అవకాశం లేకుండా పోతున్నది. అయినప్పటికీ మా అత్తగారికి నేనేమీ తక్కువచేయడంలేదు. నాచేత నైనంతవరకు అన్నిపనులు అడగకుండానే చేస్తున్నాను. ఓ! నేనిక్కడకు వచ్చిన మూడునెలల్లో ఎన్నిపనులు నేర్చుకున్నాను. నేను వచ్చిన మర్నాడే పనిమనిషితో పేచీ వచ్చి అది వెళ్ళిపోయింది. నా పనితనం చూస్తే మా అమ్మవాళ్ళు ఆశ్చర్యపోతారు. కాని 'మాకోడలు అన్నిపనులూ నేర్చుకున్నది చక్కగా చేస్తున్నది.' అని మా అత్తగారివల్ల సర్టిఫికెట్టు పొందినప్పుడుగదా నా మనస్సు ఆనందం చెందేది? అట్టిది ఏనాటికైనా పొందకలుగుతానా!

కొడుకు :

జానకి కష్టం నానాటికీ చూడలేకుండా పోతున్నాను. మా నాయనగారు పోయేటప్పటికి నే నైదేళ్ళ కుర్రవాడిని. మా అక్కకు యేడేళ్ళు. మా అమ్మ నన్నెంతో ప్రేమతో వాత్సల్యంతో జాగ్రత్తగా పెంచి విద్యాబుద్ధులలో యింతవాడిని చేసింది. మా అమ్మలో యింత మొఱటు కఱకుదనమూ కాఠిన్యము ఉన్నదని నే నెప్పుడూ అనుకోలేదు. నా కపరిచితమైన యీ దుర్భావం కోడలురాగానే బయల్పడ్డం ఆశ్చర్యంగాఉన్నది. ఇది కొత్తగా పుట్టినదా? లేక వెనుకనె గర్భితమైఉండి నేడు బయటికి వచ్చినదా! ఇది పరంపరాగతమైన ఆచార స్వరూపం కాబోలు! ఇంతకాలం నుండి నన్నెంతో ఆప్యాయంగా పెంచిన నా తల్లి సర్వదా నా ఆనందం నా సౌఖ్యం, నా అభీష్టం తీర్చవలెననే నా తల్లి, నా

★ అత్తగారి అసహనము ★

భార్యను తాను ఎల్లప్పుడు కష్టపెట్టుతూ ఉంటే నా క్షేమాత్రం సంతోషంగా ఉండదని ఎట్లా తెలుసుకోలేకపోతున్నాడో! మా అక్కయ్య మా బావ సరసన కల్లాపాలాడుతూ ఉంటే చూచి మురుసుకుపోయే నా తల్లికి కోడలూ కొడుకూ గూడా అట్లానే ఉంటే చూచి సంతోషించవలసిన కాలం ఎందుకు లేదో! కోడలు చదువుకోటం యిష్టంలేదా అంటే – తన మేనకోడలిని చేసుకుంటానంటే 'నీవు చదువు, సంగీతం ఏది కావాలెనంటే అది నేర్పిస్తా'రని తానే చెప్పింది గదా! ఇప్పుడు జానకి చదువు సంగీతం తన కెందుకు అహితంగా తోచాలి? తన కిష్టంలేని పిల్లను చేసుకున్నాననే ఈర్ష్య చేతనే గదా. అయినా ఈ అపరాధం నాది కాని జానకి దెట్లా అవుతుంది?

మా మామగారు యీమెకు చేసిన అపకారమేమిటి? తాను కోరినంత కట్నము, లాంఛనాలు అన్నీ యిచ్చారు గదా. తీరాం పెండ్లికి తరలివచ్చిన తర్వాత పందిరిలో కూర్చుండి మరొక వెయ్యి రూపాయలిస్తేనే గాని పెండ్లికి రానని పేచీ పెట్టమంటే విద్యావివేకం కలవాడనై యుండీ, ఇంకా ఒకటి రెండు గంటల్లో పెండ్లికాబోతుండగా డబ్బు యివ్వమని ఇంకా పేచీపెట్టడం బుద్ధిహీనమైన అసభ్యకృత్యమని తెలిసి ఉండీ నేను తనమాట త్రోసివేయలేక ఇంకా వెయ్యిరూపాయలిస్తేగాని పెండ్లికి రానని పేచీపెడితే, మా మామగారు అవును కాదనకుండా ఆ వెయ్యి రూపాయలు తెచ్చి దోసిట్లో పోశారు గదా! అటువంటి పెద్ద మనిషిని మా అమ్మ అనుక్షణము తూలనాడుతూ ఉండడం ఏమి ధర్మం? వాళ్ళు మనకు పిల్లనిచ్చినంత మాత్రాన మర్యాదా మట్టూ లేకుండా అనడం ఏమి సబబు? మా అత్తగారు కూడా ఎంతో మంచిది. కాని మా అమ్మ ఆమెను అనేమాటలకు అంతే లేదు. పాపము తన తల్లిదండ్రులను ప్రొద్దున లేచినది మొదలు అకారణంగా తిట్టుతూ ఉంటే జానకి హృదయం ఎట్లా ఉంటుంది?

జానకి నానాటికీ చిక్కి శల్యమైపోతున్నది. ఆ ముఖంలో వెనుకటి తేజస్సు లేదు, ఉల్లాసం లేదు, చిరునవ్వు లేదు. కొన్నాళ్ళు యిట్లాగే ఉంటే ఆమె ఆరోగ్యమే చెడిపోయేటట్లున్నది. వంట పాత్రలు చెంబులు తోమి తోమి ఆమె చేతులు కందిపోతున్నాయి. అక్కడికీ ధైర్యంచేసి 'అమ్మా, పనిమనిషిని విచారించక పోయినావా?' అన్నాను–'ఏం పెండ్లాం కష్టపడిపోతున్నదనా, కష్టపడుతున్నదంటె చేయనియ్యబోకు, నేనే చేసుకుంటానన్నది. ఏమి చెప్పను ఆమెకు! ముఖం వాచిపోయేటట్టు జానకి యేడుస్తూ ఉంటే చూడలేకుండా ఉన్నాను. అమ్మకు చెప్పలేకపోతున్నాను.

కొద్దిరోజుల్లో మామగారు వచ్చి జానకిని తీసుకవెళ్లుతామని వ్రాశారు. జానకిని పంపిస్తే బాగా ఉండును. కాని మా అమ్మ ఒప్పుకుంటుందా?


అత్త:


తల్లి దయ్యం, పిల్లలు పేగు, పెండ్లాం బెల్లం. అన్న సామెత అబద్ధం కాదు. శ్రీనివాసుడికి నానాటికి నేనంటే యిష్టం తప్పిపోతున్నది. ఎందుకో చీకాకుపడతాడు, ముఖం మాడ్చుకుంటాడు. పలకరిస్తే పలకడు. పెళ్ళాం వచ్చింది మొదలు యిట్లా మారిపోయినాడు. వేరే ఉందామనే అంటున్నదో, నన్ను వెళ్ళగొట్టమనే అంటున్నదో ఏమిటో, ఏమి ఎక్కులు పెట్టుతున్నదో తెలియదు. చెప్పంగా చెప్పంగా మానూ, వేయంగా వేయంగా రాయి తిగలకపోదు. ఆ తల్లి వట్టి పాపిష్ఠిది. ఈ కూతురికి ఏమి చెప్పి పంపిందో, ఆ మాటలన్నీ వీడి తలకెక్కించి నా బిడ్డను నాకు కాకుండా చేస్తున్నది ఇటువంటివాళ్లు మందులుమాకులు పెట్టడానికి గూడా వెఱువరు. పిల్లవాడు మునుపటిలాగా లేడు. ఏదో మనోవ్యాధితో చిక్కిపోతున్నాడు. ఏమిటిరా అంటే చెప్పడు. ఈ సంబంధం వద్దంటే విన్నాడు గాదు. అయిదేళ్ల బిడ్డను అష్టకష్టాలు పడి పెంచుకున్నాను. ఒక్కమాటయినా నా మాట కాదని యెరుగడు. అటువంటివాడు యిట్లా మారిపోయినాడు ఎవడైనా పెళ్లాం వచ్చిందాకానే మనవాడు. తర్వాత దాని వాడే.


రెండు రోజుల్లో వాళ్ల మామగారు వస్తారట జానకిని పంపవలెనట. తీరా వచ్చి మూడు నెలలు కాలేదు. అప్పుడే పుట్టింటికి పంపడమేమిటో! ఇంకా అత్తగారిని ఎదిరించమనీ, మొగుణ్ణి లోకువ చేసుకోమనీ చెప్పడం పూర్తి కాలేదు కాబోలు; ఈమాటు వెళ్లితే ఆ కొలువ కాస్తా పూర్తి చేసిపంపుతుంది తల్లి. మాటిమాటికి పుట్టిళ్లకు పంపుతుంటే ఆ పిల్లలు అత్తవారి యిళ్లలో ఒద్దికగా ఏమి ఉండి ఏడుస్తారు. అందులో

మా వియ్యపురాలివంటి మనిషి భూలోకంలో పుట్టదు. అప్పుడే కూతుర్ని తీసుకరమ్మని మొగుణ్ణి తిరుగుతున్నది. ఆ మొగుడో చవట. పెళ్లాం ఎంత చెప్పితే అంత. సంక్రాంతి పండుగట. బొమ్మల నోముట పండుగలూ నోములూ ఎక్కడ లేవు. ఈ భాగ్యానికి అక్కడికి పంపడమెందుకు?

ఏమిటో ఎంత మూగి ముకానమ్మలాగా మాట్లాడకుండా ఉన్నా అన్ని పనులు చేస్తున్నది. చేతికి కాస్త ఆసరాగా ఉంటున్నది. ఈ చలికాలంలో అట్టే కష్టం లేకుండా







★ అత్తగారి అసహనము ★

కొత్తంత ఎండ పొడవచ్చిన తర్వాత లేచి స్నానంచేసి వంట చేస్తున్నాను. ఈ పిల్ల వెళ్ళిపోతే తెల్లవారకమునుపే లేచి పనులన్నీ చేసుకొని పది గంటలకల్లా ఆయనగారికి వంటచేసిపెట్టాలె. చిన్న పనీ పెద్దపనీ చేసుకొనేటప్పటికి తలప్రాణం తోకకు వస్తుంది. పంపవద్దని వెయ్యివిధాల చెప్తాను. ఏమి వింటాడో. ఆ మామగారివద్ద నోరు మెదల్పలేను. అమ్మో ఆ పెళ్ళిరోజున ఆ వెయ్యి రూపాయ లడగరా అంటె ఆ విడిదిలో నన్నెంత వేధించాడు! ఆఖరికి నేను పెళ్లికి ఉండకుండా లేచిపోతానంటే పట్టుబలవంతాన అడిగాడు. అవును అవసరంలో అడగకపోతే తర్వాత ఎవరిస్తారు? వాళ్లు మనకు కట్నం యిచ్చి కొంప గోడి అమ్ముకుంటున్నారంటాడు, మనం కొంప గోడీ అమ్ముకొని చదువుకో లేదూ, రేపు వారుమాత్రం తను కొడుక్కు కట్నం తీసుకోరా? ఈ రోజుల్లో కట్నాలు తీసుకోనివాళ్లెవరు?

ఏమిటో జానకిని వాళ్ల నాన్న తీసుకపోవడానికి వస్తాడన్నప్పటినుంచీ మనస్సు యిదిగా ఉన్నది. ఏమవుతుందో!

కోడలు :

చేసే జపతపాలు చేస్తూనేఉంటారు; వ్రాసే రామకోటి వ్రాస్తూనేఉంటారు; సలిపే వేదాంత విచారణ సలుపుతూ ఉంటారు; చదివే భాగవతగ్రంథాలు చదువుతునే ఉంటారు; చెప్పే ధర్మపన్నాలు చెప్పుతునేఉంటారు; వినే పురాణాలు వింటూనే ఉంటారు; జరిపే నామసప్తాహాలు జరుపుతునే ఉంటారు కాని ఒక్కటీ గూడా మా అత్తగారికి అంటకపోవడం ఆశ్చర్యం గలిగిస్తుంది. ఆఖరికి ఒక పెద్ద మనిషితో ఎట్లా మాటాడాలో ఆమెకు తెలియదనుకుంటాను. మా నాన్న వచ్చి రావడంతోనే 'కూతుర్ని కాపురానికి పంపి మూడునెలలు కాలేదు. అప్పుడే తీసుకపోవడానికి తయారైనావు! కూతురు అల్లుడు సుఖంగా కాపురం చేస్తుంటే చూడలేరా ఏమిటీ'ని తఫీమని ముఖాన అడిగివేశారు.

మా నాన్నగారి కదేమి శాంతమో! రవ్వంత కోపం రాలేదు రవ్వంత ముఖం చిన్నపోలేదు. చిఱునవ్వు నవ్వుతూ "మొదటిసారి పంపడం కాదండీ అక్కగారూ, ఒక్కమాటు తీకపోయి మళ్ళీ పంపితే యిక మీ యింట్లోనే ఉంటుంది. దసరా దీపావళీలు మీ యింట్లోనే వెళ్ళిపోయె. వచ్చేది సంక్రాంతి ఆడపిల్లలకు సరదా అయిన పండుగ. బొమ్మలు పెట్టుకొని నోములు నోచుకొని ఉల్లాసంగాఉండే రోజులు అందుకని అమ్మాయిని తీసుకపోదామని వచ్చాను పెద్దవారు మీకుమాత్రం తెలియనిదేమున్నద"న్నారు నాన్నగారు. "అవునండీ! వస్తారు మీకేం పిల్లను అత్తగారింటికి పంపింది మొదలు మళ్ళీ ఎప్పుడెప్పుడు తీసుకపోదామన్నమాటే. మా మంచిచెడ్డలు మీ కెందుకు? అనేమంటే పంపమంటే పంపలేదని నలుగురుచేత మమ్మనిపించవచ్చు అంతేగా మీరు కోరేది" అంటూ సాధింపుగా ఎన్నోమాటలన్నారు అత్తగారు. మా నాన్న అంత మంచిచెడ్డ తెలియనివారా!

డివిజనల్ మేజస్ట్రేటు చేస్తూ నిత్యము అనేకమంది నేరస్థలను విచారించే ఉన్నతోద్యోగి మా నాన్నగారు, అటువంటి నాన్నగారు మా అత్తగారివద్ద ఒక నేరస్థుడు మాదిరై ఆమె వేసే సవాళ్లకు నెమ్మది నెమ్మదిగా జవాబిస్తూఉంటే కడుపుతీపి ఎంత ఘనమైనదో అనిపించింది. నా నిమిత్తమేగా మా నాన్నగారు ఆమెచేత అన్నిమాటలు పడటం. లేకపోతే ఆమెవరు? ఆయనెవరు?

తమ తల్లి మామగారితో ఆ విధంగా మర్యాదలేకుండా మాట్లాడుతుంటె కొమారుడికి ఎంతో కష్టంగా ఉన్నది. అయినా ఏమిచేస్తారు? మామగారియెందర 'ఏమిటమ్మా ఆమాటలం'టే ఆమె మరింత రెచ్చిపోయి మామగార్ని తన్ను గూడా నాలుగు దులుపు

తొమ్మిది గంటలకి.

పొడవైన జుట్టు, మాసిపోయిన గడ్డంతో ఒకవ్యక్తి నడుస్తున్నాడు. ఒక కుర్రాడు అతని దగ్గరకొచ్చి "టైమెంత యైందండీ" అని అడిగాడు. ఆవ్యక్తి రిష్టువాచి చూసి "పది నిమిషాలు తక్కువ తొమ్మిది" అన్నాడు. "అయితే తొమ్మిది గంటలకి క్షవరం చేయించుకో" అంటూ పారిపోయాడు. అతనికి చాలా కోపం వచ్చింది. ఆ కుర్రాణ్ణి పట్టుకోడానికి తనూ పరుగెత్తాడు. మలుపు తిరిగేటప్పటికి పోలీసు ఎదురై పరుగెడుతున్న అతన్ని పట్టుకొని ఆపాడు. "ఏం అంత అర్జెంటు వ్యవహారం? మెయిన్ రోడ్డు మీద అడ్డంగా పరుగెడుతున్నావ్?" అనడిగాడు అతడు రొప్పుతూ జరిగిందంతా చెప్పాడు. పోలీసు తన రిష్టువాచీ చూసి అన్నాడు. "అదేనా. ఇంకా ఎనిమిదినిమిషా లుందిగా. మంగలిషాపుకి అంత పరుగెట్టుకు వెళితేగాని చేరుకోలేవా తొమ్మిది గంటలకి?"

ఎ. పి. రంగారావు.

తారు. పైగా మామ అల్లుడు ఏకమై తన్నేమో చేశారని ఏడ్పుగూడా సాగి స్తారు. అందువల్ల ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నారు. మా నాన్నగారే 'అక్క గారు! అమ్మాయివచ్చి మూడునెలలైంది. పండుగ ఎన్నాళ్ళో లేదు. పండుగ వెళ్ళ గానే పంపుతానని నయంగా వినయంగా ప్రాధేయ పూర్వకంగా బ్రతిమలాడారు. ఆఖరికి 'నాదేమున్నది నాయనా! అల్లుడి యిష్టం మామయిష్టం' అన్నారు అత్త గారు. "ఏమోయి శ్రీనివాసరావు అమ్మాయిని పంపే మాటేమిట'న్నారు. నాన్నగారు. వారికి తల్లివద్ద తగని భయం. మామగారివద్ద తగని మొగమోటం. ఏమంటారు? అవునూ కాదూ అనలేదు. నా భర్తగూడా తల్లి వంటివారైతే నా జీవిత మిప్పటికి సమాప్త మయ్యేది! అత్తా మొగుడూ ఏకమై నానా బాధలు పెడ్తే మా బాబాయి కూతురేమి చేసింది? బావిలో దూకి ఊరుకున్నది. అంతటితో దాని కష్టాలు తీరాయి. అబ్బబ్బా! అన్నం నీళ్ళు పెట్టక పుట్టింటికి పంపక 'మీ నాన్నను నెలకు వందరూపా యలు పంపమని వ్రాస్తావాలేదా' అని కొట్టి తిట్టి చెండుకుతిన్నారు. ఈ బాధలు పడలేక చచ్చిపోయింది. ఈ పాపిష్టి సంఘంలో ఎటువంటివాడికీ పిల్లనిచ్చేవాళ్లు సిద్ధంగా ఉంటారు. నెల తిరక్కుండా పెండ్లి చేసుకున్నాడు అతను. అది వచ్చే రావడంతోటి మగణ్ణి వశంచేసుకొని అత్త గారికి ఉద్వాసనం చెప్పింది. ఇతను చదువు కొని అనాగరకుడా అంటే ఎం. బి. బి. యస్ ప్యాసైన డాక్టరు. అసురు లెక్క డున్నారు? ఎవరికి దయా దాక్షిణ్యాది మానవలక్షణా లుండవో వారే అసురులు. తల్లిగారి మాటలు విని నన్ను కష్టపెట్ట కుండా నా భర్త దైవసముడై యుండటం నా భాగ్యం.

కొడుకు ;

మా అమ్మ జానకిని పుట్టింటికి పంపవద్దని శతవిధాల చెప్పింది. మాటి మాటికి 'పుట్టిం టికి పంపితే తల్లిమాట విని చెడిపోతుం ద'న్నది. ఇక నీ యింటికి రాదన్నది. కాపురం చేయదన్నది. కాని మా అత్తగారు మా అమ్మ చెప్పినట్టుగా దుర్మార్గురాలు కాదని నాకు తెలుసును. ఆమె కొంచెం సోషల్‌గా ఉంటుంది. లేడీసు క్లబ్బులకు వెళ్తుంది, మహిళాసంస్థలలో పనిచేస్తుంది. స్త్రీలకేసహాయం కావాలెనన్నా చేస్తుంది. అవన్నీ మామగారి యిష్టప్రకారమే ఆమె చేస్తున్నారు. ఆమెకు యింగ్లీషు, తెలుగు బాగా వచ్చును. సంగీతం వచ్చును. మంచి ప్రపంచజ్ఞానముగల మనిషి. ఆమె ఆడపిల్ల లను మగపిల్లలను గూడా మంచి కట్టు బాటులో పెంచారు. ఆమెలో ఏమిదోషం కనిపెట్టి మా అమ్మ ద్వేషిస్తున్నదో నాకు తెలియదు. తన్ను గాని నన్ను గాని ఆమె యెప్పుడు అమర్యాదగా చూడలేదు. స్త్రీలు సంఘాలు అని తిరిగేవాళ్లు ఆమెకు మర్యా దస్తులుగా అనుకోదు కాబోలు. వాళ్లు తమ పిల్లను మన కిచ్చినంతమాత్రమున వాళ్లినంత అవమానంగా చూడటం ఎందుకో నాకు అర్థం కాలేదు. ఏమయినాసరె మా మామ గారు వచ్చి అడిగిన కారణంవల్లనైతే నేమి, జానకి దేహస్థితి, మనోస్థితి చూచి అయితే నేమి, జానకిని పుట్టింటికి పంపాను. మా అమ్మ మాటను తిరస్కరించడానికి ఇదే మొదటిసారి. మనసులో బాధపడుతునే ఈ పని చేశాను. కాని తప్పని సరైంది.

మా అమ్మకు బొత్తిగా మెలకువ తెలి యదు. కోడలు రాగానే పనిమనిషితో పేచీ పెట్టుకొని వెళ్ళగొట్టింది. మఱొక మనిషిని కుదర్చమంటే చెరొక పని చేసు కుంటాం పొమ్మన్నది. ప్రొద్దున్నే ఈ చలిలో లేచి పాచిపనులు అవి చేసుకోవడం అలవాటు లేని వాళ్ళ కెంత కష్టం? ముఖ్యంగా జానకి బాధను చూడలేకనే పంపవలసివచ్చింది. మా అమ్మ యిష్ట ప్రకారం పోవలెనని నేనెంత ఓర్పు వహిం చినా నా వోర్పునంతా హరించగల పరి స్థితులు మా అమ్మ కల్పిస్తుంటే నే నేమి చేయగలను? ఆడవాళ్ళది కష్టమని లోక మంటుంది కాని తల్లి, భార్య, రెండు విభిన్నవ్యక్తుల మధ్య మెలగవలసిన మగ వాని కష్టంకంటె ఆడదాని కష్టం ఎక్కువ కాదు. అత్తకోడళ్లు ఏ యింట్లో అన్యో న్యంగా ఉంటారో, ఆ సంసారమే నిజంగా స్వర్గతుల్యం. కాని అటువంటి సంసారాలు ఉండటం ఎంత దుర్లభం? ఈ రోజుల్లో చదువుకున్న వరులు కూడా కట్నాలు తీసుకోడానికి తల్లిదండ్రులు తోడ్పడుతున్నారని లోకం వారిని నిందిస్తు న్నది. కాని కట్నాల ఆశ గల తల్లిదండ్రు లను కాదని నిలువబడగల శక్తి ఈ నిరుద్యో గపు యుగంలో ఎందఱు యువకులకున్నది? ఇది సంఘానికి పట్టిన దుర్లక్షణం. కళాశాల విద్యకు అధిక పెట్టుబడి పెట్టినందువల్ల కలి గిన అపకారం. డిగ్రీల వ్యామోహంవల్ల జనించిన వ్యాధి. అత్యాశాపరులైన తలి దండ్రులు ఆత్మగౌరవం కోల్పోయి తమ కొమారులను మార్కెట్టు వస్తువునుగా జేసి అమ్మజూపిన ఫలితం.

దీనికి విరుగుడేమిటో తెలియదు. ఈకట్న ముల దురాచారమే అనేకవిధముల వికారా కారములు దాల్చి సుఖమయములైన సంసా రములను దుఃఖభాజనం చేస్తున్నది.

మా అమ్మ నాదాకా రాకుండా కోడ లిని తానే పంపించిఉంటే తనకెంత ఘనంగా ఉండేది! నాకెంత సుఖంగా ఉండేది! వాళ్లెంత సంతోషించేవాళ్ళు! తల్లినికాదని పంపనూలేక మామగారిమాట త్రోసివేయనూలేక నేను తహతహలాడు తుంటే నా వ్యథ చూచి జానకి పాపం పోనీ వెళ్లనులెండన్నది. కాని నేనే సాహసించి పంపాను. మా అమ్మకు వల్లమాలిన కోపం వచ్చింది. నన్ను చెడబడా తిట్టింది. పోనీ అనుకున్నాను. అంతటితో ఊరుకోరాదూ. కాదంటే అక్కయ్యగారి యింటికివెళ్ళి రెండురోజులు ఉండి రారాదూ? అది కాదు యిదికాదు. నేను ఆఫీసుపనిమీద మద్రాసు వెళ్లగాచూచి పక్కయింటివాళ్లకు యింటి తాళపుచెవి యిచ్చి పూర్ణయాత్రా స్పెషల్ ఎక్కుతుందా! ఎంత అవమానము!

★



అందాలు చందాలు తుమ్మెదా!
మందమంద హాసాలెల్ల తుమ్మెదా!

ఫొటో : జి. రామమూర్తి—మద్రాసు.

బొమ్మరిల్లు

★ కానుక ★

కవిరావు

ఇంటిదగ్గఱ నీవు
ఉంటి వనుకోవమ్మ,
వ్యాపారమున నేను
ద్వీపాంతరము లరిగి,
తిరిగి తిరిగీ నేను
మరలి యింటికి, వస్తు
వస్తు నీకే కానుక
తెస్తునో చెప్పుకో!

* * *

మూడు కాంచనద్వీప
మునకు పోవుదు నచట
పొలము బంగారంబె
జలము బంగారంబె!
బాటలందున రాలి
పడియుండు కుప్పలుగ
బంగారు రంగు నం
పెంగ లాదీవిలో.
పట్టిఅన్నిటి నేను
బుట్టలందున కూరి
పూలన్ని నీకొఱకు
ప్రోగు చేసుకవత్తు.

* * *

తెరచాప లెత్తగా
తరువాత నాయోడ
తిన్నగా రత్నాల
దీవులకు చేరుకొను.
రత్నాల దీవుల్లొ
రత్నాలు ముత్యాలు
కొల్లగా నేలపై
చల్లియుండూ నమ్మ!
ముచ్చటల్ గొలిపేటి
ముత్యాలు, రత్నాలు
యేరి తెత్తును నీకు
కోరియిత్తును నేను

* * *

అటుపైన నాయోడ
చిటికెలోపల పోయి
దాపులోగల వింత
ద్వీపంబు చేరుకొను.
అందులో నున్నట్టి
వన్ని గమ్మత్తులే!
చూడవలెనే గాని
చెప్ప నెవ్వరి తరము?
తనకు తానేరాయు
'పెన్ను' మానాన్నకు,
యెగిరి పోయే కీలు
గుఱ్ఱ మన్నయ్యకు.
ఎన్నడూ కని, విని
ఎవ్వరూ యెరుగని
సొమ్ములెన్నో కానుక
అమ్మ! తెత్తును నీకు.
ద్వీపాంతరము లరిగి
వ్యాపారములు చేసి
తిరిగి తిరిగీ నేను
మరలి వచ్చేటపుడు
అమ్మ! నీకెన్నియో
సొమ్ములను తెచ్చెదను.

(ఆధారం: టాగూర్.)



టామ్‌సాయర్ ప్రపంచ యాత్ర

మూలం: మార్క్‌ట్వేన్

ఈ సీరియల్ టామ్‌సాయర్, హాకల్ బెరీఫిన్ నవలలకు తరువాత జరిగిన కథను తెలుపుతుంది. "హాకల్ బెరిఫిన్" నవలలో మాదిరిగానే నవలలో కూడా హాకల్ బెరీఫిన్ అనే కుర్రవాడే కథ చెబుతాడు. ఈ నవలలో టామ్‌సాయర్ అనే మరో కుర్రవాడూ, హాకల్ బెరీఫిన్, వీళ్ళ స్నేహితుడైన జిమ్‌అనే నీగ్రో ముఖ్యపాత్రలు. టామ్‌సాయర్‌కు ఎప్పుడూ ఏదో సాహసం చేస్తూనే వుండాలనీ, తనపేరు దేశదేశాల్లో మోగిపోతూ వుండాలనీ కోరిక. అందుచేత ఇదివరకు చేసిన సాహసాలతో తృప్తిపడక, కొత్తవాటికోసం చాలా ప్లాన్లు వేస్తాడు. కాని మిగతా వాళ్ళిద్దరూ అతని ప్లాన్లు అన్నిటినీ తోసివేస్తారు. ఏంచేయడానికీ పాలుపోకుండా వున్న సమయంలో, ఒక ప్రొఫెసరు బెలూన్‌లో యూరప్ ఖండానికి బయలుదేరనున్నట్లు వాళ్ళకి తెలుస్తుంది. అది చూసివద్దామని వెళ్ళిన టామ్, హక్, జిమ్ ముగ్గుర్నీ ప్రొఫెసరు లోపలికి రానిచ్చి హఠాత్తుగా బెలూన్‌ను బయలుదేర దీస్తాడు. యూరప్ ప్రయాణమై పోతున్న విమానంలో ముగ్గురు మిత్రులు నిర్ఘాంతపోయి కూర్చున్నారు. మార్గమధ్యంలో ప్రొఫెసరు తెగ తాగి సముద్రంలో పడి మరణిస్తాడు. బెలూన్ నడపడం టామ్ నేర్చుకున్నందున ప్రయాణం క్షేమంగానే సాగింది. కాని విమానం యూరప్ పోవడానికి బదులు ఆఫ్రికాఖండంలో ప్రవేశించింది. తరవాత వారికొక వర్తకుల బిడారం ఎదురుపడినది. బిడారంమీద దొంగల గుంపు ఒంటె పడి ధనం దోచుకోడానికి ప్రయత్నించారు. కాని ఓడిపోయి పారిపోయారు. వర్తకులకు చెందిన ఒక శిశువును దొంగలనుండి మనముగ్గురు స్నేహితులు రక్షించారు.

7

"మధ్యాహ్నమైంది," అన్నాడు టామ్. అవును, అప్పటికి సరిగ్గా సూర్యుడు నడినెత్తిమీద వున్నాడు. మా నీడలు పాదాలచుట్టూమాత్రమే కనిపిస్తున్నాయి. గ్రీన్‌విచ్ గడియారంలో చూశాము. పన్నెండు కావస్తోంది. కావస్తోందేమిటి, అయినట్టే. అందుచేత, లండన్ మాకు దక్షిణంగానో, ఉత్తరంగానో ఉండివుంటుందని, ఎండ, ఇసక, ఒంటెలు ఇవన్నీ చూస్తే ఉత్తరంగానే వుండాలనీ అన్నాడు టామ్. మాకు లండన్ పట్టణం న్యూయార్కుకీ మెక్సికోకీ వున్నంతదూరంలో వుంటుందనికూడా టామ్ వూహించాడు.

బెలూన్‌తో సమానంగా పోయేది ప్రపంచంలో ఇంకోటి లేదని, అయితే ఏ అడవిపావురంలాంటి పక్షులో, లేక రైలుబళ్లో అంతవేగంగానూ పోవచ్చునన్నీ జిమ్ తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

కాని టామ్ ఈ అభిప్రాయంతో వ్యతిరేకించాడు ఇంగ్లండులో రైళ్లు గంటకు నూరుమైళ్ల వేగంతో కొంతదూరంమాత్రం పోగలవని తాను విన్నాడట గాని, ఒక్క మిణ్ణల్లి మినహా మిగతా పక్షులేవీ అంత వేగంగా పోలేవని అతడన్నాడు.

"మిణ్ణల్లా? టామ్ గారూ! ఆ మాటకొస్తే మిణ్ణల్లి పక్షి కానే కాదే?"

"పక్షి కాదూ? అయితే ఏమిటంటావు మిణ్ణల్లి?"

"నాకూ బాగా తెలియదండి. కాని ఒకరకం జాతువనుకుంటాను. ఊహు, జంతువుకూడా కాదు. ఎందుకంటే జంతువులింకా పెద్దవిగా ఉంటాయి. ఒక రకం నల్లి అనుకుంటాను. ఆ, అంతే. మిణ్ణల్లి నల్లే."

"కాదు. కావలిస్తే పందెం. పోన్లేగాని మిణ్ణల్లి వేగంగా పోలేదంటావా?"

"పోలేదు. పక్షులు చాలాదూరం పోగలవు. మిణ్ణల్లి ఎంతోదూరంపోలేదు."

"పోలేదా? అసలు ఎంతోదూరం అంటే నీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు టామ్.

"అంటే బోలెడుమైళ్లని అర్థం," అన్నాడు జిమ్.

"అయితే మనిషి ఎంతోదూరం నడవలేడా?"

"నడుస్తాడు."

"రైలుబండి పోయినంతదూరం పోగలడా?"

"ఆ టైమిస్తే పోగలడు."


"మిణ్ణల్లి?"

"మిణ్ణల్లికూడా పోగలదనుకుంటాను. కాని దానికి ఇంకా ఎక్కువ టైమివ్వాలి."

"అందుచేత దూరం ముఖ్యంకాదనీ, అంత దూరమూ ఎంత టైముపడుతుందో అదే ముఖ్యమనీ తెలిడంలా?"

"అలాగే అనిపిస్తోంది చూస్తే. కాని నమ్మబుద్ధి కావటం లేదండీ!"

"అదికాదు జిమ్! అది ఆయా వస్తువుల పరిమాణంమీద ఆధారపడి వుంటుంది. ఒకదాని వేగాన్ని



"మిణ్ణల్లిముందు మనిషెంత ? . ."

దాని పరిమాణంతో పోలిస్తే, మిణ్ణల్లిముందు నీ మనిషెంత, నీ పక్షి ఎంత, నీ రైలెంత? ఎంత వేగంగా పరిగెత్తే మనిషైనా గంటకి పదిమైళ్ళు పరిగెత్తగలడు. అంటే తన పొడుగుకు పదివేలరెట్లు మాత్రమే పోగలడు. కాని ఎంత తుక్కురకం మిణ్ణల్లి అయినా సరే తన పొడుగుకు నూటయాభై రెట్లు దూరం దూకగలదని పుస్తకాల్లో రాసివుంది ఆ విధంగా మిణ్ణల్లి సెకండుకి అయిదుసార్లు దూకగలదు. అంటే ఒక చిన్న సెకండులో తన పొడుగుకు ఏడువందలయాభై రెట్ల దూరం దూకగలదన్నమాట. పైగా కాస్తదూరం దూకి, కాస్త ఆగి, మళ్లీ దూకదు. దూకటం, ఆగి మళ్ళీ దూకటం రెండూ ఒక్కసారే జరుగుతాయి. ఇది తుక్కురకం మిణ్ణల్లి చేసేపని. కాని ఒకటో రకం ఇటాలియన్ మిణ్ణల్లిని తీసుకో. ఎప్పుడూ జమీందార్ల యిళ్లలో వుంటూ ఎండ కన్నెరగని మిణ్ణల్లిని తీసి చూడు. అది తనకు మూడువందల రెట్లదూరం ఎగరగలదు. సెకండుకు అయిదేసి సార్ల చొప్పున పదిహేను వందల రెట్లు దూరం ఎగరగలదు. అలా రోజంతా ఎగురుతూ వుండమన్నా వుంటుంది. మాటవరసకి మనిషి తన పొడుగుకు పదిహేనువందల రెట్లు ఒక సెకండులో పోగలడనుకో. అంటే దాదాపు మైలున్నర. నిమిషానికి తొంభై మైళ్లు. గంటకి అయిదువేల మైళ్లకంటె ఇంకా ఎక్కువే. తెలిసిందా? ఏడోయ్ నీ మనిషి? నీ పక్షి, నీ రైలూ, నీ బెలూనూ ఏవోయ్? మిణ్ణల్లితో పోలిస్తే అవెందుకు పనికొస్తాయోయ్? మిణ్ణల్లి బాగా సంగ్రహించబడిన లోకచుక్కలాంటిది, తెలుసా?"

జిమ్ చాలా ఆశ్చర్యపడ్డాడు. నాకూ ఆశ్చర్యం కలిగింది.

జిమ్ అనుమానంగా అడిగాడు:

"టామ్‌గారూ! అయితే మీరు చెప్పిన లెక్కంతా రైటేనా?"

"ఖచ్చితంగా. కావలిస్తే లెక్కకట్టి చూడు. తభావతువస్తే అడుగు"

"అయితే టామ్‌సాయర్ గారూ! మిణ్ణల్లి ఇంత గొప్పదని నాకు తెలియదండీ అబ్బ ఎంత గొప్పదో. ఆలోచిస్తే కడుపు తరుక్కుపోతోంది. ఇంతకుముందు మిణ్ణల్లి ఏమిటో! అనుకునేవాణ్ణి ఇకనుంచీ కొంచెం భయభక్తులతో మెసులుకుంటాను," అన్నాడు జిమ్

"అవును మిణ్ణల్లి చాలా గొప్పది. దాని పరిమాణంతో పోలిస్తే దాని తెలివితేటలు, వివేకం, విజ్ఞానం చాలాగొప్పవనేలనాలి. ఆ మాటకొస్తే అంత గొప్పప్రాణి ప్రపంచంలో లేదు. మిణ్ణల్లికి నేర్పితే చేతకానిపని అంటూ లేదనుకో. పైగా అది త్వరగా నేర్చుకోగలదు కూడాను. మాటవరసకి మిణ్ణల్లిని మనిషంత పెద్దదాన్నిగా పెంచగలమనుకో. పరిమాణంతోపాటు దాని తెలివితేటల్నికూడా పెంచగలమనుకో. అప్పుడు నీ మానవజాతి ఏమవుతుంది? ఎక్కడుంటుంది? ఆ మిణ్ణల్లి అమెరికా అధ్యక్షుడై కూర్చుంటుంది. అధ్యక్షుడు కాకుండా ఛస్తే ఎవరూ ఆపలేరు."

"అయ్య బాబోయ్, మిణ్ణల్లులు ఎంత గొప్పవి? నా గుండె బద్దలైపోతోంది తలుచుకుంటే."

"ఆగు. ఇంకావుంది విను. పరిమాణాన్నిబట్టి చూస్తే ఏమనిషీ ఆగలేడు, ఏ జంతువూ ఆగలేదు మిణ్ణల్లి ముందు. చీమ చాలా బలమైందనీ, ఏనుగు బలమైందనీ, రైలు బలమైందనీ ప్రతివాడూ కోతలు కోస్తాడు. మిణ్ణల్లిమాట ఎవడూ ఎత్తడు. అది తన బరువుకు రెండుమూడువందల రెట్ల బరువును మోయగలదు. అది సరే, అలావుంచు మిణ్ణల్లి ఎంత తెలివైందనుకున్నావు? దానికి ప్రతి సమస్యమీదా సొంత అభిప్రాయాలు ఉన్నాయి. అది తనకు తోచినట్టే చేస్తుందిగాని ఎవడి మాటా వినదు. ఏ మనిషి ఎలాంటివాడైందీ మిణ్ణల్లికి తెలియదని కొందరనుకుంటారు. దానికి మనుషులసంగతి బాగా తెలుసు ఎంత ఆకలిగా వున్నాసరే కొందరు మనుషుల్ని అది ముట్టుకోదు. ఉదాహరణకి నన్ను మిణ్ణల్లి ఏమీ చెయ్యదు. అసలు నాజోలికి రాదు. ఇంతవరకూ ఏ మిణ్ణల్లీ నా వొంటిమీదికి రాలేదు."

"టామ్ గారూ!"

"నిజంగానే. నేను వేళాకోళం ఆడడంలేదు."

"ఎంత చిత్రం!" అన్నాడు జిమ్ నాకుకూడా ఈమాట నమ్మబుద్ధికాలేదు. అందుచేత విమానాన్ని బాగా కిందికి పోనిచ్చాను. మిణ్ణల్లులు మళ్ళీ విమానంలోకి ముసిరాయి టామ్ చెప్పింది నిజమే. అతనిమీద ఒక్కటికూడా వాలలేదు. నన్నూ జిమ్‌ను వేలకొలదిగా


ముట్టడించాయి. దీనికి కారణం మాత్రం బోధపడ లేదు. కాదనడానికి వీల్లేని విషయం. ఎదురుగా కళ్లారా చూస్తూ కాదని ఎలా అనగలం? పదిలక్షల మిణ్ణల్లుల మధ్య వెళ్ళినా సరే అవి తన్నేమీ చెయ్యవని అన్నాడు టామ్.

తరవాత మేము చల్లగాలి కోసం బాగా పైకి పోయి అక్కడ కాసేపు ఉన్నాము. మళ్లీ ఒక్కరవ్వ కిందికి దిగి ఒక మోస్తరు వాతావరణంలో గంటకు ఇరవై, పాతిక మైళ్ల చొప్పున ప్రయాణం చేయసాగాము. అంత నెమ్మదిగా పోవడానికి కారణం మరేం లేదు. ఎడారి మీదుగా ప్రయాణం చేస్తున్న కొద్దీ, హాయిగా వుంది. పోను పోను ఎడారి అంటే చల్లమాలిన ప్రేమ పుట్టుకొచ్చింది. దూరదర్శినులతో భూమండలాన్ని పరికిస్తూ కొంతసేపూ, పుస్తకాలు చదువుకుంటూ కొంతసేపూ, కునికిపాట్లు పడుతూ కొంతసేపూ గడిపాము.

మా సంతృప్తి, సంతోషమూ చూస్తే 'మేమేనా ఎప్పుడు సముద్రం దాటి ఒడ్డున పడతామా అని తహతహలాడినవాళ్లం' అని మాకే ఆశ్చర్యం కలిగింది. కాని మా కంగారంతా ఏమైందో, మాయమైపోయింది. ఈలాగే జీవితం మాకు అలవాటైంది. భయం, బెంగ పూర్తిగా తీరిపోయాయి. ఇక్కడే బావుందని అనుకున్నాము. ఇంటిదగ్గర ఉన్నట్టే అనిపించింది. విమానం లోనే పుట్టి, విమానంలోనే పెరిగామని అనిపించింది.

ఇంటిదగ్గర ఎప్పుడూ ఎవళ్లో ఒకళ్లు సాధిస్తూ, వేధిస్తూ, చివాట్లు పెడుతూ, చేసిందల్లా తప్పంటూ, కూడా కూడా తిరుగుతూ, అది చెయ్యి ఇది చెయ్యి అని పురమాయిస్తూ, ఏది పురమాయించినా నాకిష్టం లేనిదాన్నే పురమాయిస్తూ, అది చెయ్యక ఇంకోటి చేస్తే చెవులు మెలేస్తూ, యాతన పెట్టడం తప్ప మరేం లేదు. కాని ఇక్కడ, ఈ విమానంలో ఆకాశం క్రింద, ప్రశాంతంగా, హాయిగా, తింటూ, నిద్రపోతూ, కొత్త వింతలు చూస్తూ, వాళ్ల సాధింపులు వీళ్ళ వేధింపులూ లేకుండా గడపడం ఎంత బాగున్నదో చెప్పలేను. ఇక్కణ్ణుంచి తిరిగి ఆ "నాగరిక" జీవితంలోకి పోవడానికి బుద్ధిపుట్టడం లేదు.

"నాగరికత" అనబడే దాంట్లో ఒక పెద్ద ఇబ్బంది వున్నది. ఎవడికన్నా పోస్టులో ఒక ఉత్తరం వచ్చిందనుకోండి. అందులో ఏదైనా ఆ శుభవార్త



"ఆ మిణ్ణల్లి అమెరికా అధ్యక్షుడై కూర్చుంటుండే..."

ఉందనుకోండి. ఇక ఆ వుత్తరంతాలూకు మనిషివచ్చి అందరితోనూ ఆ వార్తచెప్పి తన దుఃఖాన్ని వెళ్లడించి మనకికూడా దుఃఖం కలిగిస్తాడు. అలాగే పత్రికలున్నాయనుకోండి. ప్రపంచంలో ఎవడికి ఏ బాధ కలిగినా ఆ వార్త కాస్తా ప్రచురించేసి మనకి దిగులూ, నిరుత్సాహం పుట్టేట్టుచేస్తాయి. ఈ ప్రపంచపు బాధ అన్నిటినీ మోయడానికి మనం ఏం సరిపోతాంచెప్పండి. నాకు ఈ వార్తాపత్రికలన్నా, ఉత్తరాలన్నా చెడ్డ అసహ్యం. నాకే అధికారం ఉంటే, ఎవడూ తన బాధలను ఇతరులకు, అందులో ముక్కూ మొహం ఎరగని ఇతరులకు అంటగట్టడానికి వీల్లేదని ఒకశాసనం చేసిపారేస్తాను. కాని ఈ విమానంలో అలాంటి బాధలేమీలేవు. ఇంత మంచిస్థలం ఇంకోటి లేదు.

రాత్రిభోజనం కానిచ్చాము. రాత్రంతా చాలా కులాసాగా గడిచిపోయింది. వెన్నెల పిండారబోసినట్లు, రాత్రిని పగలు చేస్తున్నట్లు ఉన్నది. ఒకచోట నేలమీద ఒక సింహం ఏకాకిగా నుంచుని ఏదో ఆలోచిస్తూ కనబడింది. దానినీడ నల్లటిసిరా వొలకబోసినట్టు కనిపించింది. ఉంటే అలాంటి వెన్నెల వుండాలి.

వెల్లకిలా పడుకుని కబుర్లు చెప్పుకున్నాము. నిద్రపోవాలనిపించలేదు. 'అరేబియన్ నైట్సు'కు సరిగ్గా మధ్యలో ఉన్నామని టామ్ అన్నాడు. ఆ పుస్తకంలోని ఒక చమత్కారవిషయం ఇక్కడే జరిగిందని కూడా చెప్పాడు. అందుచేత గభాలున లేచి కిందికి చూశాము. పుస్తకంలో రాయబడిన విషయం జరిగిన స్థలాన్ని చూడడంకంటె అదృష్టం ఇంకేముంటుంది? టామ్ ఆ విషయం చెబుతున్నంతసేపూ, వింటూ కిందికే చూస్తున్నాము ఒకడు తన ఒంటెను కోల్పోవడం, ఎడారిలో వెదుకుతూండగా ఒక మనిషి ఎదురుపడడం, అతగాణ్ణి 'నీ కెక్కడన్నా ఒక ఒంటె కనిపించిందా' అని అడగడం, అదీ కథ.

"నీ కెక్కడన్నా ఒక ఒంటె కనిపించిందా?"

"ఎడమకన్ను గుడ్డిదా?" అని రెండో వాడు అడిగాడు.

"అవును."

"పై వరస పళ్ళలో ముందు పన్ను ఊడిపోయిందా?"

"అవును."

"వెనక కాలు ఒకటి కుంటిదా?

"అవును"

"ఒంటె వీపుమీద ఒక పక్కకి జొన్నలమూట, మరొక పక్కకి తేనె సీసాలమూట వేళ్లాడదీశావా?"

"అవును. ఇవన్నీ ఎందుకడుగుతావు? ఆ ఒంటె నాదే! చూశావా అని అడుగుతున్నాను."

"నేను చూడలేదు"

"అయితే ఇన్ని వివరాలు ఎలా చెప్పగలిగావు?"

"ఉన్నకళ్లను ఎలా ఉపయోగించాలో తెలిసిన ప్రతివాడూ చెప్పగలడు. కాని అది తెలిసినవాళ్లు చాలా అరుదు. ఈ దిక్కుగా ఒక ఒంటె వెళ్ళిందని, దాని కాలిజాడలు చూసి తెలుసుకున్నాను. వెనక కాళ్లు రెంటిలోనూ ఒక కాలుమీద నెమ్మదిగా ఆని నడిచినట్టు కాలిజాడలవల్ల కనిపెట్టి, ఆ కాలు కుంటిదని తెలుసుకున్నాను. దారికి కుడివైపున మాత్రమే పచ్చికను కొరికినట్టు కనిపించింది కనుక ఎడమ కన్ను గుడ్డిదని తెలుసుకున్నాను పచ్చికను కొరికినచోట పళ్ల గుర్తులమధ్య ఖాళీజాగా చూసి ముందరి పన్నొకటి ఊడిపోయిందని తెలుసుకున్నాను. ఒక పక్కన జొన్నలమూట వున్నట్టు దారికి ఆ పక్కన మూగిన చీమల్నిబట్టి, రెండోపక్కన తేనెసీసా లున్నట్టు ఆ పక్కన మూగిన ఈగల్నిబట్టి తెలిసింది అందుచేత నీ ఒంటెనుగూర్చి నాకు సర్వమూ తెలుసు కాని దాన్ని నేను చూడలేదు."

ఈ కథ టామ్ చెబుతుంటే మేము అత్యుత్సాహంతో ఆలకించాము. జిమ్ "బలేగా వుంది కథ ఊఁ, చెప్పండి, చెప్పండి," అన్నాడు

"అంతే కథ" అన్నాడు టామ్

"అంతేనా? మరి ఆ వొంటె ఏమయింది?" అని అడిగాడు జిమ్.

"నాకేం తెలుసు?"

"అదేమిటి టామ్‌గారూ! కథలో లేదా?"

"లేదు"

జిమ్ ఆశ్చర్యపడ్డాడు. "ఇంత చెడ్డ కథ నేనెప్పుడూ వినలేదు. ఏమవుతుందో, ఏమవుతుందో అని తహ తహ పుట్టేవేళకి కథ ఆగిపోతుంది. టామ్‌గారూ!

టెలిఫోనులో అత్తయ్య

బొమ్మకంటి
ఆండాళ్ తాయారు

ఈ ఏడుకూడా ప్రతి ఏడూ లాగానే శ్రావణ మంగళ వారాలు వస్తున్నాయి గదా అని మా నాన్నగారు వెళ్ళి, మా అత్తయ్యను, పిల్లలను తీసుకువచ్చారు. అప్పటికి అత్తయ్య వచ్చి, ఏడాది దాటిపోయిందేమో అత్తయ్య కూతురు రుక్మిణినీ, కొడుకు కిష్టిగాడినీ చూసేసరికి నాకెంతో సంతోషం వేసింది. ఆ రోజుల్లా చాలా సరదాగా ఆడుకున్నాం. "బాగా చదువుతున్నావుటే నానీ?" అంటూ నాదగ్గరకొచ్చి, అత్తయ్య పెద్ద బిస్కట్లపొట్లాం నాకిచ్చింది. నేను మా చెల్లాయిలకు, తమ్ముళ్లకు, రుక్మిణికీ, కిష్టిగాడికీ బిస్కట్లు సమానంగా పంచాను. రెండు నేను తిని, మిగిలిన సగంపొట్లాం దాయమని అమ్మకిచ్చాను.

ఈ ఏడు అత్తయ్య వచ్చేసరికి మాఇట్లో కొత్తమార్పు ఒకటిజరిగింది. మాఇంట్లో టెలిఫోను పెట్టించుకొన్నాము. మా అత్తయ్య ఎప్పుడూ టెలిఫోను చూడనే లేదు. అందువలన ఆమెకు ఉండుండి బెల్లుమోగడం, మేమెవరన్నాపోయి జవాబు చెబుతుండటము విచిత్రంగా ఉండేది. అత్తయ్య "మీరు చిన్నపిల్లల దగ్గర నుంచి నదురూ బెదురూ లేకుండా ఎలా మాట్లాడగలుగుతున్నారన్నా?" అంటూ ఆశ్చర్యపోయేది. "భయమేమిటత్తయ్యా మాట్లాడాలనుకుంటే నువ్వుకూడా మాట్లాడచ్చు." అనే దాన్ని నేను. అయినా "ఏమిటో నమ్మా! చిత్రాలు!" అంటూ గిరునతిరిగి వెళ్ళిపోయేది.

ఆరోజు మానాన్నగారు ఆఫీసుకు వెళుతూ నన్ను పిలిచి, "నానీ! నువ్వు మధ్యాహ్నం మాఆఫీసుకు ఫోనుచేసి, అత్తయ్యను ఫోనులో మాట్లాడించవే ఒకసారి" అన్నారు. ఆప్రకారమే నేను నెంబరు తిప్పి, రిసీవర్ అత్తయ్య చేతికిచ్చాను.

అత్తయ్య రిసీవర్ పట్టుకొని, "అన్నయ్యా! నేనూ" అంది.

"...అహాఁ" అంది.

కొంచెం ఆగి మళ్ళీ వచ్చేటప్పుడు పువ్వులు తీసుకురారా అన్నయ్యా! నానీకి పువ్వులజడ

ఈ కథకి అర్థం ఏమన్నావుందా? వాడికి చివరికి ఒంటె దొరికిందో లేదో చెప్పకుండా కథేమిటండీ?"

"అంతే మరి."

ఆ కథలో అర్థం ఏమీ లేదని నాకుకూడా అనిపించింది. అయినా ఆ ముక్క పైకి అనకుండా వూరుకున్నాను. ఎందుకంటే, తను చెప్పినకథలో చచ్చుగా వున్న భాగాన్ని పట్టుకుని జిమ్ దెబ్బతీశాడని టామ్ కంగారెత్తి ఏంచేయడానికీ తోచక కొట్టుకుంటున్నాడు. అలాంటి స్థితిలో నేనుకూడా జోక్యంచేసుకుంటే మరీ చిత్తైపోతాడని దయతలిచి వూరుకున్నాను. అయితే టామ్ ఉన్నవాణ్ణి ఊరుకోనివ్వక నన్నే అడిగాడు:

"హాక్! నీ వుద్దేశమేమిటి? కథ ఎలా ఉంది?"

ఇక చెప్పక తప్పలేదు. జిమ్‌కు అనిపించినట్లే నాకూ అనిపించిందనీ, కథ ఒక కొనకు రాకుండా మధ్యలో ఆగిపోతే వినేవాడికి చాలా ఇబ్బందిగా వుంటుందనీ, అసలు అటువంటి కథ చెప్పమని ఎవడడిగాడనీ కొంచెం ఘాటుగానే సమాధానమిచ్చాను.

టామ్ తలవంచుకున్నాడు. కోపం తెచ్చుకోడానికి బదులు విచారంగా మాత్రమే కనబడ్డాడు. చివరికిలా అన్నాడు:

"కథలో ఆ మనిషి చెప్పినట్టుగా కళ్లను కొందరు సరిగా ఉపయోగించుకోగలరు. కొందరు ఉపయోగించుకోలేరు. ఒంటెనేకాదు. ఈ దారివెంబడి తుపాను వచ్చిపోయినా మీరు చూడలేరు."

దీని అర్థం నాకేమీ బోధపడలేదు. అతడు వివరించనూలేదు. అతడప్పు డప్పుడు మాట్లాడే అర్థంలేని విషయాల్లో ఒకటని అనుకుని వూరుకున్నాను. టామ్‌కు అలా మాట్లాడడం అలవాటే. వాగ్వాదంలో జయించలేకపోయినప్పుడు ఏమీ తోచక అతడలాంటివే ఏవో అంటూవుంటాడు. అతని కథలో లోటు కనిపెట్టి సూటిగా పోటు పొడిచాము. దాంతో అతడు చిత్తైపోయాడు, పాపం! (ఇంకా ఉంది)

★ టెలిఫోనులో అత్తయ్య ★

వేస్తాను" అంది. నాన్నగారు సరే అన్నారుట. అంతటితో రిసీవర్ పెట్టేసింది.

5 గంటలకు మామూలుగా నాన్నగారు ఇంటికి వచ్చారు. అయితే మా అత్తయ్య చెప్పినట్లు పువ్వులు మాత్రం తీసుకురాలేదు. మా రుక్మిణివెళ్ళి, "మామయ్యా! అమ్మ పూలు తీసుకురమ్మందిగా! ఏవీ? అమ్మనీతో ఫోనులో చెప్పలేదూ?" అంది. "నాకుఎవరూ ఫోనుచెయ్యలేదే" అన్నారు నాన్నగారు.

మారుక్మిణి నవ్వులాట కన్నదనుకొని నన్ను పిలిచి, ఏమేనాసి! అత్తయ్యచేత ఫోను చేయించమంటే చేయించలేదేం?" అన్నారు.

నేను తెల్లపోతూ "అదేమిటి నాన్నగారూ? అత్తయ్యతో ఫోనులో మాట్లాడింది మీరు కాదూ?" అన్నాను.

ఇంతలో అత్తయ్యవచ్చి, "ఏరా అన్నయ్యా! ముక్త సరిగా సరి,సరి, అని వూరుకున్నావూ?" అంది!

అలా అంటూంటే మా నాన్నగారాశ్చర్య పోతూ "నిజంగానే అత్తయ్య మాట్లాడిందా?" అన్నారు. అలాఅనేసరికి అత్తయ్య మరీ ఆశ్చర్యపోయి, "అదేమిటన్నయ్యా! నేను పూలుతీసుకురారా అన్నయ్యా అంటే సరి అని కూడా 'అంటివే?" అన్నది [illegible]మూలుగా దీర్ఘాలు తీస్తూ.

"నాసీ! అసలు సంగతేమిటమ్మా?" అని నాన్నగారు నన్నడిగారు. నేను జరిగిన సంగతంతా చెప్పాను. నాన్నగారు నవ్వుతూ అన్నారు. "ఎవరోప్యూన్ ఫోను తీసివుంటాడమ్మా! వాడికి తెలుగు రాదు. ఫలానివారు కావాలని చెప్పకుండా అత్తయ్య తెలుగులో ఏదో చెపితే వాడికర్థంకాక 'సరి' అని వుంటాడు. అర్థంకాకపోయినా సరి సరని అంటం వాడి కలవాటు." అంటూ నాన్నగారు అంతా వివరించి చెప్పేటప్పటికి మాకు పొట్టచెక్కలయ్యేట్టు నవ్వొచ్చింది. మా అత్తయ్య బుగ్గలు నొక్కుకుంటూ ముఖం చిన్నపుచ్చుకొని, "అదేమిటిరా అన్నయ్యా! అయితే నువ్వుగదూ మాట్లాడింది?" అంది ఆశ్చర్యంతో. ఆరోజంతా మేము అత్తయ్య చుట్టూ చేరి తెగ అల్లరి చేశాం.

మా నాన్నగారు మరునాడు మూడుగంటలకు ఆయనే వీలుచేసుకొని, ఇంటికి ఫోనుచేశారు. నేను ముందు మాట్లాడితే నాతో "అత్తయ్యనువచ్చి, మాట్లాడమనవే నాసీ!" అన్నారు. నేనుఅత్తయ్యను పిలిచి, రిసీర్ ఆమె చేతికిచ్చాను. ముందర మామయ్య దగ్గరనుంచి వుత్తరంవచ్చిందని అవీ చెప్పేసి, అత్తయ్య హడావుడిగా నాన్నగారవునో కాదోనని "ఎవరు మాట్లాడుతున్నది?" అంది.

నాన్నగారు నవ్వుతూ "నేనేలే" అని ధైర్యం చెప్పారు. తను కూడా నవ్వుతూ అత్తయ్య "నిన్నటిలాగ ఇవాళకూడా ఎవరైనా ప్యూన్ మాట్లాడుతూన్నాడేమో అనుకున్నావేరా అన్నయ్యా!" అంటూ భయంభయంగా ఇంకా పూర్తిగా మాట్లాడకుండానే రిసీవర్ కిందపెట్టేసింది. మేమంతా అత్తయ్య చుట్టూ చేరి, మళ్ళీ బాగా అల్లరి చేశాం.

ఆరోజునుంచి మా ఇంట్లో ఎవరు అవకతవకగా వ్యవహరించినా "అత్తయ్య ఫోన్‌లో మాట్లాడినట్లు" అంటూండటం మామూలైపోయింది. ★

తండ్రి తనకొడుక్కి లోకజ్ఞానం నేర్చుకొనే వయస్సు వచ్చిందని గ్రహించాడు. ఒకరోజున ఇంట్లోవున్న ట్రంకుపెట్టెలన్నింటిని ఒకదాని మీదొకటిపేర్చాడు. కొడుకునిపిల్చి పైట్రంకుపెట్టెమీద కెక్కించాడు. తండ్రి నేలమీద నించున్నాడు "అక్కణ్ణించి దూకు" అని చెప్పాడు తండ్రి.

"భయమేస్తుంది, నాన్నా" అన్నాడు కొడుకు. తండ్రి చేతులు చాచి "నేను పట్టుకుంటానుగా" అన్నాడు. కొడుకు పైనుంచి ఉరికాడు. తండ్రి రెండడుగులు వెనక్కి వేశాడు. దభీమని నేలమీద పడ్డాడు కొడుకు. వాణ్ణి లేవదీసి తండ్రి అన్నాడు "లోకంలో ఎవణ్ణీ నమ్మకు. ఇది నీ మొదటి పాఠం"

పాపం

ఎర్రవూడల అగ్రహారం అని ఒక వూరు. ఆవూరుచుట్టూ చిన్న చిన్న గ్రామాలు చాలా ఉన్నాయి. ఆగ్రామాలన్నిటిలో ఏకతులూ లేకుండా ఉన్నది ఎర్రవూడల అగ్రహారం ఒక్కటే.

ఆ గ్రామంలో వినాయకుడనే బీదవాడు ఒకడున్నాడు. వినాయకుడికి ఒక్కడే కొడుకు. వినాయకుడు ప్రతిరోజూ చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్ళి పూతరేకులు అమ్ముకొని జీవించేవాడు.

ఒకరోజు మామూలు ప్రకారం పూతరేకుల అమ్మకానికని వినాయకుడు, బయలుదేరి వెళ్లాడు. కాని, ఆరోజున అసలు బోణీయే కాలేదు. ఆఖరికి బియ్యం కొనుక్కోనేందుకు సరిపడే సొమ్ముకూడా చేరలేదు.

ఒట్టిచేతుల్తో ఇంటికి తిరిగివచ్చిన భర్తనుచూసి "పెద్దవాళ్ళమయిన మనమంటే పస్తుంటాం కుర్రకుంక వాడిగతి ఏంకాను?" అని కంట తడిపెట్టింది భార్య. ఏం చెబుతాడు పాపం వినాయకుడు? - ఎన్ని గ్రామాలు తిరిగినా తనకు శ్రమ తప్ప ఇంకేమీ మిగలలేదు. తన దురదృష్టాన్ని తలచుకొని చింతించాడు.

మరునాడు కూడా పూతరేకుల బుట్ట నెత్తిన పెట్టుకొని బయలుదేరాడు వినాయకుడు. తిన్నగా ప్రక్క గ్రామానికి చేరుకొన్నాడు ఊరిమధ్యకు రాగానే అక్కడ పోగై ఉన్న జనాన్ని చూచి "పూతరేకులు, పూతరేకులు వేడివేడి పూతరేకులు-నోట్లో వేసుకోగానే వెన్నలా కరిగిపోతాయి, చౌక, చక్కని పూతరేకులు" అంటూ ముందుకు సాగాడు. ఇంతలో ఆ గుంపులోంచి నడికారు వయస్సులోనున్న ఒక పెద్ద యివతలకువచ్చి - "ఏమయ్యా, ఏవూరునుంచి వస్తున్నావు? తిన్నగా

అరుణ

ఎర్రవూడల అగ్రహారం నుంచేవస్తున్నావా? లేక, ఇదుగో ఈప్రక్కగానున్న గ్రామం మీదుగా వస్తున్నావా" అని నిలేసి అడిగేడు.

అలా ఆయన అడగటానికి కారణమేమిటో అర్థంకాలేదు వినాయకుడికి. ఆశ్చర్యంగా చూస్తూ వెంటనే సమాధానం చెప్పలేక పోయినాడు. "బాబూ! ఒక్కోరోజున నేను తిన్నగా యిక్కడికే వస్తుంటాను. ఒక్కో సమయంలో మాత్రం ఆ గ్రామంలో అమ్మకోగా మిగిలిన సరుకుతో యిక్కడికి వస్తుంటాను ఇవ్వాళ మాత్రం తిన్నగా యిక్కడికే వచ్చాను." అన్నాడు బిక్కమొహంతో. గుంపులో ఉన్న ఒక యువకుడు పెద్దగొంతుతో "ఇదుగో—ఇప్పుడే చెబుతున్నాను, ఈసారి వైశ్యుల భూమితొక్కి మళ్ళీమాగడ్డ మీద అడుగుపెట్టావంటే ఏంజరుగుతుందో చూసుకో......' అంటూ హెచ్చరించాడు. అమాయకుడైన వినాయకుడికి అతనలా అనటానికి గల కారణం బోధపడలేదు. సరే లెండి... అంటూ తిన్నగా వచ్చిన దారినే యింటికి బయలుదేరాడు.

ఆనాడుకూడా ఒట్టిచేతుల్తో వచ్చిన భర్తను చూచి భార్య ఆశ్చర్యపోయింది. ఇక భర్తవల్ల సంసారం గడవటం దుర్లభమనే నిశ్చయానికి వచ్చింది వినాయకుడి భార్య. మర్నాడు కొడుకునిపిలిచి- "నాయనా భద్రయ్యా, మీనాన్న ఒక్కరివలన మన సంసారం గడవటం కష్టంగాఉంది. నువ్వూ వయసొచ్చిన వాడవు గనుక ఏదో ఒక గ్రామానికి వెళ్ళి పూతరేకులు అమ్ముకువస్తే కాస్తఇబ్బంది తప్పుతుంది" అని చెప్పింది.

ఈ సంగతి తెలిసి వినాయకుడు కొడుకుని చేరబిలిచి 'ఒరేయ్ భద్రయ్యా! నేను నాలుగు గ్రామాలూ తిరిగి అమ్మలేక కాదు ఇప్పుడు ఒకగ్రామానికీ, మరో గ్రామానికీ, కతులు పెరిగి, తిట్టుకుంటూ ఉన్నారు. ఆ కోపం నా మీదచూపి నాదగ్గర సరుకుకొనటం మానివేశారు. అందుకే యీ మధ్య మనసరుకు అసలు అమ్ముడు పోక పోవటం. అంతేగాని, మీ అమ్మ అనుకొన్నట్లు నేను బద్ధకించటం



★ ఉపాయం ★

వల్లకాదు' అని జరిగినదంతా చెప్పాడు. తండ్రి మాటలను పూర్తిగా విన్నాడు భద్రయ్య.

వెంటనే తల్లి దగ్గరకు వెళ్లి పూతరేకులు తయారు చేయమని చెప్పి, తాను రెండు అట్టముక్కలు తీసుకుని జాగ్రత్తగా కత్తిరించాడు. వాటిమీద తెల్లకాగితం అంటించాడు. ఒకదానిమీద "వీరభద్రయ్య పూతరేకుల దుకాణం" అనీ, మరో దానిమీద రామభద్రయ్య పూతరేకుల దుకాణం అని వ్రాశాడు. ఆ రెండింటిని మెడలో వేలాడ వేసుకొందుకు వీలుగా తాళ్లు కట్టి సిద్ధ పరుచుకున్నాడు.

తెల్లవారుతూండగానే భద్రయ్య లేచి, కాలకృత్యాలు తీర్చుకొని పూతరేకుల బుట్ట నెత్తిన పెట్టుకొని, మెడలో, "రామభద్రయ్య పూతరేకుల దుకాణం" అని వ్రాసిఉన్న అట్ట వేసుకొని వైష్ణవుల గ్రామానికి బయలుదేరి వెళ్లాడు. గ్రామం మధ్యకు వెళ్లగానే పెద్దా చిన్నా అంతా చుట్టుముట్టారు. అందరూ అతనివంక ఆశ్చర్యంగా చూశారు. భద్రయ్యకు గుండెదడ హెచ్చిపోయింది—వీళ్లంతా కలిసి ఏమి చేస్తారో అని భయపడినా ధైర్యవంతుడు కాబట్టి గుండె దిట్టచేసుకొని చూస్తూనిలబడ్డాడు.

ఇంతలో ఆ గుంపులోనుంచి ఒకపెద్ద బయటికివచ్చి "నిన్నటి వరకూ మనగ్రామంలో పూతరేకులు అమ్మటానికి వచ్చినవాడు మనల్ని చాలా మోసగించి, ఇక్కడి మాటలన్నీ అక్కడ చెబుతూండేవాడు. అందుకే వాడివద్ద మనం అందరం పూతరేకులు కొనటం మానివేశాం. ఈరోజున మన వైష్ణవుడే పూతరేకులు అమ్మటానికి వచ్చాడు. మనం అందరం కలిసి సాటి వైష్ణవుడయిన ఈ రామభద్రయ్యను ప్రోత్సహించాలంటే, ఇతని దగ్గరతప్ప మరొకరి దగ్గర పూతరేకులు కొనకూడదు." అని ఉపన్యాస ధోరణిలో చెప్పాడు.

తమ పెద్ద చెప్పాడు గదా అని ఊళ్ళోవాళ్ళంతా వెంటనేభద్రయ్య తెచ్చిన పూతరేకులన్నీ కొనేశారు.

ఇదివరలో వారంరోజులు కష్టపడినా ఒక్కబుట్టెడు పూతరేకులు అమ్మటం బ్రహ్మప్రళయంగా ఉండేది వినాయకుడికి. అటువంటిది యీనాడు కొడుకు ఒక్కపూటలో బుట్టెడు పూతరేకులు అమ్మకు రావడంతో వినాయకుడి కళ్లు ఆనందంతో చెమ్మగిల్లాయి.

మర్నాడు కూడా అమ్మకానికి మరోబుట్టెడు పూతరేకులు సిద్ధం చేసింది భద్రయ్యతల్లి. భద్రయ్య ఈసారి "వీరభద్రయ్య పూతరేకుల దుకాణం" అని వ్రాసివున్న అట్టను మెడలో వేసుకొని, శైవులు ఎక్కువగాఉన్న గ్రామానికి బయలుదేరాడు.

గ్రామంలో అడుగు పెట్టగానే ఒక్కొరొక్కరుగా నెమ్మదిగా ఊళ్లో జనంఅంతా చిన్నా పెద్దా భద్రయ్య చుట్టూమూగి వింతగా

చూట్టం మొదలుపెట్టారు. ఒక పెద్ద తన చేతిలోని పొన్ను కర్రను వయ్యారంగా వూపుతూ తిన్నగా భద్రయ్య దగ్గరకువచ్చి అతని మెడలోని అట్టనుచూసి "వీర భద్రయ్య పూత రేకుల దుకాణం" అని చదువుకొని తనలో నవ్వుకున్నాడు.

తన ప్రక్కనే ఉన్న వారిని అందరినీ కూర్చోబెట్టి యిలా చెప్పడం మొదలుపెట్టాడు.

"మీతో ఒక విషయం, చాలా ముఖ్యమైన విషయం చెబుతున్నాను, శ్రద్ధగా వినండి, మొన్నటిదాకా మనఊళ్లో పూత రేకులు అమ్మినవాడు ఎవరనుకున్నారు? మనపక్క గ్రామంలోని వైష్ణవులు మన గ్రామంలో గుట్టుమట్లు అన్నీ కూపీతియడానికి పంపినవాడు. అంతేకాని మరోడు కాడు. అందుకనే పెద్దలందరమూ చేరి వాడ్ని మళ్ళీ ఇక్కడకు రాకుండా చేశాము ఈరోజున, యిక్కడ వున్న ఈ వీరభద్రయ్య, మన శైవుడు. అందుచేత, మీరందరూ వీరభద్రయ్యను అభిమానించాలి. రేపటినుంచి మనందరకు కావలసిన పూత రేకులను మనమతస్థుడు అయిన ఈ వీరభద్రయ్యే సప్లయి చేస్తుంటాడు. అందరూ ఇతనిదగ్గరే కొంటూ" ఉండాలని నామనవి... అంటూ కొన్ని పూత రేకులు కొనుక్కొని పోయాడా పెద్ద మనిషి.

భద్రయ్య పూత రేకుల బుట్ట చూస్తూ వుండగానే ఖాళీఅయిపోయింది. భద్రయ్య, ఖాళీబుట్టను ఊపుకుంటూ అమితానందంతో యింటికి చేరుకున్నాడు. ★

ఎవరిదీ సూట్‌కేసు?

వి. ఎస్. చెన్వారి

మేనల్లుడి కూతురి పెళ్ళిగ్గాను మద్రాసు వెళ్లిన పేర్రాజుగారు పెళ్ళిపూర్తయిన తరువాత ఓరోజు, అలా ఊరిమీదికి బయలుదేరారు. తిరిగి తిరిగి మూర్ మార్కెట్టు చేరుకున్నారు పాత సామాన్లు అమ్మే దుకాణాల వద్దకొచ్చేసరికి ఓ పాత సూట్‌కేసు ఆయన కంటబడింది. పేర్రాజుగారు తన ...సమడికి అల్లాంటి సూట్‌కేసొకటి కొనాలని చాలా రోజులుగా అనుకొంటూ ఉన్నారు కాని ఎప్పుడూ వీలుచిక్కింది కాదు. ఇది 'సెకెండ్ హేండ్' ది కాబట్టి చవుకగానే దొరకవచ్చు. అందుచేత యెలాగయినా కొనేయాలని నిశ్చయించుకున్నారు. బేరంచేసి చివరికి ఐదురూపాయలకి కొనేశారు.

మరునటిరోజు రాత్రిభోజనానంతరం, పైపంచా, పాతకోటూ, పెళ్ళింటివారు కట్టిచ్చిన ఫలహారాలూ, కొబ్బరికాయా అన్నీ సూట్‌కేసులో అమర్చి, మూతపెట్టి, తాళంవేసి, తాళం భద్రంగా బొడ్లోదోపుకుని, పెళ్లింటివారివద్ద సెలవు పుచ్చుకుని ఆయన ఊరికి ప్రయాణమయ్యారు. సెంట్రల్ స్టేషన్ చేరుకుని, టిక్కెట్టు కొనుక్కుని విశాఖపట్నం ప్యాసింజెర్లో యెక్కి, సూట్‌కేసుని తన యెదురుగుండా సామాన్లు పెట్టుకునే బెర్తుమీద ఓ చివర పెట్టుకూర్చున్నారు. బండి కదిలే సమయానికి పెట్టెలో రద్దీ యెక్కువయింది.

బేసిన్ బ్రిడ్జిలో కాబోలు, జనాన్నితోసుకుని యిద్దరు వ్యక్తులు లోపలికి జొరబడ్డారు. అందులో ఒకరు బుష్‌కోటు వేసుకున్నారు. ఆ ఆసామీ చేతిలో ఓసూట్‌కేసు ఉంది. అది అచ్చం పేర్రాజుగారి సూట్‌కేసు లాంటిదే కాని, కొత్తది! విద్యుద్దీప కాంతిలో తళతళా మెరిసిపోతున్నది. ఆసూట్‌కేసు పేర్రాజుగారి సూట్‌కేసు మీద పెట్టి, కూచునేందుకు చోటులేకపోవటంచేత వారిద్దరు అలాగేనుంచున్నారు. బండి కదిలింది.

"ఎంత బావుంది! — కనీసం, పాతికరూపాయలు పెట్టందే అలాంటిది రాదు"— అని అనుకుంటూ, ఆ కొత్త సూట్‌కేసువేపే చూస్తూ ఉండిపోయారు పేర్రాజుగారు. పక్కస్టేషనులో కొందరు దిగిపొయ్యారు కొందరు ఎక్కారు. ఆ ఎక్కినవాళ్ళలో ఓఆసామీబండెడు లగేజీ పట్టుకొచ్చాడు. బెర్తుమీద లగేజీసర్దడంలో యీసూట్‌కేసులు రెండూ క్రిందుమీదయినై. ఇది ఒక్క పేర్రాజుగారు తప్ప మరెవ్వరూ గుర్తించలేదు.

ఆ కొత్త సూట్‌కేసు పట్టుకొచ్చినవ్యక్తులు అలా నుంచోలేక, యెక్కడేనా చోటుందేమో చూచి రావడానికాబోలు పొన్నేరిస్టేష

సులో దిగారు. చోటు దొరికినట్టుంది, బండి కదలబోతుండగా అందులో ఒక్కరు మాత్రం తిరిగొచ్చి పైనున్న సూట్ కేసుని పట్టుకెళ్లారు. అంటే తను కొత్తసూట్ కేసును వదిలిపెట్టి, తొందర్లో పేర్రాజుగారి సూట్ కేసుని పట్టుకు పోతాడన్న మాట.

పేర్రాజుగారు ఇదంతా ఓకంట కనిపెడుతూనే ఉన్నారు కాని, అత గాణ్ణి హెచ్చరించిన పాపాన పోలేదు.

వాళ్లు తమలో తాము అర వంలో మాట్లాడుకొన్న దానిని బట్టి, దగ్గర్లోనే ఎక్కడో దిగిపోతారనీ, ఈ కాస్తవ్యవధిలో సూట్ కేసుని గుర్తుపెట్టగల అవకాశం ఉండదనీ, వాళ్లు దిగిపోయిన తరవాత కొత్త సూట్ కేసుమీద తనకు సర్వ హక్కులూ లభిస్తాయనీ పేర్రాజు గారికి తెలుసు. బండికదిలిన తరువాత మెల్లగా లేచి ఆసూట్ కేసుని కాస్త అవతలకు జరిపి చూచారు బరువుగా సేవుంది. పొద్దానికి ఆ రోజు నిద్రలేచి ఎవరి ముఖం చూశానో నన్నుగొప్ప అదృష్టం వరించబోతున్నదని పేర్రాజుగారు లోలోపలే సంతోషించసాగారు.

పేర్రాజుగారు అనుకున్నట్టే బండి నాలుగయిదు స్టేషన్లు దాటినా సూట్ కేసుకోసం ఎవరూ రాలేదు. ఈపాటికి వాళ్ళెక్కడో దిగిపోయి ఉంటారనుకుని ఆయన సంతోషప డ్డారు.

బండి గూడూరుస్టేషను చేరు కున్నది. సూట్ కేసు పట్టుకొచ్చిన ఇందాకటి బుష్ కోటు ఆసామీ పెట్టెలోకెక్కి ఆ కొత్తసూట్ కేసుని కూడా పట్టుకుపోసాగాడు. పేర్రాజు గారికి వళ్లుమండింది. చివుక్కున లేచి,— "అరేఁమి టయ్యా యిది! అది మీది కాదు. మీది ఫలానా స్టేషనులో మీవాడొచ్చి పట్టుకు పోయాడు" అని వారించాడు.

అతడు విసుగ్గా ముఖంచిట్లించి- "మావాడా?—ఎవడా మావాడు? —ఇంతకూ ఈసూట్ కేసు ఎవరి దంటావ్?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"ఇది నాదయ్యా బాబూ?"— అని పేర్రాజుగారు అందిపుచ్చుకో బోయేసరికి, ఇద్దరికీ ఘర్షణ జరగడం అక్కడున్న నలుగురూ గుమి గూడ్డం జరిగింది.

పెట్టెలో కూచుని ప్రయాణం చేస్తోన్న పెద్దమనుషులు యిద్దరు ముగ్గురు అవునవును, అతనితో నుంచుని ఉండిన మనిషి 'ఫలానా' స్టేషనులో సూట్ కేసుని పట్టుకు పోయింది నిజమేనని సాక్ష్యం చెప్పారు. కాని, బుష్ కోటు ఆసామీ మాత్రం-తనతో నుంచుడిన వ్యక్తికీ తనకీ ఎలాంటి సంబంధమూ లేదనీ, అతడెవడో తనకీ తెలియదనీ, ప్రస్తుతం యీసూట్ కేసు తనదే ననీ, కాబట్టి తనసూట్ కేసుని తన కివ్వడానికి అభ్యంతరపెట్టొద్దనీ వాదించాడు.

ఇంతలో ఓ పెద్దమనిషి "ఈ పెట్టె నాదంటే నాదని వాదించు కుంటున్నారు గదా, ఇందులో యేమేమున్నాయో మీకు జ్ఞాపకం ఉన్నంతమట్టుకు ఎవరికి వారు జాబితా రాసి యివ్వండి. పెట్టె యెవరిదో యిట్టే తేలిపోతుంది."- అని అంటూ చెరో కాగితం పెన్సిలూ యిచ్చాడు. అక్కడ గుమిగూడిన పెద్దలందరూ ఈ పద్ధతి బావుం దంటే బావుందన్నారు. జాబితా రాసి యివ్వడానికి యిద్దరూ ప్రథ మంలో పేచీపెట్టినా ఒప్పుకోక తప్పిందికాదు. రెండు జాబితాలూ తయారయినై. పెట్టె తెరచిచూస్తే పేర్రాజుగారి జాబితాతో యెలాగూ సరిపోలేదు కదా, బుష్ కోటు ఆసామీ జాబితాతోకూడా సరి పోలేదు. అందరూ ఆశ్చర్య పోయారు. ఇంతలో అక్కడికో పెద్దమనిషి పోలీసు ఇన్ స్పెక్టర్ తో సహా ప్రత్యక్షమవడం, పెట్టెతనదే నని ఋజువు పరచడం జరిగింది.

ఆ ఆసామీ, సెంట్రల్ స్టేషను వెయిటింగ్ రూములో సూట్ కేసుని తలక్రింద పెట్టుకుని పడుకొని ఉంటే యెవడో దొంగవెధవ ఆ పెట్టెస్థానంలో మరో అట్టపెట్టె వుంచి అతిమెలకువగా ఆపెట్టెని కాస్తా కొట్టేసి జఫాయించాడనీ, ఆ పెట్టెనీ అందులోని సామాన్లని తాను మద్రాసులో కొనుగోలు చేశాననీ చెప్పాడు. వాటితాలూకు బిల్లులుకూడా చూపించాడు.

"ఇప్పుడు చెప్పండి, ఎవరిదీ సూట్ కేసు?" అని పోలీసు ఇన్ స్పెక్టర్ అడుగుతుంటే ఎవరూ మాట్లాడలేదు. ఇద్దరి ముఖాలూ మాడిపోయినై.

"పదండి స్టేషన్ కి అక్కడే చెప్పు కుందురుగాని" అని ఇన్ స్పెక్టరు బండిదించి, స్టేషన్ కి లాక్కు పోతుంటే, పేరాశకు పోయిన పేర్రాజుగారు పెట్టెకు పెట్టెపోగొట్టు కుని, దొంగ అయినందుకు తీరని అవ మానంతో తల వంచుకున్నాడు. ఇంతసేపూ ఇందుకోసమే ఆగినట్టు కూతేసి, బరువుగా కదిలింది రైలు బండి. ★

ఆనందం, విజ్ఞానం ఇవ్వడమే చిత్రాల ప్రయోజనం

మద్రాస్ గవర్నరు శ్రీప్రకాశగారి ఉద్బోధ

మద్రాస్, ఫిలింఫాన్స్ సంఘంవారు 1958 సం॥లో ఉత్తమ చిత్రాల నిర్ణయించిన వాటి నిర్మాతలకు, ఉత్తమ నటీనటులని నిర్ణయించినవారికి ఈనెల 7వ తేదీ సాయంత్రం మద్రాస్ గవర్నరు శ్రీ ప్రకాశగారు బహుమతులిచ్చారు ఆ సందర్భంలో ఆయన ఉపన్యసిస్తూ చలనచిత్రాలు ప్రజలకు ఆనందం, విజ్ఞానం కలిగించాలని అన్నారు


ఉత్తమ తమిళచిత్రం "అవ్వయ్యార్" నిర్మాత ఎస్ ఎస్ వాసన్, తెలుగు చిత్రం "దేవదాసు" నిర్మాత డి ఎల్ నారాయణ, ఉత్తమ తమిళనటుడు టి కె షణ్ముగం, ఉత్తమ తమిళనటి సావిత్రి, తెలుగు నటుడు ఎ నాగేశ్వరరావు, తెలుగునటి భానుమతి గార్లకు బహుమతు లివ్వబడ్డాయి

ఫిలింఫాన్స్ సంఘాధ్యక్షుడు వి సి గోపాలరత్నంగారు సభికులకు స్వాగతమిస్తూ, తమ సంఘం మామూలు ప్రేక్షకులకు ప్రాతినిధ్యం వహిస్తుందని అన్నారు త్వరలో తాము బాలచిత్రోత్సవం ఏర్పాటు చేయనున్నామని, దానిపైన వసూలయ్యే ధనం గాంధీ స్మారకనిధికి ఇవ్వబడుతుందనీ ప్రకటించారు అక్రూహ్లా ఫిల్ముల ప్రదర్శనను నిలుపుచేయడం విచారకరంగావుందనీ, అవి చాల చక్కని విజ్ఞానదాయకమైన చిత్రాలనీ, తిరిగి వాటిని ప్రదర్శించడానికి అధికారులూ, ఎగ్జిబిటర్లు సంప్రదింపులు జరపాలనీ కోరారు

ఉత్తమ తమిళ నటిగా బహూకరింపబడుతున్న శ్రీమతి సావిత్రి మాతృభాష తెలుగు అయినప్పటికీ ఆమె నటనా వైదుష్యానికి ప్రశంసానూచకంగా తాము ఈ బహుమతి ఇస్తున్నామనీ, భాషా భేదాలు కళారంగంలో అడ్డురాగూడదనీ ఆయన తెలిపారు

ఎ నాగేశ్వరరావు తెలుగులోనూ సావిత్రి తమిళంలోనూ తమ కృతజ్ఞత వెల్లడించారు వాసన్‌గారు మాట్లాడుతూ, రాజకీయ నాయకులను విమర్శించడం ఫేషన్ అయినట్లే సినిమానిర్మాతలను విమర్శించడం కూడా ఈ రోజుల్లో ఒక ఫేషన్ అయినదని, విమర్శకులు కొంత సానుభూతితో ఫిలిం పరిశ్రమ సమస్యలను పరిశీలించాలనీ కోరారు కేంద్ర ప్రభుత్వమూ తదితర సంస్థలూ ఈమాదిరి బహుమానాలు ఇస్తూ చలనచిత్రాలపట్ల సద్భావం వెల్లడించడం తమకు ఎంతైనా సంతోష కారణమని ఆయన అన్నారు పరిశ్రమ సమస్యలను ఆయన ఇలా పేర్కొన్నారు "అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ మొదలైన దేశాల్లో ఒకటే భాషలో చిత్రాలు తయారవుతాయి మన దేశంలో అనేక భాషల్లో చిత్రనిర్మాణం జరుగుతోంది అంటే మన చిత్రాలకు మార్కెట్ పరిమితమైవుంటుందన్నమాట. అధికమైన వినోదం పన్ను వసూళ్లు, థియేటర్ల కొరతమూలంగాకూడా మన పరిశ్రమ విస్తరించడానికి వీలులేకపోతోంది

పరిశ్రమలో నూటికి తొంభైమంది అనుభవహీనులు సహజంగా వీరు అప



"అవ్వయ్యార్" చిత్రనిర్మాత ఎస్. ఎస్. వాసన్‌గారికి గవర్నర్ శ్రీప్రకాశ బహుమతి ఇస్తున్న దృశ్యం

ఆనందం, విజ్ఞానం ఇవ్వడమే చిత్రాల ప్రయోజనం

జయం పొందుతారు ప్రతి ఏడాదీ నూటికి తొంభైమంది నిర్మాతలు పరిశ్రమనుంచి తప్పుకుంటున్నారు మరొక తొంభైమంది కొత్తగా వస్తున్నారు వీరి మూలంగా మిగిలిన పదిమందికీ కష్టనష్టాలు సంభవిస్తున్నాయి మంచి చిత్రాలు తయారు కావడంలేదు గనుక పరిశ్రమను విస్తృతం కానివ్వమని ప్రభుత్వం అంటుండగా, పరిశ్రమను విస్తృతం కానివ్వడంలేదు గనుకనే మంచి చిత్రాలు తయారుకావడంలేదని నిర్మాతలు అంటున్నారు ఈ సమస్యను ఉభయులూ సంప్రదింపులద్వారా తేల్చుకోవడం అవసరం”

అశ్లీల చిత్రాలను ఉచితంగా సప్లయి చేస్తే ఉచితంగా ప్రదర్శించడానికి తాము సుముఖులమని వాసన్‌గారు తిరిగి ఉద్ఘాటించారు

శ్రీ ప్రకాశ్‌గారు మాట్లాడుతూ, తనకు సినిమాల్ని గూర్చి ఏమీ తెలియదనీ, అందుచేత వాసన్‌గారు చెప్పిందేమీ తన కర్థం కాలేదనీ, అయితే సాధారణంగా ప్రభుత్వాలే తప్పుచేస్తుంటాయి కనుక వాసన్‌గారు చెప్పింది రైటే అయివుంటుం దనుకుంటున్నాననీ అన్నారు (నవ్వులు)

సామాన్యులుగా చిత్రాల ప్రయోజనం వినోదమేనని చిత్రనిర్మాతలు అంటూవుంటారు. శ్రీ ప్రకాశ్‌గారు తమ ఉపన్యాసంలో ఎక్కడా వినోదం (ఎంటర్ టెయిన్‌మెంట్) అనే మాటను రానివ్వలేదు. చిత్రాల ప్రయోజనం ఆనందం (‘జాయ్’) అని ఆయన ఉద్ఘాటించారు ఆయన ‘ఆనందం’ అని పదేపదే అనడంలో వినోదానికీ ఆనందానికీ గల తేడాను వ్యక్తం చేయడమే ఆయన ఉద్దేశ్యం అనిపించింది. కళకు ప్రయోజనం ఆనందం అని కళావేత్తలు నిర్వచించారు

సినిమాలు ఆనందం ఇవ్వాలనీ, ఆనందం ఇవ్వని సినిమాలు వ్యర్థమనీ, అయితే విజ్ఞానం వ్యాపింపజెయ్యడం కూడా వాటి కర్తవ్యమనీ శ్రీ ప్రకాశ్‌గారన్నారు విజ్ఞానం, విద్య అంటే మంచిచెడులను తెలుసుకోగల విచక్షణ శక్తేనని ఆయన అన్నారు ప్రపంచ సమాచారాన్ని అందించే చిత్రాలు కూడా ఉపయోగకారులని చెప్పారు



“నమూశ్” చిత్రంలో అశోక్‌కుమార్, శశికళ

“బాద్షా”

విక్టర్ హ్యూగో రచించిన “హంచ్ బాక్ ఆఫ్ నాటర్ డామ్” కథను తీసుకుని “బాద్షా” హిందీ చిత్రాన్ని అమియ చక్రవర్తి నిర్మించారు దర్శకుడు కూడా ఆయనే. సంగీత దర్శకులు శంకర్, జైకిషన్‌గారు. ఉస్తాద్, ఉషాకిరణ్, కె ఎన్ సింగ్, ఆగా, అచలా సచ్‌దేవ్, మాలాసిన్హా నటించారు గూనివాడుగా ఉస్తాద్, జిప్సీ యువతిగా ఉషాకిరణ్ చాల చక్కగా నటించారట

“నౌక్రి” సమీక్ష

బిమల్ రాయ్ తీసిన తాజా చిత్రం “నౌక్రి” భారతీయ సినిమాకళలోని ఏకైక మేధావి అనిపించే బిమల్‌రాయ్ ప్రతిభా విశేషం ఈ చిత్రంలో ప్రస్ఫుటంగా కనిస్తుంది నిరుద్యోగం ప్రధానాంశంగా కలిగిన ఇతివృత్తం కథానిర్వహణం, కామెడీ పరిహాసితనం, ట్రీట్‌మెంట్, నటన, ప్రేక్షకుల హృదయాలను కదిలించగల శక్తి వర్ని చూస్తే “నౌక్రి” అద్భుత కళాఖండం అనిపించింది సినిమా కళాదృష్టితో చూస్తే దొబిఘా జమీన్‌కంటె మంచి చిత్రం అనిపిస్తుంది సంగీతంకూడా ఎంతో ఉత్తమంగా ఉన్నది కిశోర్ కుమార్ నాయకపాత్రను అమోఘంగా నటించాడు అతని పాత్ర భారతీయ చిత్రాల్లో కల్లా మరువరాని సృష్టిగా కనిపిస్తుంది అంకొమార్, అచలాసచ్‌దేవ్, కన్హయ్యాలాల్, శీలారమణి, బిక్రమ్ కపూర్, శకుంతలాదేవి, కృష్ణకాంత్ మున్నగువారు నటించారు ఎంతో, వెన్నెల, చీకటిదృశ్యాలను ఫొటోగ్రాఫర్ కమల్ బోస్ చాలా యథాతథమని భ్రాంతికలిగించేట్లు తీశారు



మద్రాస్ ఫిలింఫాన్స్ సంఘంవారిచే తెలుగుచిత్రాల్లో (1953 సం॥) ఉత్తమనటుడుగా బహుమానింపబడిన
ఎ. నాగేశ్వరరావు, తమిళచిత్రాల్లో (1953 సం॥) ఉత్తమ నటిగా గౌరవింపబడిన సావిత్రి

బొంబాయి సినిమా లేఖ

(ఆంధ్ర—వారపత్రిక విలేఖరి)

పాకిస్థాన్ సినిమా పరిశ్రమ

ముడి ఫిలిం కొరత కారణంగా పాకిస్థాన్ సినిమా పరిశ్రమ ఇబ్బందులలో పడింది. పోయిన వారం స్పెషల్ పోలీసు దళం వారు ముడి ఫిలిం వర్తకులను అరెస్టు చేసి, కొంతకాలం క్రితం జరిగిన బ్లాక్ మార్కెట్‌కు సంబంధించిన సాక్ష్యం సేకరించారు. దోషులను స్వాధీనపట్టం ప్రకారం విచారణ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ముడి ఫిలిం దొరకక ఫిలిం స్టూడియోలు మూసివేయబడినందు వల్లనే ప్రభుత్వం ఈ విధంగా చర్యలు తీసుకోవలసివచ్చింది. ఇప్పటికే పాకిస్తాన్ స్టూడియోల్లో ఎక్కువ భాగం మూసివేయబడి వున్నాయి; కారకులు, ఇక్కడి ఉద్యోగులు పని లేకుండానే వున్నారు.

ఫిలిం పరిశ్రమ స్థితిని బాగుపరచడానికి పాకిస్థాన్ ప్రభుత్వం చేసిన మరొక ముఖ్యమైన పని ఒక ఫిలిం విచారణ సంఘాన్ని నియమించడం. భారతీయ చిత్రాల పోటీ వల్ల వచ్చే లాభ నష్టాలను గురించిన సమాచారాన్ని సేకరించే ఉద్దేశ్యంతో ఈ సంఘం వారు వివిధ సంస్థలకు, వ్యక్తులకు ఒక ప్రశ్నావళి పంపించారు. "భారతీయ చిత్రాలు మన చిత్రాలతో పోటీకి వస్తున్నందున, మన పరిశ్రమను రక్షించడానికి భారతీయ చిత్రాలను నిషేధించవలసి వుంటుందా?" అని ప్రభుత్వం అడిగింది. భారతీయ చిత్రాలకు ఇది వ్యతిరేక చర్యగానే భావింపబడుతున్నది. కాని పాకిస్థాన్‌లోకి భారతీయ చిత్రాలు రాకూడదని ఉద్యమం లేవదీసిన పత్రికా జెడ్ అహ్మద్ అనే ఆయనకు ఇంతదాకా ఉన్న అనుచరుల బలం తగ్గిపోయింది. ఆయన అనుయాయులు ఆయన్ని వదిలిపెట్టి వేరే సంస్థల్లో చేరారు. అహ్మద్ బలం తగ్గిపోవడంమూలంగా భారతీయ చిత్రాలపై నిషేధం తొలగిపోవడానికి అవకాశం ఉందని వ్యాపార వర్గాల వారు ఆశపడుతున్నారు.

* * *


నిర్మాతలకు సెన్సార్ల భయం.

ఫిలిం సెన్సార్లు, ముఖ్యంగా బొంబాయిలో వారు నిర్మాతలను బాధల గోడు పెడుతున్నారని, జీవిత సమస్యలను వాస్తవికంగా, ప్రయోజనకరంగా చిత్రించడానికి వీల్లేకుండా పలువురు మంచిమంచి డైరెక్టర్లను అడ్డగిస్తున్నారని ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్. ఎస్. వాసన్ కొంతకాలం క్రిందట ప్రకటించారు.

సెన్సార్లు స్త్రీల అవయవ ప్రదర్శనం మీద యుద్ధం ప్రకటించినట్లు తోస్తుంది. "గాలి వీచినప్పుడల్లా ప్రస్ఫుటంగా కనిపించే ఉషాకిరణ్ వక్షస్థలం క్లోజప్‌లను,



రాగిణీవారి "అర్ధాంగి"లో నాగేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, సావిత్రి



అమర్ మల్లిక్ నిర్మిస్తున్న "స్వామీ వివేకానంద"లో వివేకానందుడుగా అజిత్ ప్రకాష్, ఆయన తల్లిగా సుప్రభాముఖర్జీ

డిన్-క్లోజ్ పాటలను తొలగించండి' అని సెన్సార్లు ఆజ్ఞాపించారు - ("దారా")

"నాట్యం చేస్తున్నప్పుడు యువతీయువకులు పిరుదులు కదులుస్తున్న భాగాలను, యువతులు వక్షం కదులుస్తున్న భాగాలను, కౌగిలించుకున్న ఇద్దరు యువతుల దృశ్యాలను తొలగించండి" అని మరొకసారి సెన్సార్లు ఆజ్ఞాపించారు-("ఘూన్')

* * *

తెరమీద సొహ్రాబ్ మోడీ పునర్దర్శనం.

నిర్మాత, దర్శకుడు, నటుడు అయిన సొహ్రాబ్ మోడీ "ఝాన్సీకీ రాణీ" తరవాత మరే చిత్రంలోనూ నటించలేదు రెండేళ్ళ తరవాత ఆయన తిరిగి తెరమీదికి వస్తున్నాడు ఈ నెల 2వ తేదీన ఆయన నిర్మిస్తున్న కొత్త చిత్రం "కుందన్" ప్రారంభోత్సవం జరిగింది ఈ చిత్రానికి ఆధారం విక్టర్ హ్యూగో రచించిన "లే మిజరబ్లే" నవల అట (బీదలపాట్లు అనే పేరుతో ఇది పూర్వం తెలుగులో వచ్చింది) ఈ కథను భారతీయ వాతావరణానికి అనువుగా మార్చి సంఘపరిస్థితుల మీద విమర్శగా ప్రయోగిస్తారట కథానాయకుడు జాం వాల్ జాం పాత్రను సొహ్రాబ్ మోడీ ధరిస్తాడు నిమ్మీ, ఉల్హాస్ కూడా చిత్రంలో పాల్గొంటారు

నిర్మాత, దర్శకుడుకూడా మోడీయే మినర్వా మువిటోన్ స్టూడియోలో మరి రెండు చిత్రాలుకూడా తయారవుతాయి ఒకటి "రాజ్ హట్" మొఘల్ కాలపు వాతావరణంలో జరిగిన రాజపుత్ర వీర గాధ ఇతివృత్తం మరొకటి "పసీనా" ఒక కార్మికుని కష్టమయ జీవితం ఇందులో కథా వస్తువు

* * *

అశోక్ కుమార్ ప్రొడక్షన్స్‌వారు తీయనున్న కొత్త చిత్రంలో గంగూలీసోదరులైన అశోక్ కుమార్, కిశోర్ కుమార్, అనూప్‌కుమార్ ముగ్గురూ మొదటిసారిగా కలిసి నటిస్తున్నారు "[illegible]" డైరెక్టు చేసిన వసంత్ జోగ్లేకర్ దీనికి దర్శకుడు అశోక్ కుమార్ అసలు పేరు కుముద్ లాల్ గంగూలీ గడిచిన ఇరవై ఏళ్ళనుండీ ఇతను విశేషంగా ప్రజాభిమానం సంపాదించిన నటుడుగా పరిగణింపబడుతున్నాడు

"అఛూత్ కన్య"తో మొదలు పెట్టి "సమాజ్" వరకూ ఇతడు ఇరువయ్యే పైగా బాక్సాఫీస్ చిత్రాలలో నటించాడు కిశోర్ కుమార్ "లడ్కీ", "ఇల్జాం" "ఫహారీ రులక్" చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్నన పొందాడు ఇతని తాజా చిత్రం బిమల్ రాయ్ నిర్మించిన "నౌక్రీ" అనూప్ కుమార్ తాజా చిత్రం "సమాజ్" కిశోర్ కుమార్ మంచి నటుడే కాకుండా గాయకుడుకూడాను వీలైనప్పుడల్లా ప్లేబాక్ గాయకుడుగా పనిచేస్తూ ఉంటాడు

* * *

పదేళ్ళ క్రిందట "జీనత్"లో ఎక్‌స్ట్రా నటిగా ప్రారంభించిన శశికళ ఇప్పుడు పైకి వస్తున్న బొంబాయి తారలలో ఒకర్తె. మధుబాల, నిమ్మీ, సురయ్యా మొదలైన పెద్ద తారలకంటె ఎక్కువ చిత్రాల్లో ఇప్పుడు నటిస్తున్న తార శశికళే "సమాజ్"లో ఈమె

★ బొంబాయి సినిమా లేఖ ★

మంచి నటనా ప్రావీణ్యం కనబరిచింది. దత్తా ధర్మాధికారి నిర్మిస్తున్న "సబ్సే బడా రుపయా" చిత్రంలో కూడా ఈమె కొత్తగా బుక్ అయినది. ఈ చిత్రానికి దర్శకుడు, రచయిత పి. ఎల్. సంతోషి. శశికళ జన్మతః మహారాష్ట్రవనిత. పంజాబీ వ్యాపారస్థుడు ఓం ప్రకాష్ అనే ఆయన ఆమె భర్త. ఆమెకు శైలజ అనే ఒక కుమార్తెకూడా వున్నది. పి. యస్. అరోరా తీస్తున్న "సితారా"లో కూడా శశికళ నటిస్తున్నది.

* * *

మీనా కుమారి, దిలీప్ కుమార్ కలిసి నటించేట్లు చేయడంలో విజయం సాధించిన ఎస్. ఎమ్. శ్రీరాములు నాయుడు (పక్షిరాజా స్టూడియో అధినేత)గారు తీస్తున్న "ఆజాద్" చిత్రంలో పమ్మి, ఓంప్రకాష్, ప్రాణ్, అచలా సచ్ దేవ్, రణధీర్, మురాద్, బద్రీ ప్రసాద్, ఎస్. నజీర్, రాజ్ మెహ్రా వగైరాలుకూడా నటిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఇదివరకు తీయబడిన ఈ చిత్రానికి (తెలుగులో అగ్గిరాముడు) సంగీత దర్శకుడు సి. రామచంద్ర. ప్లేబాక్ పాటలు లతా మంగేష్కర్, తలత్ మహమూద్ పాడతారు.

* * *

మరొక మహారాష్ట్ర తార ఉషా కిరణ్ ఇప్పుడు మెహబూబ్ ప్రొడక్షన్స్‌వారి చిత్రంలో నళినీజయవంత్‌తో కలిసి నటిస్తున్నది. ఈ చిత్రానికి ఇంకా పేరు పెట్టలేదు. షూటింగ్ మరుగ్గా జరుగుతున్నది. నిర్మాత మెహబూబ్, దర్శకుడు జియా సర్హదీ. ఈ చిత్రంలో కొత్త నటుడు జాన్ ఫెలానీ నటిస్తున్నాడు. ఇతడు హెర్బర్ట్ మార్షల్ ప్రదర్శించిన రష్యా నాటకం "పిగ్మాలియన్"లో నటించి పేరు పొందినాడు.

* * *

ప్రపంచ ప్రసిద్ధిచెందిన ప్రచారకుడైన స్వామి వివేకానంద జీవితచరిత్రను హిందీ, బెంగాలీ భాషలలో బెంగాలీనిర్మాత, దర్శకుడు అమర్ మల్లిక్ నిర్మిస్తున్నాడు. వివేకానందగా అజిత్ ప్రకాష్ అనే సుప్రసిద్ధుడైన యువకుడు నటిస్తున్నాడు. బెంగాల్ నటీమణి సుప్రభాదేవి అతని తల్లిగా నటిస్తోంది. ఈ చిత్రంలో వివేకానందుడు రామకృష్ణ పరమహంస శుశ్రూష చేసిన దృశ్యాలు, అమెరికా, యూరోపులు పర్యటించిన వృత్తాంతం ఉంటాయి.

ఈ సంవత్సర ఆరంభదినాల్లో బొంబాయిలో రెండు కొత్తచిత్రాలు విడుదల అయినవి. ఒకటి "చక్రధారి," మరొకటి "పెహలీ తారీఖ్" ఈ రెంటిలోనూ నాయికపాత్రలు నిరూపారాయ్ ధరించింది. ఒక మహారాష్ట్ర భక్తుని జీవితకథ "చక్రధారి"కి ఆధారం. చక్కగా నిర్మించబడినది. మంచి సంగీతం, ట్రిక్ ఫొటోగ్రఫీ ఈ చిత్రంలోని ఆకర్షణ. నిరూపారాయ్, సాహు మోడక్, [illegible] చక్కగా నటించారు. ఇందిర, [illegible] అనే యిద్దరు కొత్తవారు ఈ చిత్రంలో వున్నారు. ఇందిర నటన పేరా బాగా లేదు కాని రూపలక్ష్మి మంచిదైనందున బాగా పైకి రాగలదనే ఆశ కలిగించింది. దర్శకుడు రాజేష్ బి. దేశాయ్. '[illegible]'లో పాటలు రచించిన కవి ప్రదీప్ ఈ చిత్రానికి కూడా మంచి పాటలు వ్రాశారు.

"పెహలీ తారీఖ్" దర్శకుడు రాజా నేనే. ఆయనే కథానాయకపాత్ర నిర్వహించాడు. నిరూపారాయ్, ఆగా, అంబర్, రమేష్ కపూర్, సుధా, [illegible] మున్నగువారు నటించారు. మధ్యతరగతి కుటుంబీకుని కథ. అతడు పనిచేస్తున్న బ్యాంకి మూసివేయబడుతుంది. తిరిగి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాడు. కాని విఫలుడౌతాడు. పరిస్థితుల నెదుర్కొనలేక ఆత్మహత్య చేసుకోబోతాడు. ఇంతవరకూ చిత్రంలో కొంచెం బాగానేవుండి ఆసక్తి కలిగిస్తుంది. అతరవాత సుదీర్ఘ సన్నివేశాలతో ప్రేక్షకులకు విసుగెత్తేట్లు నడుస్తుంది. నటన చాలా చక్కగా వున్నది. చిత్రం నిడివి తగ్గిస్తే ఇంతకంటె బాగుండేదేమో అనిపిస్తున్నది.



పక్షిరాజా స్టూడియో (కోయంబత్తూరు)లో తయారవుతున్న హిందీ 'అగ్గిరాముడు' చిత్రం 'ఆజాద్'లో నాయికానాయకులుగా నటిస్తున్న మీనాకుమారి, దిలీప్‌కుమార్‌లను 'నేను చెప్పినట్లు జాగ్రత్తగా చెయ్యాలి సుమా' అని హెచ్చరిస్తున్న డైరెక్టరు శ్రీరాములు నాయుడుగారు

ప్రేక్షకుల అభిప్రాయాలు

"సతీ సక్కుబాయి"

శ్రీ రాజరాజేశ్వరీవారి "సతీ సక్కుబాయి" చిత్రం, వినూత్నమైన, వింత శోభతోను, ఆకర్షణీయంగా, మనోరంజకంగా వుందనుటలో అతిశయోక్తి లేదు సక్కుబాయిగా యస్ వరలక్ష్మి చక్కగా నటించి ప్రేక్షకులకు తన మధురమైన సంగీతాన్ని అందించి, అభిమానాలను చూరగొన్నది. ఉత్తమంగా నటించి కన్నాంబ ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచింది రేలంగి చక్కగా నటించారు శివరావు తన పూర్వపు విశిష్టతను ఋజువుచేసుకున్నారు రఘురామయ్య పాడిన పద్యాలనూ, పాటలనూ తగ్గించివుంటే బాగుండేది మిగతా నటీనటు లందరూ తగిన పాత్రలలో నటించి, చిత్రానికి న్యాయం చేకూర్చారు

ముఖ్యంగా రా[illegible]రి సంభాషణలూ, గోపాలంగారి పాటలు, ఫొటోగ్రఫీ, శబ్దగ్రహణం చక్కగా వున్నవి ఇలాంటి భక్తి ప్రబోధక చిత్రాన్ని నవ్యపంథాలో అందించిన దర్శకులూ, నిర్మాతలూ అయిన శ్రీ నాగభూషణంగారు అభినందనీయులు

"నలశ్రీ"—కావలి.

* * *

రాజరాజేశ్వరి "సక్కుబాయి" చిత్రం చక్కగా ఉంది గయ్యాళి అత్తగా కన్నాంబ, సక్కుబాయిగా వరలక్ష్మి, ఆమె భర్తగా రేలంగి అద్భుతంగా నటించి, చిత్రానికి జీవం పోశారు సి ఎస్ ఆర్ నటన మామూలు స్థాయిలో ఉంది ఫొటోగ్రాఫీ, సౌండ్ నిర్దుష్టంగా ఉన్నాయి 'మాటలు, పాటలు' రమ్యంగా ఉండి ప్రేక్షకులకు చక్కిలిగింతలు పెట్టాయి చిత్రం మొత్తంలో రక్తి కట్టింది—

వట్లూరి రాజేశ్వర రావు,
—కొల్లంకోడి

చిత్రం బాగుంది కానీ ప్రధానమైన "సక్కుబాయి" చిత్రమును నిర్మించుటయందు రాజరాజేశ్వరీవారు కృతకృత్యులయ్యారు చిత్రంలో కృష్ణుని పద్యములు కొన్ని తగ్గించినా ఫరవాలేదు కనకం, శివరావుల నటన అసభ్యంగా వుంది వరలక్ష్మి, కన్నాంబ, సి. ఎస్. ఆర్. చక్కగా నటించారు విశ్వనాథ్‌గా రేలంగి చిత్రాన్ని రాణింపచేశారు మ్యూజిక్ చాల బాగుంది [illegible] చిత్రం రుచించకపోయినా విజయవంతమవుతుందని ఆశించవచ్చును డైరక్షన్ బాగుంది, పద్యాలు కొంత విసుగు పుట్టించాయి

ఎస్ లక్ష్మీనారాయణ,
—గుంటకల్.

"రామదాసు" నాటకం


మొన్న వైకుంఠ ఏకాదశినాడు ఆంధ్రాభ్యుదయ నాటక కళాసమితివారు మద్రాస్, సౌందర్యమహల్‌లో "భక్త రామదాసు" నాటకం ప్రదర్శించారు రామదాసుగా అరణి సత్యనారాయణ, తానీషాగా డా॥ ఎస్ వి రావు, కబీర్‌గా వి ఎస్ శర్మ, తదితరులు నటించారు.

Edited, Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



బోధిసత్త్వుడు (అజంతా)

—ఏలూరి నాగభూషణం.


అభినందనలు
చమ్రియా టాకీ
డిస్ట్రిబ్యూటర్స్
మద్రాసు · విజయవాడ · గుంటకల్ · మధుర
సికింద్రాబాద్ · బెంగుళూరు · త్రివేండ్రం
ఎర్నాకులం
25 సంవత్సరములు అన్ని భాషలలోని
చలనచిత్రములను అందచేయుచున్న
ప్రముఖ సంస్థ......
రజతోత్సవ సంవత్సరము
1930-1955